# శ్రీసత్యసాయి ప్రేమకిరణాలు

ప్రేమపిలుపు

కనులకగుపడు  దృశ్యంబుగాంచి మీరు
సత్యమిదియని యెంచక సంబరమున
తెరను దాగిన సత్యంబు తెలిసికొనగ
విశ్రమింపక నాతోడ తరలి రండు.

# విషయానుక్రమణిక


1. భగవాన్
2. బహిర్దృష్టి...అంతర్దృష్టి
3. శివరాత్రి
4. సత్యాన్నాస్తి పరోధర్మః
5. ఈశ్వరేచ్ఛ ప్రతిబింబమే సమాజము
6. లింగోద్భవము
7. సాక్షీభూతుడు
8. అవతరణ...ప్రేమబోధ
9. ఆనందమే...ఆహారము
10. చమత్కారము...సాక్షాత్కారము
11. సంపూర్ణ శరణాగతి
12. ప్రశాంతినిలయము
13. సిద్ధసంకల్పము
14. దశసూత్ర ప్రణాళిక
15. నా జీవితమే నా సందేశము
16. అభయప్రదానము

# భగవాన్

**క్రమము తప్పక మింట ప్రతి దినంబును భాను**
**డుదయాస్తమయముల నొందనేల?**
**గగనంబునకు కాంతికైసేయు తారలు**
**పగలు మాత్రము దాగు భంగియేల?**
**క్షణమైన విశ్రాంతి గొనక తా పవనుండు**
**జీవకోటుల బ్రోవ వీవనేల?**
**అనిశంబు కలకల ధ్వనుల నవ్వుచు నది**
**సలిలమై ప్రవహించు చందమేల?**
**ప్రకృతిలొ నెందు చూచిన భ్రమయె ఏల?**
**భువిని ధన కుల మత జాతి భేదమేల?**
**ఎవరి యానతి నిదియెల్ల నిట్లు జరుగు?**
**అతడె యితడని యితడె యతడనుచు**
**సర్వులకధిపతి యనుచు గాంచరయ్య.**

జగత్తు అనగా పుట్టి, పెరిగి, పోయే లోకము. ఈ లోకానికి ఆధారము భూమి. ఎడతెరిపి లేకుండా యింటా బయటా సర్వత్రా అహోరాత్రాలు గాలి వీస్తున్నది. కానీ మన కంటికి కనిపించటం లేదు. పగలు ఆహారకార్యకలాపాలతో కాలము గడచిపోతున్నది. రాత్రి నిశ్చింతగా జగత్తు నిద్రిస్తున్నది.

ప్రపంచములో ఏదో ఒకవైపున ఎప్పుడూ సృష్టిస్థితిలయాలు జరుగుతూనే ఉంటాయి. పురుళ్ళు, పెండ్లిపేరంటములు, చావులు క్షణక్షణమూ జరుగుతూ నవ్వులతో, ఏడ్పులతో కాలం గడచిపోతున్నది. దానికి విరామమే లేదు. బండలను కరగించే ఎండలు, కుండపోతవంటి వర్షము, జలమును గడ్డకట్టించే చలి, సమశీతోష్ణాలు. ఇట్టి పరిణామములతో కాలస్వరూపమైన సంవత్సరము కదలిపోతూనే ఉంటుంది. ఈ దృశ్యజగత్తును అర్థంచేసుకోటం చాలా కష్టం.

ప్రాణికి పుట్టటంతోనే ఆకలి రేకెత్తుతుంది. నాభికోశము కోసినంతనే బిడ్డ కెవ్వుమని ఏడుస్తుంది. తేనెనో, పాలో నాలుకకు రాయటంతోటే ఆకలి తీరి చల్లగా నిద్రిస్తుంది. మానవునికి ప్రధానమైనది ఆహారము. ఆహారము ధాన్యమునుండి లభిస్తుంది. ధాన్యం నీటివల్ల అభివృద్ధి అవుతుంది. నీరు త్రాగిన భూమి పంటను అందిస్తుంది. మంత్రతంత్రాలతో, ధనంతో కడుపు నిండదు. ఆకలి తీరదు. కనుక మొట్టమొదట మానవుడు కృషికలాప నిమిత్తమై నడుము వంచుతాడు. పాడిపంటలు అభివృద్ధి గావించుకుంటాడు. కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర, ఒంటి నిండా వస్త్రము, ఇంటినిండా పిల్లలు, ఇదే ప్రధానమని భావించాడు ప్రప్రథమంలో. కానీ క్రమేణా తెలివితేటలు పెరిగాయి. గుడిసెలు భవనాలైనాయి. జనాభా పెరిగి పోయింది. పల్లెలు పట్టణాలుగా మారాయి. తెలివితేటలు వికాసంచేత మానవుడు తెలుసుకోవలసినవన్నీ తెలుసుకున్నాడు. అయితే తనకు తెలియనివి కూడా కొన్ని ఉన్నాయని గ్రహించగలిగాడు.

మానవుడు భూమిని చేయలేడు. నీటిని సృష్టించలేడు. గాలిని పట్టలేడు. గట్టిగా ముక్కు, మూతి మూసుకుంటే ఉక్కిరిబిక్కిరి అవుతాడు. చెట్టుకొమ్మలు రెండు రాసుకున్నప్పుడు అగ్ని పుడుతుంది. కట్టెలో అగ్ని ఉండి కూడా కట్టెను కాల్చలేకుండా పోతున్నదే అని ఆశ్చర్యంగా భావించాడు ఆనాటి మానవుడు. ఇది మానవుడు చేయలేని పని. జగత్తులో నిరంతరము జననమరణాలు జరుగుతున్నాయి. దీని రహస్యమేమిటో యింతవరకు ఎవ్వరూ గుర్తించలేకపోతున్నారు. తమ తెలివితేటలచేతగానీ, విద్య,అధికారములచేతగానీ చేయలేనివి జగత్తులో ఎన్నో ఉన్నాయని మానవులు గుర్తించారు. ఈ అన్నింటి వెనుక ఏదో ఒక మహత్తరమైన శక్తిఉన్నదని ఊహించారు. అది మానవాతీతమైన శక్తి అని విశ్వసించారు. ఏది లేకపోతే జగత్తునందు మానవజాతి నిలువలేదో, ఇంకే ప్రాణి జీవించ జాలదో, ఏ

వృక్షజాలముకూడా అభివృద్ధి చెందలేదో ఆ ఆధారతత్వాన్ని విచారించాలని పూనుకున్నారు. వీరి విచారణలు, పరిశోధనలు మూఢనమ్మకాలు కావు. భ్రాంతి కాదు. మహత్తరమైన తపఃశక్తితో సత్యమును తెలుసుకోటానికి ప్రయత్నం చేశారు. దీనినే దైవాన్వేషణగా భావించారు

ప్రాచీనమహర్షులు భారతీయ సంస్కృతి నిజస్వరూపాన్ని దర్శించి, ఆచరించి, ఆనందించి జగత్తుసకందించారు. కాలంతో మారనిది, చరిత్రతో మాయనిది, ప్రళయంతో తరగనిది, సృష్టితో పెరగనిది ఏ సత్యస్వరూపమైతే ఉన్నదో ఆ సత్యస్వరూప రూపకల్పనయే భారతీయసంస్కృతి. ఈ సంస్కృతి అంతరాత్మ సనాతన ధర్మము. ఇది జీవితములను అంకితము గావించి సాధించిన సుధానిధి. ఆనాటి మహర్షులు సర్వజ్ఞులు, సర్వశక్తిమయులు, సర్వసంగపరిత్యాగులు, నిశ్చలహృదయులు, నిస్వార్థపరులు. అలాంటి మహనీయులు అనేక పరిశోధనలు సల్పి ఈ పరమ సత్యాన్ని జగత్తుకు తెలిపారు. ఈనాడు తెలివితేటలు పెరిగాయిగానీ గుణము ఏమాత్రమూ కనిపించటము లేదు. అన్నింటికీ తర్కమే. అన్నింటికీ హేతువాదమే. అసలు హేతువంటే ఏమిటో తెలియదు. వాదానికి మాత్రం సిద్ధమవుతారు. కనుకనే యిలాంటి అజ్ఞాన మానవులలో దైవత్వం ఆవిర్భవించటం, దైవత్వాన్ని దర్శించగలగటం అసాధ్యమైపోయింది. ఈ విద్యపైనా, తెలివితేటలపైనా ఆధారపడి ఆత్మరూపుని దర్శించటం వీలుకాదనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. గుడ్డి విశ్వాసమంటూ, మూఢవిశ్వాసమంటూ మరొకటి లేదు. ఈ విశ్వాసానికి హేతువుగానీ, సమయసందర్భములుగానీ లేవు. ఇది హేతువాదానికి అతీతమైనది. దీనికి కారణాలు వెతకటమే ఒక మూర్ఖత్వం.

నమ్మకమనేది ఎలాంటిదానినైనా సాధించగలుగుతుంది. పవిత్రమైన హృదయంనుండి ఆవిర్భవించిన నిర్మలమైన భావం మూఢనమ్మకం అవదు. కలియుగంలో భగవత్తత్వం కానరాదంటారు. కాదుకాదు. ఏ యుగమైనాకానీ నిశ్చలమైన, నిర్మలమైన, కేవలం నిస్వార్థమైన హృదయం కలవాడు ఎక్కడ ఏ నిముషంలోనైనా భగవంతుని దర్శించటానికి అధికారిగా ఉంటాడు. దైవమనేది దేశకాల ప్రభావాలకు అతీతమైనది. కనుకనే మొట్టమొదట విశ్వాసం పెంచుకోవాలి. విశ్వాసము లేనివాడు దేనినీ సాధించలేడు. విశ్వాసమున్నవాడు అన్నింటినీ సాధించగలడు. కనుక దైవాన్ని పొందాలనుకుంటే విశ్వాసమనే పునాది ఉండాలి. ఆ పునాదిని భద్రం చేసుకోవాలి.

నీకు దైవం కావాలనుకొంటే ఆనందం నీలో ఉట్టిపడాలి. ఆనందం ఉట్టిపడాలనుకుంటే సత్యమార్గంలో ప్రవేశించాలి. సత్యమార్గంలో ప్రవేశించాలంటే శాంతహృదయాన్ని కలిగి ఉండాలి. శాంతహృదయం ఏర్పడాలంటే ప్రేమ తత్వాన్ని పెంచుకోవాలి. ప్రేమతత్వం రావాలంటే నీవు నమ్మకంలో ప్రవేశించాలి. కానీ ఈనాటి మన విశ్వాసం యిటూఅటూ ఊగుతూ ఉంటుంది. ఒక నిముషం పైకి, ఒక నిముషం క్రిందికి. నమ్మకం పుడుతూ ఉంటుంది, చస్తూ ఉంటుంది. ఇలాంటి పుట్టిచచ్చే నమ్మకాలతో పుట్టిచావనటువంటి దైవత్వాన్ని పొందటం సాధ్యమవుతుందా?

**చావుపుట్టుక లేనట్టి శాశ్వితుండు**
**ఆదిమధ్యాంతరహితుడనాదివాడు**
**తాను చావక పుట్టక చంపబడక**
**అన్నిటను సర్వసాక్షియై తాను వెలుగు**

నీ నమ్మకం చచ్చిపుట్టినట్లుగా దైవత్వము చచ్చిపుట్టే వాడు కాదు. దైవత్వానికి ఏపేరైనా పెట్టి పిల్చుకోవచ్చు. దైవానికి పెట్టిన పేర్లేగానీ పుట్టిన పేర్లు కావు.

మన నిత్యజీవితంలో నిత్యకర్మలనాచరించటానికి, జీవిత రహస్యాన్ని గుర్తించటానికి ప్రధాన ఆధారపురుషుడు 'సూర్యుడు' అని మొదట విశ్వసించారు. సూర్యుడు లేకున్న దినములు లేవు. మానవుడేకాదు ఏ ప్రాణికూడా ఉద్భవించటానికి అవకాశము లేదు. సమస్త ప్రాణులు, పశుపక్షులు, వృక్షాదులతో సహా సూర్యోదయంతోటే అభివృద్ధిగాంచు తున్నవి. కమలము, కలువలు సూర్యోదయాస్తమయాలతోనే విచ్చుకుంటున్నాయి. కనుక సమస్త సృష్టికి, పోషణకు, క్షీణమునకు సూర్యుడే మూలకారకుడని భావించారు. ప్రత్యక్ష స్వరూపుడైన దైవము సూర్యుడేనని ఆనాటినుండి ఆరాధనలు ప్రారంభించారు. ఆనాటి మహర్షియైన విశ్వామిత్రుడు గాయత్రి మంత్రములో సూర్యునికే ప్రధాన దేవతా స్థానము యిచ్చాడు.

ఒక్కడే పెక్కు జలపాత్రలలో తన రూపమును దర్శింపజేసేవాడు సూర్యుడు. సూర్యుడొక్కడే అయినప్పటికీ జలముతో నిండి

ఉన్న పాత్రలలో ఒక్కొక్కడుగా రూపొందింప చేస్తాడు. అదేవిధముగా మానవదేహమును ఒక్కొక్క పాత్రగా ఊహించారు ఋషులు. పాత్రలలో భావములనే జలము నింపారు. ప్రతి మానస సరోవరమునందుకూడా దివ్యతేజము, సూర్యతత్త్వము ప్రకటితమవుతుంది. అదేవిధముగా భగవంతుడు సర్వజీవులలో సూర్యరూపముతో ఉన్నాడని గుర్తించి అతనికి 'ఆదిత్యః' అని యింకొక పేరు పెట్టారు. అనగా ఒక సూర్యుడే అనేక పాత్రలందు తన రూపమును ప్రకటించినట్లుగా భగవంతుడు ఒక్కడే అయినప్పటికీ అన్నిదేహములందు, అన్ని జీవరాశులందు ప్రకటితమవుతున్నాడు అన్న సత్యాన్ని మహర్షులు చాటారు. అంతర్బహిర్ తత్త్వములందు, స్వరూప స్వభావములందు, ప్రత్యక్షఅప్రత్యక్ష తత్త్వములందు దైవత్వమనే శక్తి వ్యాపించి ఉన్నదనే సత్యాన్ని వారు విశ్వసించారు. తదుపరి దాని అంతరార్థమును విపులంగా జగత్తులో వ్యాపింపచేసే నిమిత్తమై మహర్షులు తపస్సులాచరించారు. 'వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్' అంధకారమనే చీకటికి ఆవలనున్న తేజోవంతుడైన పరమాత్ముని మేము చూశాము. జనులారా! మీరుకూడా చూసి తరించండి అని ప్రబోధించారు. ఆ తేజోవంతుడు నిస్వార్థపరుడు. మంగళస్వరూపుడు. గుణరహితుడు. కనుక అతనికి 'శివః' అని ఒక కొత్త పేరు పెట్టారు. శివః అనగా త్రైగుణ్య రహితుడు. అనగా త్రిగుణములు లేనివాడు. గుణములు లేనివాడు కనుక యితడు పరిశుద్ధుడు. అశుద్ధము కల్పించేది గుణములే. భగవంతునికి గుణములులేవు కనుకనే పరిశుద్ధుడు. నిర్గుణుడు, నిరంజనుడు, సనాతనుడు, నికేతనుడు. ఇలాంటి తత్త్వానికి శివః అని పేరు పెట్టారు.

ఇతనికి గుణములు లేవుగానీ సర్వశక్తులూ ఉన్నాయి. ఇతడు పరిశుద్ధుడేగానీ సర్వత్రా వ్యాపించి ఉన్నాడు. ఇతడు సర్వైశ్వర్యస్వరూపుడు. షడ్గుణైశ్వర్య స్వరూపుడు. ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, త్యాగము, జ్ఞానము, కీర్తి యీ ఆరువిధములైన సంపత్తులు యితని దగ్గర ఉన్నాయని అనుభవరీత్యా గుర్తించి అతనికి ఈశ్వరః అని మరొక పేరు పెట్టారు. ఈశ్వర అనగా సకలైశ్వర్య స్వరూపుడు. ధనకనకవస్తువాహనాదులే కాకుండా మానవత్వమందున్న దివ్యగుణములుకూడా ఐశ్వర్యములేనని నిరూపించారు ఆనాటి ఋషులు.

ఇంతటితోనే వారి పరిశోధనలు ఆగలేదు. అతనిని నమ్మి, ఆరాధించి, భజించి, పూజించి, ఆశ్రయించిన వారిని రక్షించేవాడనికూడా విశ్వసించారు. ఆశ్రయించేవారిని ఆదరించే స్వభావము కలదు కనుకనే అతనిని శంకరః అన్నారు. అతని సంకల్పములకుగానీ, అతని అనుగ్రహమునకుగానీ కారణములు ఏమాత్రము ఉండనక్కరలేదు. అతని సంకల్పమే కారణము. అతడు సంకల్పించుకున్న భావములే సమస్త సృష్టిస్వరూపములు. తన సంకల్పాలకు స్వతంత్రుడై ఉండటంచేత అతనిని స్వయంభుః అన్నారు. తనకు తానే సంకల్పించుకొని శరీరము ధరించేవాడు కనుక స్వయంభుః అని పేరు పెట్టారు. ఇంతమాత్రమేకాదు. మానవుల కోర్కెలను, కష్టసుఖములను గుర్తించి వీరి ప్రార్థనల నాలకించి, ధర్మసంస్థాపనకై అవతరించటానికి అతనికి సంపూర్ణ స్వాతంత్ర్యమున్నదని వారు భావించారు. ఈవిధమైన అనుభూతిని పొందటంచేత అతనికి 'సంభవః' అని మరొక పేరు పెట్టారు. అనగా ధర్మగ్లాని కల్గినప్పుడు స్వేచ్ఛగా వచ్చి ఆవరించిన కష్టములను, బాధలను నివారించగలడు కనుక సంభవః అని పేరు పెట్టారు.

ప్రమాణములు మూడు రకములు. ప్రత్యక్ష ప్రమాణము, అనుమాన ప్రమాణము, శబ్ద ప్రమాణము. ప్రత్యక్ష ప్రమాణమనగా ఏమిటి? ఒక చిన్న ఉదాహరణ. ఇక్కడొక వ్యక్తి ఉంటున్నాడు. ఇతని ఎత్తు ఆరడుగులు. బరువు ఎనభై కిలోలు. తెల్లగా ఉంటున్నాడు. ఇది ప్రత్యక్ష ప్రమాణము. కాని అతనికే తెలియని గుణములు అతనిలో ఉంటున్నాయి. ఎంతో ప్రేమభావం, త్యాగభావం అతనిలో ఉంటున్నాయి. వాటిని నీవు చూడగల్గుతున్నావా? అవి కనిపించనంత మాత్రాన వాటిని విస్మరించి కేవలం ఆకారాన్ని మాత్రమే చూడటం మూర్ఖత్వంకాదా! అతనికి ఏవిధమైన లింగభేదములు లేవు. ఇలాంటి విషయాలకు దూరమైనవాడు కనుక యిట్టివాడు అట్టివాడు అని చెప్పటం సాధ్యముకాదు. పాలు పెరుగైనట్లు జీవుడు దేవుడౌతాడని చెప్పటానికికూడా సాధ్యంకాదు. ఎట్టి ప్రత్యక్ష ప్రమాణములకు చిక్కనివాడు. ప్రత్యక్ష ప్రమాణములందు 'యద్భావం తద్భవతి' మన భావాలనే బాహ్యరూపంగా దర్శిస్తున్నామేగానీ నిత్యమైన, సత్యమైన స్వరూపాన్ని ఈ ప్రమాణాలతో చూడలేమని గుర్తించారు ఋషులు.

ఇక అనుమాన ప్రమాణమనగా కొండపైన కనిపించే పొగ ఆధారంగా అక్కడ నిప్పు ఉండవచ్చని భావించటం. ప్రాకృత పదార్థములందు ఈ అనుమాన ప్రమాణము కొంతవరకూ నిజం కావచ్చుగానీ పరతత్త్వమందు యిలాంటి అనుమానానికి ఆధారమే ఉండదు. దేనిని, ఏశక్తి చూసి నీవు భగవంతుడని విశ్వసించగలవు? ఆశక్తి భగవంతునిదేనని ఏట్లా నీవు గ్రహించగలవు? మానవాతీతమైన శక్తి అని నీవు భావించినప్పటికీ ఆధారభూతమైన శక్తి ఒకటి ఉంటున్నాది. ఒక విత్తనాన్ని చేతిలో పెట్టుకున్నప్పుడు విత్తనం స్వరూపమునే నీవు చూడవచ్చుగానీ విత్తనంలోని వృక్షాన్ని నీవు చూడలేవు. ఈ విత్తనం ఈవిధమైన వృక్షంగా వర్ధిల్లుతుందనేది

నీ భావమేగానీ అది సత్యము కాదు. అదేవిధంగా దైవత్వం విషయంలో ప్రత్యక్ష, అనుమాన ప్రమాణాలలో దేనికీ ఏమాత్రం అవకాశము లేకుండా ఉంటుంది.

ఇంక శబ్ద ప్రమాణము. వేదములను కేవలం వల్లించవచ్చునేగానీ స్వరూపమును నిరూపించలేదు. అందువల్లనే అన్నీ త్యాగం చేస్తేనే అమృతత్వమైన దైవత్వం నీకు లభిస్తుందని వేదం చెప్పింది. అంతకు మించి మరొకటి తెలుపకుండా పోయింది. అందువలననే వేదాంతము నేతి నేతి , యిదికాదు, యిదికాదు అని చెబుతుంది. ఈవిధమైన పరిశోధనలు సల్పి భగవంతుని ప్రత్యక్షంగా కానీ, అనుమానంగా కానీ, శబ్దరూపంలోగానీ నిరూపించటం సాధ్యముకాదని గ్రహించి 'అప్రమేయః' అని మరొక పేరు పెట్టారు. ఎట్టి ప్రమాణములకు చిక్కనివాడు కనుక అప్రమేయుడు అని అన్నారు.

శివః, శంకరః, సూర్యః, ఆదిత్యః, అనే పేర్లకు అర్థం చెప్పటం అసాధ్యమవుతుందేమోనని మరొక రీతిగా విచారణ సాగించారు. ఇతను సృష్టిస్తున్నాడు అంతటితో ఆగటంలేదు. దీనిని పోషిస్తున్నాడు. ఎంతో దయతో పోషించిన దానిని శిక్షిస్తున్నాడు. అనగా యితడు కేవలం సృష్టికర్త మాత్రమే కాదు, పోషణకర్త, లయకర్త కూడా. సృష్టి, స్థితి, లయములు మూడింటికీ కారణభూతుడై ఉన్నాడు. ఈ మూడింటికి తగిన సర్వశక్తులూ యితనిలో యిమిడి ఉంటున్నాయి. సర్వమూ అతనియందే ఉన్నది. అనుగ్రహించగలడు. లౌకిక, అలౌకిక సర్వశక్తిమయుడు. కనుక యితనికి మరొక పేరు పెట్టాలని భావించారు ఋషులు. సర్వమానవులందరూ పిలచి, కొలచి, ఆరాధించి, ఆశ్రయించి, ఆనందించటానికి పేరు సులభంగా ఉండాలని భావించారు. ఆపేరే 'భగవాన్'. భగవాన్ అనగా ఐశ్వర్యముతో, ధర్మముతో, యశస్సుతో, సిరితో, జ్ఞానముతో, వైరాగ్యముతో, సృష్టిస్థితిలయములతో సర్వవిషయములతో కూడినవాడు. అతనిని భగవాన్ అని నిర్ణయించారు.

## 2

## బహిర్దృష్టి.. అంతర్దృష్టి

**ధనధాన్యములు కల్గి ధర్మగుణంబున్న**
**సంతతి లేదనే చింతయుండ**
**దైవభక్తి కలిగి ధర్మగుణంబున్న**
**ధనము లేదని యెంతొ దనరుచుండు**
**విత్తంబు లేకను వెతలెన్నొ పడుచున్న**
**పేదలకెందరో బిడ్డలుండు**
**సంపదలుండియు సంతోషమున్నను**
**పెద్దదియైన లోభితనంబుండు**
**ఇన్నితీరులు కూడ దైవేచ్ఛగాన**
**దీనవత్సలు డతని ప్రార్థింతురేని**
**సృష్టి చిత్రంబు లెంత విచిత్రమైన**
**భక్తి శక్తియు ముక్తియు బాబయిచ్చు.**

మానవుడు సృష్టి రహస్యములను గుర్తించుటకు ప్రయత్నించి విఫలుడైపోతున్నాడు. సృష్టిరహస్యమతి విచిత్రము. హరియొక్కచరిత్ర హరికే తెలియును. సృష్టిరహస్యాన్ని గుర్తించే బదులు, దానిని అనుభవించటము మానవుని కర్తవ్యము.

'ఈశానాం స్సర్వవిద్యానాం ఈశ్వరస్సర్వభూతానాం బ్రహ్మాధిపతిర్ బ్రహ్మణోధిపతిర్ బ్రహ్మాశివోమే అస్తు సదాశివోం....' ఈ సృష్టి అంతయు ఈశ్వర తాండవమే. ఇది అత్యంత అమోఘమైన నటనయే. ఇది మనోహరమైన దృశ్యమే..... ఇది యింతే. మనమున్నది భూమండలము. దానిని ఆశ్రయించి పరిభ్రమించుచున్నది చంద్రమండలము. భూమండలమును, చంద్రమండలమును ప్రకాశింపచేయుచున్నది సూర్యమండలము. సూర్యుని ఆశ్రయించి శుక్రుడు, కుజుడు, బుధుడు, శని యిత్యాది గ్రహములు తమ కర్తవ్యములను నిర్వహించుచున్నవి. ఈ గ్రహములు, ఉపగ్రహములు సూర్యుని కుటుంబము. మనము రాత్రియందు కళ్ళెత్తి చూచిన లెక్కకుమించి నక్షత్రములను గమనించుచున్నాము. అసంఖ్యాక నక్షత్రములతో చేరిన పాలపుంత అని చక్కని నక్షత్రకూటమి మనకు కనబడుతుంది. ఈ మండలమందు పదివేల కోట్లకు మించిన నక్షత్రములున్నాయి. ఇటువంటి మండలములు పది కోట్లకుమించి ఉండవచ్చును. వీటినే గ్యాలాక్సీలంటారు. మనము ఉంటున్న భూమండలమునకు, సూర్యమండలమునకు తొమ్మిదికోట్ల మైళ్ళదూరము ఉంటున్నాది. సూర్యమండలమునకు యమనక్షత్రమునకు 367 కోట్లమైళ్ళ దూరము. ఈ యమ నక్షత్రము సూర్యునిచుట్టూ తిరుగుటకు 248 సంవత్సరములు పడుతుంది.

అయితే భగవంతుడు పనిలేక యీ మండలములన్నింటినీ కల్పించాడా లేక ఈ సృష్టిద్వారా జగత్తునకేమైనా గుణపాఠమును నేర్పించుచున్నాడా అన్నవిషయము మనము గుర్తించాలి. భగవంతుడు కారణములేని కార్యమునుగానీ, పనికిరాని వస్తువునుగానీ సృష్టించడు. భూమి తనచుట్టూ తాను తిరుగుటచేత రాత్రింబవళ్ళు యేర్పడినవి. తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యునిచుట్టూ తిరుగుటచేత మేఘములు, వర్షములు యేర్పడి తద్వారా పంటలను పండించి జీవరాసులను పోషించేందుకు వీలవుతుంది. దైవము లోకకళ్యాణ నిమిత్తమై, మానవుని ఉద్ధరించే నిమిత్తమై యీ సృష్టిని కల్పించాడు. పగలు, రాత్రి యేర్పాటు చేయటములోని అంతరార్థము యేమిటి? పగలు అనే దినమునకు పవిత్రమైన విశ్రాంతినందించే నిమిత్తమై భగవంతుడు రాత్రిని సృష్టించాడు. అలసిపోయిన మనస్సుకు, దేహమునకు విశ్రాంతినందించేనిమిత్తమై దేవుడు నిద్రను మానవునికి యిచ్చాడు. ఆరోగ్యభాగ్యమునందుకొనే నిమిత్తమై భగవంతుడు రాత్రిని సృష్టించాడు.

హృదయమే ఉత్తమ బోధకుడు, కాలమే ఉత్తమగురువు, ప్రపంచమే ఉత్తమ గ్రంథము, భగవంతుడే ఉత్తమ మిత్రుడు. దైవసంకల్పముచే నిర్మితమైన ఈ జగత్తులోని ప్రతి పదార్థము, ప్రతిజీవి మనకు అనేక పాఠములను బోధిస్తున్నాయి. సమాజములో అందరూ అతినీచంగా, అతి అసహ్యంగా భావించే మృగము గాడిద. ఆ గాడిదనుండి మానవుడు నేర్చుకోవలసిన గొప్ప గుణము ఉంటున్నాది. సహనభావము. ఎన్ని భారములు వేసినా సహనంగా ఓర్చుకుంటుంది. ఎన్ని దెబ్బలు కొట్టినా సహనంగా అనుభవిస్తుంది. తిండితీర్థాదులు లేకపోయినా ప్రసన్నవదనంతో కనిపిస్తుంది. కనుక, గాడిదనుండి మనము నేర్చుకోవలసింది సహనము, ఓర్పు. కుక్కలవలన మనము విశ్వాసము అనేదానిని నేర్చుకోవచ్చు. గాడిద ఓర్మిని నేర్పుతుంది. గుడ్లగూబ ఏకపత్నీవ్రతమును బోధిస్తున్నది. చీమ దూరదృష్టిని నేర్పుతుంది. సాలెపురుగు పట్టుదలను బోధిస్తుంది. ఈవిధముగా జీవరాసులు మానవునకు అనేక సత్యములను నిరూపిస్తున్నవి.

సృష్టియొక్క రహస్యమును గురించి ఒక కథ. తమోగుణము, రజోగుణము, సత్వగుణము మూడూ చేరి మానవాకృతి అయినది. సాత్వికగుణములచే దేవతలు, రాజసగుణములచే మానవులు, తమోగుణములచే దానవులు రూపొందిరి. మానవులకు బుద్ధికుశలత ఎక్కువ. వారికి జ్ఞానసిద్ధి లభించును. తమ దివ్యత్వము తెలుసుకొనే అవకాశము కలదు. దేవతలు ఈశ్వరుని దగ్గరచేరి 'ప్రభూ! సృష్టిరహస్యమును మానవులు, దానవులు గ్రహించిన మీ దివ్యత్వానికి హాని. దాని వలన ఈ జ్ఞానమును ఆకాశములోనే పెట్టుతాము' అని చెప్పిరి. కాబట్టి ఎవరూ దానిని గుర్తించలేరు. మానవులు ఆవేదనతో ప్రార్థించగా దానిని జలములో దాచారు. చివరకు ఈశ్వరుడు వారి తపస్సుకు ప్రత్యక్షమై అందరి హృదయకమలములందు నిలిపిరి. అక్కడ పంచభూతముల, పంచప్రాణముల, పంచకోశముల లోపల ఆత్మతత్వమున్నది. దానిని సాధన ద్వారా అనుభూతికి తెచ్చుకోవలెను. విలువైన సొమ్ము యింటిలోపల భద్రపరుస్తాము. అటులనే ఆత్మతత్వమును అంతరంగములోనే వెతకాలి. నౌకరీ స్థితిలోనున్న అది దొరకదు. గృహయజమానుడుగా తయారుకావాలి. అప్పుడే ఆత్మరత్నమునకర్హుడు. బహిర్దృష్టి ఉన్నంతవరకు బానిసలే. అంతర్దృష్టి సాధించిన తక్షణమే గుహలోని ఆత్మాకారమునందు జ్యోతి ప్రకాశించి ప్రకటమగును.

**జనన మరణాలు రెండును జంటనుండు**
**రెండుచక్రాల బండిని నుండునటుల**

**ఒకటి పోయిన సృష్టియే ఓడిపోవు**
**ఇదియె సృష్టి రహస్య మీ ధరణి యందు**

రాత్రింబవళ్ళు, చావుపుట్టుకలు, సుఖదుఃఖములు యీ జగత్తులో కొనసాగుచునే ఉన్నవి. ఈ సృష్టియందు ధర్మము, అధర్మము రెండూ ఉన్నవి. కానీ ఒకపరి ధర్మానిది పైచేయిగా ఉంటుంది. తన కర్తవ్యాన్ని తాను నిర్వర్తించినప్పుడే మానవుని వ్యక్తిత్వం సార్థకమవుతుంది. కర్తవ్యమే మానవునికి ప్రధాన నియమము. తన కాలమును, తన కాయమును, తన శక్తిని తాను సక్రమమైన మార్గములో వినియోగించుకోవాలి. కానీ దురదృష్టవశాత్తూ మానవుడీనాడు పరుల కాలమును, పరుల మేధాశక్తిని దుర్వినియోగము చేస్తున్నాడు. పరుల శక్తిని దోచుకుంటున్నాడు. అదే అధర్మమని చెప్పటానికి కారణము. ధర్మమనగా ఏమిటి? లోకములో వ్యక్తిత్వము యొక్క శక్తిసామర్థ్యములను సక్రమమైన మార్గములో వినియోగించుకోటమే. వీటిని వక్రమార్గములో పెట్టటమే అధర్మము.

సృష్టి కపటము కాదు, కృత్రిమము కాదు. అది సంపూర్ణ ఆధ్యాత్మిక తత్వమే. భగవదాకారమే. భగవత్సంకల్పము వలన కలిగినది కపటమెట్లగును? భగవంతుని చిచ్ఛక్తి, భగవంతుని ఆనందము వీటియొక్క ప్రకటనయే సృష్టి. వానియొక్క స్వరూప నిరూపణయే భగవత్సంకల్పముతో ఆవిర్భవించిన సృష్టి భగవద్రహితమెట్లగును? ఆ సంకల్పము గుర్తించి వర్తించిన, విషయములతో నిండిన ప్రపంచము విషముగా వెంటాడదు. దివ్యత్వమనే అమృతత్వములోనే ముంచివేయును. 'రసో వై సః' పరమాత్ముడు రసస్వరూపుడు కదా! ఇంక ఆయనచే సృజింపబడిన, ఆయన ప్రవేశించిన, ఆయన నడచుచున్న ఆధారము, ఆధేయము, ఆయనగానే ఉన్న ప్రపంచము కూడా దివ్యస్వరూపస్వభాములు కలవేకదా!

భానుతేజముకంటె భాసిల్లుచుండును
**మంచుతెలుపుకంటె మించియుండు**
**ఆకసమునకంటె అతిసూక్ష్మమైయుండు**
**సర్వజీవులలోన పర్వియుండు**
**పరమాత్మలేనిది పరమాణువును లేదు**
**అంతటనిండి తానంటకుండు**
**పరమాత్మ సందర్శ భవ్యవికాసము**
**నిఖిల లోకాలలో నిండియుండు**
**బ్రహ్మమందు మీరు మీలోన బ్రహ్మంబు**
**మీరె బ్రహ్మ బ్రహ్మ మీరెయయ్యు**
**బ్రహ్మమయులు మీరు బ్రహ్మమేయగుదురు**
**కాని మోహవశత కానరైరి.**

ప్రపంచములోని దివ్యత్వమును దర్శించి, ఆస్వాదించి, ఆనందించుటకు ప్రత్యేక ప్రయత్నములనవసరము. సూర్యునికి, సూర్యకిరణములకు అవినాభావ సంబంధము. అట్లనే భగవంతునికీ, ప్రపంచమునకూ అవినాభావ సంబంధమే. సూర్యుడు అందించే వెలుతురు వేడిమి వలన భూమి ఆనందమయముగా మారును. ప్రకృతిని బంధసహితమనియూ, పరమాత్ముని బంధరహితుడనియూ గుర్తించి వర్తించిన లేని తికమకలలో పడి ఆనందమునకు దూరమైపోదురు. లోదృష్టిని పెంచుకొని ద్రష్టవలె సాక్షిగా మెలగవలెను. అంధుడు బాహ్యవస్తువులను తన దేహమునుకూడ చూడలేకపోతున్నాడు. అట్లనే జ్ఞాననేత్రము లేనివాడు స్వస్వరూపము జగత్తుయొక్క స్వరూపమును గుర్తించలేడు.

ఒక్కొక్క వ్యక్తికి ఒక్కొక్క తల ఉన్నది. ఒక్కొక్క తలలో ఒక్కొక్క ఆలోచన ఉన్నది. ఇవన్నీ వారివారి యిచ్ఛాశక్తులవలనే అభివృద్ధిచెందుతుంటాయి. ఒకడు రాముడంటే యిష్టపడతారు. మరొకరు శివుడంటే యిష్టపడతారు. వేరొకరు జీసస్ అంటే ఉల్లాసపడతారు. ఇంకొరు అల్లా అంటే ఆనందిస్తారు. ఇవన్నీ కేవలం వారివారి తలలను, తలంపులను పురస్కరించుకొని ప్రవేశించే భావములే. ఏరూపాన్ని ఆరాధించవలెనన్నా, ఏ దైవాన్ని పూజించవలెనన్నా శ్రద్ధ, విశ్వాసము రెండూ ఉండాలి. శ్రద్ధలేనిచో యేచిన్న కార్యమునైనా సాధించలేము. దేనిని మనం యిచ్ఛగించలేము. 'శ్రద్ధావాన్ లభతే జ్ఞానం' శ్రద్ధవలనే జ్ఞానం లభిస్తుంది. శ్రద్ధలేని వానికి

ఎంతటి మేధాశక్తి, ఎంతటి తెలివితేటలుండినప్పటికీ అవన్నీ వ్యర్థమైపోతాయి. శ్రద్ధ కల్గిన వానికి చిన్న నిప్పురవ్వ అందించిన దానిని అనంతమైన అగ్నిగా ప్రజ్వలింపచేసుకుంటాడు. కానీ శ్రద్ధలేని వానికి తట్టెడు నిప్పు యిచ్చినా అశ్రద్ధతో ఆరగొట్టుకుంటాడు.

మానవుడు శ్రద్ధచేతనే దివ్యత్వాన్ని పొందగలుగుతున్నాడు. శ్రద్ధ అనగా ఎవరు? 'భవాని' అని అర్థము. అనగా దేవత, శక్తి లేక ప్రకృతి. ఇంక విశ్వాసమనగా ఎవరు? విశ్వాసమే ఈశ్వరత్వము. శ్రద్ధచేతనే యిచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి ఏర్పడుతున్నాయి. ఈ మూడింటియొక్క ఫలమే ఈశ్వరత్వము. అదియే విశ్వాసము. కనుక శ్రద్ధావిశ్వాసములనగా పార్వతీపరమేశ్వరులని అర్థము. ఈ రెండే మానవత్వానికి ఆధారములు. ఐతే ఈ రెండూ వేరువేరు కాదు. ఒక్కటే. నిప్పు, దహనశక్తి ఒక్కటైనట్లుగా శ్రద్ధావిశ్వాసములు రెండూ ఒక్కటే. నిప్పు లేనిచో దహనశక్తి లేదు. దహనశక్తి లేక నిప్పుకాదు. అట్లే తీపి లేక చక్కెర కాదు. చక్కెర లేకుండిన తీపి ఉండదు. అదేవిధముగా శ్రద్ధావిశ్వాసములు ఒకదానినొకటి ఆశ్రయించి ఉన్నాయి. కనుక ప్రతి మానవుడు శ్రద్ధావిశ్వాసములను శివశక్త్యాత్మక స్వరూపంగా భావించాలి. శివ, శక్తి రెండూ వేరువేరు కాదు. ప్రకృతంతయూ అర్ధనారీశ్వర స్వరూపమే. ప్రకృతి పరమాత్మల సంబంధమే శ్రద్ధావిశ్వాసముల మధ్యనున్నది. ఈరెండూ లేని మానవుడు జీవరహితమైన దేహమనే చెప్పవచ్చును. కానీ వీటిని విరుద్ధమైన మార్గములో ప్రవేశపెట్టి ప్రకృతి తత్వాన్ని విశ్వసించి అనేకవిధములైన అశాంతులకు గురౌతున్నారు.

ప్రతి మానవునియందున్న శ్రద్ధావిశ్వాసములే దైవస్వరూపాలు. సర్వులయందున్న ఈశ్వరతత్వాన్ని పొందాలంటే ప్రత్యేకమైన సాధనలు చేయనక్కరలేదు. క్రమక్రమేణా బాహ్యదృష్టిని విరమించుకొని, అంతర్దృష్టిని అభివృద్ధిగావించుకోవాలి. ఈ సృష్టియందు కనిపించేదంతయూ ఏనాటికైనా మార్పుచెందునదే. మార్పే లేకుండిన మానవునికి సంతోషమే లేదు. మానవుడు కోరేదంతా మార్పే. కానీ దివ్యమైన భగవత్సంబంధమైన మార్పుగా రావాలి. లోకసంబంధమైన మార్పుకాదు.

లోకములో అనేక మానవులు ఈ సృష్టికి కారణము ఏమిటి? ఈ సృష్టి ఎట్లు కలుగుచున్నది? అనే అపోహలతో అల్లాడిపోతున్నారు. దీనికి ఒక్కటే ఒక్కటి జవాబు. మనం కలలు కనుటకు ఏది కారణము? కలలకు కారణము నిద్రయే. నిద్రాశక్తియే కలలకు కారణమైనట్లుగా , సృష్టికి మాయాశక్తియే కారణము. కలలో కనిపించే దృశ్యములన్నింటికీ ఒక నియతి, ఒక క్రమము అనేది యేమాత్రము కనిపించదు. అదేవిధముగా సృష్టియందు సృష్టింపబడే ప్రతి విషయమునకు కూడ ఏవిధమైన క్రమముగానీ, నియతిగానీ ఉండదు. ఈ సృష్టి ఏరీతిగా జరుగుచున్నది అనే ప్రశ్నలో మనం మునిగి కాలమును వ్యర్థం గావించుటకంటె సృష్టిని సార్థకముగావించు విధానమును వెతకుట అత్యవసరము.

ఈ ప్రపంచము ఎట్లు పుట్టినది? ఎట్లు గిట్టును? అనే విచారణ కేవలము కాలహరణము. ఈ ప్రపంచమునందు, సృష్టియందు, సృష్టింపబడిన నీ గతి ఏమిటో మొట్టమొదట నీవు తెలుసుకోవాలి. ఈ జగత్తునందు పుట్టిన నీవు ఏవిధమైన స్థితిగతులను అనుభవిస్తున్నావో యీ సత్యాన్ని గుర్తించటం అత్యవసరం. జీవుడు రజోగుణసంబంధుడు. అతనికి ఊర్ధ్వస్థానమందు సాత్వికముంటున్నాది. అతనికి అధోస్థానమందు తామసికముంటున్నాది. మధ్యస్థానమునందున్నవాడే జీవుడు. సాత్విక ప్రతిబింబమైనటువంటి ఈ ఈశ్వరుడు ఊర్ధ్వస్థానమునందున్నాడు. పదార్థస్థానమును పొందినదే తమోగుణము. కనుక యీ మధ్యస్థానమునందున్న మానవుడు అధోగతికి పోవుటకు ప్రయత్నించక ఊర్ధ్వగతిని కొంతవరకు ప్రయత్నపూర్వకంగా సాధించటానికి పూనుకోవాలి.

# 3

## శివరాత్రి

ఖండఖండాంతర ఖ్యాతినార్జించిన
మహనీయులను గన్న మాతృభూమి
పాశ్చాత్యవీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమును గన్న సమరభూమి
పాండిత్యమున చాలప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ చూపించిన భరతభూమి
సంగీత సాహిత్య శాస్త్రీయవిద్యల
ధీశక్తి చూపిన దివ్యభూమి
చిత్రకళలతోడ చిత్రమైయున్నట్టి
భరతభూమియందు జననమొంది
భరతమాత ధర్మభాగ్యంబు కాపాడ
భాధ్యతంతయు మీదె భక్తులార!

భారతదేశ సంస్కృతి అందరికీ తల్లివంటిది. భారతదేశ చరిత్ర అందరికీ తండ్రి వంటిది. రెండింటినీ అనుసరించి, ఆనందించువారలే భారతీయులు. భారతీయసంస్కృతి కోటికోటి కోమల కంఠములు స్తుతించిన సంస్కృతి. అది సర్వమతముల సారము. సర్వశాస్త్రముల గమ్యము. హృదయ పరిశుద్ధికి అదే ఉత్తమోత్తమ మార్గము. దానిని శ్రవణ, మనన, నిధిధ్యాసల వలన అభ్యసించవలెను. నానా వేషభాషలు, నానా దేశవాసులు, ఒకే క్షేత్రమందు చేరి పండుగనాచరించటములోని గూఢార్థము అందరిలోనూ ప్రకాశించుచున్న ఏకత్వము నిరూపించి ధృఢపరచటమే.

తరతరములనుండి భారతదేశము ఆధ్యాత్మిక తత్వప్రబోధలచేత స్థిర శాంతిభద్రతలను ధృఢముచేసుకొని అన్నిదేశములందు మహోన్నతస్థామును వహించినది. నాటికి, నేటికి లోకాస్సమస్తాసుఖినో భవంతు అనేది భారతీయుల ప్రధాన లక్ష్యముగా ప్రకాశించుచున్నది. ఈ పవిత్ర ధ్యేయమును నాటి ప్రభువులు, యోగులు, మహనీయులు, సతీమతల్లులు అందరూ త్యాగమొనరించి పోషించుతూ వచ్చారు.

భారతదేశమందు అనాదికాలమునుండి ఎందరెందరో మహానుభావులు జన్మించి ఉన్నారు. కానీ అందులో సజీవముగా జనుల హృదయమునందు నిలచి వారి అవ్యాజమైన కృతజ్ఞతకు పాత్రులైనవారు కొంతమందిమాత్రమే. వీరిలో శంకర, రామానుజ, మధ్వాచార్యులు ముఖ్యులు. వేదాంత శాస్త్రములను వీరు చక్కగా ప్రబోధించి, ప్రచారముచేసి తమ సత్కీర్తిని చిరస్థాయిగా నిలబెట్టిరి. విద్వాంసులు వీరి జీవిత చరిత్రలను అనేకవిధములుగా వ్రాసి ఉన్నారు. వారు జన్మించిన సంవత్సరము, స్థలము, పర్యటించిన ప్రదేశములు, వ్రాసిన గ్రంథములు వీటిగురించి ఏకాభిప్రాయము వారిలో లేదు. వారి పుట్టుపూర్వోత్తరములు ఒక్కొక్కరు ఒక్కొక్కరీతిగా వర్ణింతురు.

శంకరాచార్యులు కేరళ రాష్ట్రమందు క్రీ.శ.ఏడవశతాబ్దములో జన్మించిరి. చిన్నవయస్సులోనే పాండిత్యము సంపాయించి జీవబ్రహ్మైక్యానుసంధానమును సాధించి తత్వమసి, ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మా బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి, అనే మహావాక్యములే వేదోపనిషత్తులలోని, బ్రహ్మసూత్రములలోని, భగవద్గీతలోని అంతరార్థమని వెల్లడించిరి. శంకరాచార్యులవారు ప్రకృతి, జీవుడు, పరమాత్ముడు అంతయూ ఏకత్వముగా ఒక పరమాత్మ తత్త్వమేగానీ వేరువేరు కాదని నిరూపించినారు. ఒకే పదార్థము, ఒకే యదార్థము మూడుగా కనిపించును, అంతే అని స్పష్టము చేయుటకొరకు ఒక కొబ్బరి కాయను ఉదాహరణగా తీసుకున్నారు. పైన పీచు, లోపల చిప్ప, అంతర్భాగమందు కొబ్బరి అని. ఇవి మూడు కూడను ఏక రూపముగా నిలచిననూ, కాయ ఒక్కటే. ఇంద్రియ విషయములైన, దృశ్యప్రపంచమందున్న, సకలచరాచరములు వస్తువాహనములు ఆస్థిపాస్తులు అన్నీ, పైనున్న పీచునకు సమానమే. పాంచభౌతికమై,

మలమూత్ర మాంసములతో చేరినవైననూ, దివ్యత్వమున కాధార రూపమై దేహము, చిప్ప! ఆత్మస్వరూపమై నిర్మలమై, పవిత్రమై దాహమును తీర్చే శక్తిగల జలసహితముగానున్న కొబ్బరే పరమాత్మ. మూడూ బ్రహ్మతత్త్వమే అని శంకరుడు వెల్లడించాడు. ఏకమేవ, రెండు కాదు, లేదు, అద్వితీయం అన్నాడు. సర్వం బ్రహ్మమయం జగత్ అని ఉపదేశించాడు. మండనమిశ్ర, కుమారిలభట్టు మొదలగు కర్మసిద్ధాంతులను తమ విద్వత్ప్రభావముచే ఓడించిరి. బౌద్ధమత శాస్త్రజ్ఞులనుకూడా అద్వైతసిద్ధాంతములను ఒప్పుకునే పరిస్థితికి తెప్పించిరి. మాయచేత బ్రహ్మ సత్యం, జగన్మిధ్య అని తెలియకపోవును. సాధనచతుష్టయముననుసరించితే జ్ఞానోదయము కలుగునని బోధించిరి. భారతదేశమంతా సంచరించి ఆచరణరూపమైన ప్రచారము సల్పి, నలుమూలలలోనూ, అద్వైతశాస్త్రముయొక్క ప్రబోధముకొరకు గురుపీఠములను నెలకొల్పి తమ ముప్పదిరెండవ సంవత్సరములోనే శంకరులు దేహము చాలించిరి.

అయితే సామాన్య జనులకు అద్వైత తత్త్వము సరిగా అర్థము కాలేదు. వారి మనస్సులలో అది కొంత వికలత్వము చెందుతూ వచ్చింది. ఇంద్రియముల బంధనములో బాధపడేవారికి ప్రజ్ఞానం బ్రహ్మ, తత్త్వమసి, అహం బ్రహ్మాస్మి, అనే మహావాక్యములు అర్థం కాలేదు. పదములనుచ్చరించుట, నేనే బ్రహ్మము అని చెప్పుకొనుట సులభము కానీ, ఆ సాయుజ్య పదవిని గుర్తించి గురినందుకొని ఆనందించటము అతి కష్టసాధ్యమైనది. ఇట్టి పరిస్థితులలో భక్తిప్రపత్తులు క్షీణించుట సంభవమని భయపడి 11వ శతాబ్దములో రామానుజాచార్యులు విశిష్టాద్వైతమును ప్రబోధించిరి. అద్వైతమునకు వారు కొంత విశిష్టతను కల్పించిరి. జీవుడు బ్రహ్మముయొక్క అంశమని నిరూపించి, సారూప్య స్థానమును అన్ని సాధనల లక్ష్యముగా ప్రబోధించిరి. సాయుజ్యమనిన నీటిలో నీరు, తైలమందు తైలము లీనైనట్లుగా జీవబ్రహ్మైక్యము కావటము. సారూప్య ప్రాప్తియందు భక్తిప్రపత్తుల వలన, జీవుడు అంగాంగ భావముతో లీనమైననూ కొంత విశిష్టతతో వేరుగానున్నట్టు వ్యవహరించును అని బోధించినారు.

తరువాత, 13వ శతాబ్దమందు మధ్వాచార్యులు బయలుదేరి జీవునికి దేవునికి సాయుజ్యము కానీ సారూప్యము కానీ ఎన్నడూ కుదరదని, దానికి వీలులేదని ప్రకటించినారు. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు వీటికి శాశ్వతమైన భేదములున్నవని, మానవత్వాన్ని పరిశుద్ధము చేసిన యోగులకు సాలోక్యమే పరమ లక్ష్యప్రాప్తి అని ప్రబోధించిరి. దీనివలన, చాలామందికి ఆధ్యాత్మిక మార్గము ననుసరించి తమ అభిలాషలను పొందుటకు మార్గమేర్పడినది. ఈ దర్శనమునకు ద్వైత దర్శనమని పేరు.

అయితే, ఇవి మూడూ జగత్కళ్యాణము కొరకు, మానవోద్ధరణ కొరకు బయలుదేరినవే కానీ వేరు కాదు. కాయము కాలము కర్మము వీటిని పరిశుద్ధ పరచి భావము చిత్తము అంతఃకరణము వీటిని ఉపాసనా మార్గమందు ఉపయోగ పెట్టవలెననునదే వారి ఉద్దేశ్యము.

ద్వైతము, విశిష్టాద్వైతము, అద్వైతము మూడూ జీవేశ్వరప్రకృతులను గురించి విచారణసల్పి, ఈశ్వరుని వలనే జీవప్రకృతులు, ఈశ్వరుడుతప్ప రెండవది లేదని శంకరులు బోధించిరి. ఆ ఈశ్వరుడే నిర్మల, నిశ్చల, నిస్వార్ధ, నిత్య, బుద్ధ, శుద్ధ స్వరూపుడు అని నిర్ణయించునదే శివరాత్రి యొక్క విశిష్టత. జీవుడు, ప్రకృతి ఆత్మతత్త్వమేయని ముగ్గురు ఆచార్యులు సమ్మతించుచున్నారు. మాయవలన, అజ్ఞానము వలన ఆత్మతత్త్వము విస్మరించి వాటిని ప్రత్యేకముగా విశ్వసింతురు. అంతే. అందరియందున్న ఆత్మను, ఈశ్వరత్వమును గుర్తించి వర్తించుటకు మీరు ఈ శివరాత్రియందు పూనుకొనవలయును.

డాల్టన్ అనే పాశ్చాత్య తత్వజ్ఞాని దృశ్యప్రపంచమంతా పరమాణు స్వరూపమేనని తెలుసుకొని ప్రచారము చేసినాడు. అన్నీ పరమాణువులే. పరమాణువుల సముదాయమే. అణువులేని ఘనము లేదు. జీవి లేని బ్రహ్మము లేదు. బ్రహ్మము లేని ప్రకృతి లేదు. దారము లేని వస్త్రము లేదు. మట్టి లేని కుండ లేదు. బంగారము లేని నగలు లేవు. బ్రహ్మము లేని ప్రకృతి లేదు. సకల వస్తువులయందు బ్రహ్మము యిమిడి ఉన్నది. ఇట్టి పర్వదినమునందు దీనిని మీరు గుర్తించ వలెను.

ఆధ్యాత్మికము బాహ్యదృష్టికందని వస్తువు. అహంకారమనేది పెద్ద అంధకారము. అది నశించిన తరువాతనే ఆధ్యాత్మిక సౌందర్యము గోచరించును. దీనికే వశీకరణమని పేరు. పార్వతి సౌందర్యరాశి. ఈ సౌందర్యమునే ఆధారము చేసికొని, అహంకారముతో ఈశ్వరుని పొందుటకు అనేక ప్రయత్నములు చేసినది. ఈశ్వరుని మనస్సు మన్మథుని సహాయముతో కదలించుటకు పూనుకొన్నది. అయితే దీని ఫలితముగా మన్మథుని శివుడు భస్మము చేసెను. తరువాత పార్వతి ఆధ్యాత్మిక మార్గమునవలంబించి తపమునాచరించి, భగవత్ కైంకర్యములచే, భగవచ్చింతనచే తన అభీష్టమును సాధించినది. ఈశ్వరుడు ఆమెను అర్ధాంగిగా స్వీకరించిన ఈ పర్వదినమే శివరాత్రి.

మానవ జీవితములో ఈశ్వరత్వము ప్రకటించవలెను. మానవ సమాజమునకు ఈశ్వరత్వమే పునాది. ఈశ్వరత్వమే ప్రధానము. అది అహంకార పూరితమైన వికారమగును. దుఃఖమయమగును. భారతీయ సంస్కృతియందు కూడ యిట్టి వికారము, వికృతి భావములూ నవనాగరికతయొక్క ప్రభావమువల్ల పెరుగుచున్నవి. భగవంతుడు లేడని బల్లగుద్ది చెప్పేవారు భారతీయులలోనే ఉన్నారు. తీర్థయాత్రలు, క్షేత్రదర్శనములు మూర్ఖత్వమని హేళనచేయువారు మిక్కిలిగా కలరు. అయితే దివ్యత్వము యెంతలేదన్నా పోయేది కాదు. తనకు అయిష్టమనిపించినదంతా వ్యర్థమని చెప్పేదికూడా మూర్ఖత్వమే. ఈ సత్యమును గుర్తించుటకు బుద్ధి ప్రధానమైన ఆధారము. బుద్ధిద్వారా స్వస్వరూపమును వెతకవలెను. దీనిని గుర్తించి దివ్యత్వమును తెలిసికొని ఆనందించవలెను.

కానీ యిప్పుడు యిట్టి మార్గమునకు విరుద్ధముగా ప్రవర్తించి, భిన్న మార్గమందు బయలుదేరి అయోమయ జీవితమునబడి బాధపడుచున్నారు. తెల్లవారు ఝామునుండి రాత్రివరకు బయటినుండి దొరికే సుఖములకొరకే ప్రాకులాడుట అలవాటైనది. బుద్ధిని అంతర్ముఖముగా ప్రవేశపెట్టి తద్వారా ఆత్మను గుర్తించేందుకు ప్రయత్నం చేయటంలేదు. పశువులకు బయటిదృష్టి సహజము. మానవుల ప్రత్యేకత యీ లోదృష్టి. మానవుని బయటదృష్టి హానికరముగా నుండును అన్నమునకు ప్రాకులాడక ఆత్మను వెతికే బుద్ధిని అభివృద్ధి చేయుటే మానవుని జీవిత లక్ష్యము. విద్యలను యెంత సంపాయించిననూ, బలమెంత ఉండిననూ, అధికారములెన్నిపొందిననూ ప్రవర్తనద్వారా విజ్ఞాన, ప్రజ్ఞాన, సుజ్ఞానములకొరకై పాటుపడవలెను. ఇది లేకుండిన వ్యక్తిత్వమునకే అవమానము. ఆహారవిహారముల నిమిత్తమే జీవితమనుకున్నచో మనిషిగా పుట్టనక్కరలేదు. కుక్కలు, నక్కలు ఆ ఉద్దేశ్యమును నిర్వహించును. అన్నము వెతికేవాడు పాపి, ఆత్మను వెతికేవాడు గోపి అని గోపికల విషయమై భాగవతములో పేర్కొన్నారుకూడా.

చిత్తవృత్తులను, కామక్రోధములను చిమ్మచీకటినుండి విడుదల చేసేదే ఆధ్యాత్మిక క్రమశిక్షణయొక్క పరమోద్దేశ్యము. మానవులు కామమువలన రాముని మరచిపోదురు. క్రోధమే కామమునకు వెంట జంట. ఇవి రెండు మానవుని దానవునిగా తయారుచేయును. కామ తృష్ణకు అంతులేదు. వీటినుండి విడుదల పొందవలెనన్న వాటి మూలస్థానమేదో కనుగొనుటకు ప్రయత్నించవలెను. అప్పుడు యింద్రియములు, యింద్రియములననుసరించే మనస్సు కామక్రోధములకాధారమని తెలియును. దీనికే పెద్దలు యింద్రియనిగ్రహమునుపదేశింతురు. క్షణభంగురమైన విషయవాసనలకు మనోబుద్ధులనంకితముచేసి వాటిని యింద్రియముల మూలకముగా బాహ్యప్రపంచమున విహరింపచేసి మానవులు అశాంతికి లోబడి పవిత్రమైన ప్రశాంతికి దూరమైపోతున్నారు. జీవిత సైకతముపై పెనుగాలి మేడ నిర్మించి అదే శాశ్వతమని మానవుడు విశ్వసించి అజ్ఞానిగా తయారైపోతున్నాడు. జగత్తులోని ఏపదార్థమూ శాశ్వతము కాదు. ఏ ఒక్కటీ మానవునకు దక్కేది కాదు. అవన్నీ ఎండమావులు. మానవుని బుద్ధిని మోసగించి, భ్రమింపచేసి నిరాశలో ముంచివేయునని తెలుసుకొనేదే ఆధ్యాత్మికము యొక్క ప్రథమ సోపానము.

ప్రతి ఒక్కనికి మానసిక శాంతి అత్యవసరము. ధనము, మదము, అధికారము, దేహబలము వీటివలన లభించేది అశాంతియేగాని శాంతి కాదు. శాంతి దొరకవలెనన్న ఒక్క దైవభావమే దానికి తగిన ఉపాయము. కొంతమంది 'సత్యాన్వేషణ'కు పూనుకొనవలెనని ఉపదేశింతురు. సత్యమే తన స్వరూపము. కాబట్టి దానిని అన్వేషించనక్కరలేదు. దానిని గుర్తించితే చాలు. సత్యమే తానని తేలును. సత్యప్రకటనము చేయుటకు పూనుకొనవలెనుగానీ అన్వేషణ అనవసరము. మానవుని సత్యత్వము దివ్యత్వమే. దీనిని ప్రకటించు నిమిత్తము మహర్షులు, మహనీయులు పర్వదినములు ఏర్పరిచినారు.

స్వార్థము, అహంకారము, అధికారవాంఛ వలన మానవులు అవినీతికి పాల్పడి అనేకరకములైన దుఃఖములకు, అశాంతికి లోనై బాధలు పడుతున్నారు. ఈ పరిస్థితిలో ఆస్తికులైన మీరు ధర్మము, ప్రేమ, సహనము అనే చల్లని పన్నీరు చల్లి జనతయొక్క కన్నీరు రూపుమాపవలెను. భారతదేశము కులాభిమానము, భాషాభిమానము, ప్రాంతీయాభిమానముల వలన అధఃపతనము పొందినదని కొంతమంది వాదించి దూషింతురుగానీ అట్టి ఆరోపణ సరికాదు. దేహములో ఒక్కొక్క అంగము ప్రత్యేకించి దూషించితే దానితో ఎట్లుపని జరుగును? అది దేహతత్వము కానేరదు. కులమతభాషాప్రాంతములను నిర్మూలముచేయుట ఎవరితరము కాదు. దేశాభిమానమునకు వాటిపైన ధృఢపరిచిన ప్రేమయే ఆధారము. వాటిలో భేదమును, ద్వేషమును కలిపి కలుషితము గావించే దౌర్బల్యమును హతమార్చాలి. సరే. అయితే వాటినే నిర్మూలనము చేసిన దేశమునకు ముప్పుతప్పునది కాదు. అట్లనే భారతీయులు ఒక్కొక్క రూపనామమును ప్రత్యేక ఆరాధనా పద్ధతులను, ఆచారసాంప్రదాయములను నియమించుకున్నారు. కొంతమంది వీటిని కూడా మూఢాచారములని, మూర్ఖత్వమని దూషించి త్రోసివేయవలెనని అంటున్నారు. బుద్ధిని స్థిరపరచి సద్గుణముల నభివృద్ధిచేసేకొరకే ఈ ఆచారములను ఋషులు, పెద్దలు నిశ్చయించిరిగానీ ప్రజలను తప్పుత్రోవపై త్రిప్పుటకు కాదు. ఆచారముల ప్రయోజనము శీలాభివృద్ధి, గుణనిర్మాణము యివి రెండే.

సాంప్రదాయములు జీవితమును ధన్యము చేయును. మతము కలహాలను, కలతలను పుట్టించుటకు ఏర్పడలేదు. మానవుని హృదయాకాశమును నిష్కల్మషముచేసి జ్ఞానజ్యోతిని వెలిగించి అక్కడ పరమాత్ముని ప్రతిష్ఠించుటయే మతము యొక్క మహోద్దేశ్యము హృదయక్షేత్రములలో ప్రేమజల్లులు వెదజల్లి సహన ప్రయోజనమును, శాంతిఫలమును పొంది ఆనందించుటయే మతముయొక్క సార్థకత.

మానవులలో మూడువిధములైన స్వభావములు కలవు. మొదటిది అనేకాగ్రత. రెండవది ఏకాగ్రత. మూడవది శూన్యావస్థ. ఈనాడు నూటికి తొంభైతొమ్మిదిమంది జనులు అనేగ్రత లేక శూన్యావస్థలో ఉన్నవారేనని చక్కగా విచారించిన అర్థమగును. ఏకాగ్రతనొనర్చుటకు ఈనాడు పవిత్రమైన దినము. ఇది తగిన సమయము. దానికొరకై ఈనాడు భజన చేయటము, భగవత్సంబంధమైన కార్యక్రమాలు సల్పటము భారతీయుల పద్ధతి. భగవంతుడు తనను స్తుతించటము చేత, తన గుణగణములను కీర్తించటముచేత మనకేమైనా ఉపకారము చేస్తాడని భజన చేస్తున్నామా? పూజలు సలుపుచున్నామా? కాదు కాదు. పరమాత్ముడు సకలైశ్వర్యసంపన్నుడు. మన స్తోత్రమునకు, కీర్తించటమునకు ఆయన లొంగుతాడా? ఆ పరమేశ్వరుని గుణగణములను స్మరించటము వలన, స్తుతించుటవలన అవి మన హృదయములను సంస్కరించును అనే విశ్వాసముతో చేస్తున్నాము. ఎట్టితలంపులను తలంతుమో అట్టితలంపులు హృదయమందు ముద్రింపబడును. నిరంతరము యితరుల చెడ్డ గుణములనే చింతించిన మన హృదయము కూడా దోషభూయిష్టమై, మాలిన్యరూపమై మారును. మంచి గుణములను, ఉత్తమ భావములను స్మరించటము చేత మనస్సులో చెడ్డ భావాలు ప్రవేశించుటకు అవకాశముండదు. ఇట్టి అనుగ్రహము పొందుటకు ఎక్కువ అవకాశముండును. కాబట్టి స్మరణము, ప్రవర్తించటము, చింతించటము అన్నీ మంచి పనులుగా, మంచి విషయములుగానే ఉండిన మన స్వరూప స్వభావములు దివ్యముగా, పవిత్రముగా మారును.

శివరాత్రి మహా పర్వదినము. సూర్యుడు కుంభరాశిలో ఉన్నప్పుడు కృష్ణచతుర్దశి చేరి ఆదినము యొక్క మధ్యరాత్రి ముహూర్తము శివరాత్రి యొక్క విశిష్టత. అప్పుడే మహాశివరాత్రి. మిగిలిన రాత్రులంతా సామాన్యమైన రాత్రులు. సామాన్య రాత్రులకు శివరాత్రికి చాలా వ్యత్యాసము. శివరాత్రి అంటే మంగళకరమైన రాత్రి, తేజోవంతమైన రాత్రి. మనస్సుకు చంద్రునికి బింబప్రతిబింబ సంబంధము కలిగియున్నది. అట్టిప్రతిబింబసమానమైన చంద్రుడు తనలోని పదహారు కళలలో పదిహేను కళలను లయము చేసుకొని ఈరాత్రి కేవలము ఒకకళతోనే ప్రకాశిస్తూ ఉంటాడు. పదిహేను కళలు భగవంతునిలో లీనమైనవి. మానవుడు శివరాత్రియందు భగవదారాధన, భగవచ్చింతన, భగవన్నామస్మరణతో గడిపితే వాని మనస్సు కూడా భగవంతునిలో లయమగును. సంవత్సరమునకు ఒకసారి వచ్చెడి శివరాత్రికాక నెలకొకసారి మాసశివరాత్రి కూడా వచ్చుచుండును. అయితే ఈరాత్రికింత ప్రాధాన్యత ఎందుకు? రాత్రికి అధిపతి చంద్రుడు. అతడు షోడశకళాపరిపూర్ణుడు. కృష్ణపక్షమునందు దినమునకొకకళ చొప్పున క్షీణించుటచేత అమావాస్యనాడతడు పూర్తిగా కళాహీనుడగుచున్నాడు. తిరిగి ఆనాటినుండి అనగా శుక్ల పక్షమందున రోజునకొకకళవంతున వృద్ధియగుటచేత పూర్ణిమనాటికి షోడశకళా పరిపూర్ణుడగుచున్నాడు. మనస్సునకధిష్టాన దేవతయగు చంద్రునకు వలె మనస్సునకు కూడా వృద్ధిక్షయములు కలవు. 'చంద్రమా మనసో జాతః' పురుషోత్తముని మనస్సునుండి చంద్రుడు జన్మించెను. అమనస్కులగుటయే సమస్త సాధనలయొక్క ప్రధానోద్దేశ్యమని మీరందరు జ్ఞప్తియందుంచుకొనండి. అప్పుడు మాత్రమే మాయ మటుమాయమై సత్యము గోచరించును. ప్రతి నెలలోను కృష్ణపక్షమున చంద్రునియొక్క కళలు దినమునకొక్కటి చొప్పున క్షీణించుచుండును. అట్లే మనస్సుకూడా దినమునకొక్క అంశవంతున విసర్జించవలెను. శివరాత్రియగు చతుర్దశి నాటికి ఒకఅంశము మాత్రము మిగులును. ఆనాడు పూజ లేక జపము లేక ధ్యానమువంటి సాధన ద్వారా సాధకుడు ప్రత్యేకమైన కృషి సల్పినయెడల విజయము లభించుట తథ్యము. నిద్రాహారములకు మనస్సును పోనీక ఏకాగ్రతతో ఆనాటి రాత్రి అంతయూ శివుని ధ్యానించుచూ గడుపవలెను. ఇది ప్రతి మాస శివరాత్రియందు చేయవలసిన కృషి. సంవత్సరనకొకనాడు వచ్చు మహాశివరాత్రినాడు ప్రత్యేకమైన చింతన సలుపవలెను. అప్పుడు అంతర్వాసియగు పరమేశ్వరుని కటాక్షమున మీరు శివముగా మారగలరు. చంద్రుడు బింబము, మనస్సు ప్రతిబింబము. కాబట్టి భగవచ్చింతనతో రాత్రిని పగలు చేస్తే మనోనాశనము యీ శివరాత్రినాడే దొరకును. ఆశల మూటయే మనస్సు. ఆశలు లేకపోతే మనస్సే ఉండదు. శివరాత్రియొక్క వైశిష్ట్యమిది.

శివరాత్రి అనే పదములోని అక్షరములకు సంఖ్యాశాస్త్ర ప్రకారము పవిత్ర అర్థమున్నది. 'శి'..5, 'వ'..4, 'రా'..2 ఈ మూడంకెల మొత్తము పదకొండు. అంటే ఏకాదశ రుద్రులు. కర్మేంద్రియములైదు, జ్ఞానేంద్రియములైదు, మనస్సు చేరి ఏకాదశరుద్ర స్వరూపము ధరించును. రుద్రుడు అనిన ఏడ్పించేవాడు అని అర్థమున్నది. ఈ రుద్రులు చేసే పని ఏమి? వీరు బుద్ధితో చేరి మనస్సును

సంసారమువైపు మరల్చి మానవునికి అనేకవిధములైన కష్టములను, దుఃఖములను కలిగిస్తూ ఉంటారు. ఏకాదశరుద్రులు చేరినదే యీ ప్రపంచము. ఈ ప్రపంచమంతయూ రుద్రమయమే. ఈ రుద్రుల ప్రభావము అత్యంత ప్రమాదము. పేరుయందే ఉంటున్నాది దాని మహత్తరశక్తి. రుద్రమనగా భయంకరము. ఈ పదకొండూ భయంకర స్వరూపాలే. మానవుని విషయవాసనలలో ప్రవేశపెట్టి బంధనములో పడవేయును. మనస్సు సర్వాధిపత్యము వహించినప్పుడు బుద్ధికూడా పెడమార్గమునందు ప్రయాణము చేయును. కనుక యింద్రియములను నిగ్రహించలేక, వాటిని విచ్చలవిడిగా సంచరింపచేసి నానాబాధలకు, అవస్థలకు గురౌతుంటాము.

ఈ రుద్రులు బుద్ధితోచేరి మనస్సును సంసారమువైపు మరల్చి మానవునికి అనేకవిధములైన చికాకులు, కష్టములు, దుఃఖములు కలిగిస్తూ ఉంటాయి. ఈ బాధలలో మూడువిధములైనవి ప్రపంచములో చూడగలుగుతున్నాము. ఆధిభౌతికము, ఆధ్యాత్మికము, ఆధిదైవికమని మూడు పేర్లు. ఆధిభౌతికమనగా పంచభూతములచే, పంచకోశములచే, పంచప్రాణములచే బాధింపబడేవి. మనుష్యులచేతను, క్రిమికీటకాదులచేతను, మృగములచేతను హింసింపబడేది యీ బాధ. దీనిని ఆధిభౌతిక దుఃఖమని పిలుస్తూ వచ్చారు. ఆధ్యాత్మికమనగా వాత, పిత్త, శ్లేష్మాదులచే ఏర్పడే రోగములవలన దుఃఖములు. ఆదిదైవికమనగా అతివృష్టి, అనావృష్టి, భూకంపములు యిలాంటివంతా చేకూరి మానవుని దుఃఖితునిగా చేస్తున్నాయి. ఈ ప్రపంచమందున్న అన్ని దుఃఖములలో యీ మూడు ప్రధానమైనవి. మిగిలిన దుఃఖములన్నీ యీ మూడింటియందు అంతర్భూతమై ఉంటున్నాయి. ఈ దుఃఖమునకు మూలకారణము ఏకాదశరుద్రులే.

ఇంద్రియనిగ్రహమే రుద్రనిగ్రహము. ఇంద్రియనిగ్రహము అంత సులభమైనది కాదు. అయితే 365 దినములలో ఒక్క దినమైనా యింద్రియనిగ్రహము గావిస్తే తద్వారా మోక్షసామ్రాజ్యమును పొందవచ్చును. దైవనామంచేత రాత్రంతా గడిపినప్పుడు మన దృష్టి, శ్రవణము, వాక్కు అన్నీ దైవంలో లీనమై ఉంటాయి. ఇదియే యింద్రియనిగ్రహము. ఈ రుద్రులు జీవులను అనేకవిధములుగా బాధిస్తున్నప్పుడు యింద్రియములనరికట్టి దైవమువైపు మరల్చి కాలమును దివ్యముగా గడిపినప్పుడు మోక్షమునకు మార్గమేర్పడుతుంది. మోహమును క్షయము చేయటమే మోక్షము. ఈ శివరాత్రియందు ద్వాదశాదిత్యుల స్థానమునందున్న ఆత్మను ధ్యానించటమువలన ఆత్మశక్తి, ఆత్మానుగ్రహము వలన మనస్సు, బుద్ధి, యింద్రియములు నిగ్రహింపబడి వాటిపై విజయము పొంది, అవన్నీ స్వాధీనములో నిల్చిపోవును. ఈరాత్రి ఏచిన్న కార్యము సంకల్పించినా అది ఘనముగా మారుటకు వీలున్నది. ఎందుకనిన ఆత్మకిరణములు సూటిగా బుద్ధిపై, హృదయముపై ప్రసరించుటకు అవకాశమున్నది.

మహాశివరాత్రి అవతరణ దాని ప్రాశస్త్యములను గూర్చి మన శాస్త్రములలో అనేక గాథలు కలవు. 'భ' లేక 'జ్యోతి' లేక 'భగవానుని' యెడల రతి, ప్రేమ కలవారియొక్క పుణ్యభూమి యగుటచేత ప్రాచీనకాలమునుండియు మన దేశము భారతదేశమను పేరుతో విరాజిల్లుతున్నది. కనుక భారతీయులకు అన్నిదినములు పర్వదినములే. అనుక్షణము అమూల్యమైనదే. గంగానది తాను పుట్టిన ప్రదేశమునుండి సాగరమున కలియువరకు అంతయు పవిత్రమైనదే. కానీ కొందరు మహర్షులతోడగానీ, దేవాలయనిర్మాణములతోగానీ సంబంధము కలిగియుండుటచేత నదీతీరమునగల కొన్నిస్థలములు మహాపవిత్రములైనవి. అట్టి స్థలములు తరతరములనుండియు మహాపవిత్రమైనవిగా యెంచబడుటచేత, పవిత్ర తీర్థయాత్రా స్థలములుగా ప్రఖ్యాతి గాంచినవి. హరిద్వారము, వారణాసి, ప్రయాగ, ఋషీకేశము మొదలైన పుణ్యక్షేత్రములిట్టివే. ఈ మాయా ప్రపంచమను తెరవెన్కగల సత్యమునన్వేషించుటకై సాధకులు ప్రత్యేకముగా కృషిసల్పు దినములు మిగిలిన దినములకంటె పవిత్రతరములు. అనేకమంది ప్రత్యక్షముగా చూచుటచేతను ప్రపంచమంతయు ఆశీర్వదింపబడుటచేతను పరమేశ్వరావతారమునుండి లింగములావిర్భవించిన దినములు పవిత్రతమమైనవిగా భావించబడుచున్నవి.

ఇతర జీవులవలెనే పరమేశ్వరునకు కూడా జననమరణ మున్నట్టుగానెంచి కొందరు మహాశివరాత్రి అవతరణను ఈశ్వరుని జన్మదినముతో ముడిపెడుతున్నారు. మహాశివరాత్రి మహత్త్వమును తెలుపుటకొక కథ చెప్పుదురు. పూర్వము ఒక వేటగాడు మహాశివరాత్రి దినమున మృగములను వేటాడుటకై ఒక బిల్వవృక్షముపైకి ఎక్కెను. ఆచెట్టుక్రింద ఒక శివలింగము కలదు. అతని చర్యవలన కొన్ని బిల్వదళములు క్రిందనున్న శివలింగముపై పడుట సంభవించెను. లింగమును పూజింపవలెనని తలంపు లేకపోయినను ఆరాత్రి లింగముపై బిల్వదళములు పడుటకు కారణమైనందున అతనికి మోక్షసామ్రాజ్యము లభించెనని చెప్పుదురు.

మరియొక గాథ కలదు. మహర్షులతోడను, దేవతలతోడను పరమేశ్వరుడు తాండవనృత్యము సల్పిన దినమని చెప్పుదురు. శివరాత్రినాడు పరమపురుషుడు ప్రకృతిని వశముచేసుకొనేనిమిత్తము నృత్యమునొనర్చినాడు. శివుడు ఆకర్షించే నిమిత్తము చమత్కారములతో బయలుదేరినాడు. ఎప్పుడూ అంతే. చమత్కారములద్వారా హృదయాన్ని తనవైపు ఆకర్షించి భక్తులను సంస్కరిస్తాడు. తరువాత వారిచే

పరోపకార కర్మలననుసరింపజేసి ఆనందమందించి సాక్షాత్కార స్థానమునకే కొనిపోతాడు. ఈ తాండవనృత్యము వలన తనలోని సర్వశక్తులూ విజృంభించి అగ్ని ప్రకటితమై వేడెక్కినప్పుడు పార్వతీదేవి (పర్వతరాజపుత్రి, ప్రకృతి స్వరూపిణి) చల్లార్చుటకు ప్రయత్నించినది. జడచైతన్యములు ఒకటైనప్పుడు, రెండు వస్తువులు, రెండు పదార్థములు చేరునప్పుడు వేడి ఉద్భవించును. ఇది సహజము. సరే! పార్వతి గంగను తెచ్చి శిరస్సుపై పెట్టినది. చల్లని చంద్రుని తెచ్చి తలపై ఉంచినది. చల్లని గంధము ఒళ్ళంతా రాసినది. కీళ్లకు పాములను తెచ్చి చుట్టింది. తాను హిమవంతుని పుత్రికదా! మంచుగడ్డ. తానుపోయి తొడపైన కూర్చుంది. ఈవిధములైన ప్రయత్నములవలన వేడి చల్లారినది. తిరిగి ఉద్రిక్తుడై లేచి, ప్రకృతి పురుషులిలువురూ తాండవ నృత్యము సల్పుతారు. శివరాత్రియొక్క మహాత్మ్యము యీ ప్రకారము పురాణములలో ఉన్నది. భగవంతుని హృదయమును చల్లపరచి ఎట్లు ప్రసన్నుని గావించుకొనవచ్చునో నిరూపించి అందించిన దినము శివరాత్రి.

క్షీరసాగరమును మథించినప్పుడు వెలువడిన హాలాహలమును తన నాలుకను చాచి భూనభోంతరాళమును భస్మీపటలము గావించునని ఎల్లరూ భీతిల్లిన సమయమున పరమేశ్వరుడు దానిని తన కంఠమున ధరించి లోకములను రక్షించెను. కానీ అది మిక్కిలి వేడిగానుండుటచే గంగానది ఈశ్వరుని జటాఝూటముపై ప్రవహించి కొంత ఉపశమనము కలిగించెను. తదుపరి ఆ గరళకంఠుడు చంద్రుని తన శిరస్సుపై ధరించెను. ఇందువలన అధిక ప్రయోజనము కలిగెను. అప్పుడా పరమేశ్వరుడు దేవతలతోడను, మహర్షులతోడను నృత్యము చేసెను.

## 4

## సత్యాన్నాస్తి పరోధర్మః

**పేకాటనాడుచు ప్రీతితో నారాత్రి**
**గడిపినందులకె జాగరణమగునె?**
**చేపలకొరకునై చెరువులో జాలర్లు**
**పొంచిచూచెడు దృష్టి ముక్తికగునె?**
**తప్పసారా త్రాగి తనమేనుమరచిన**
**మాత్రాన పరమతన్మయతనగునె?**
**భార్యపైనల్గియు పస్తుపరుండిన**
**వాడెల్ల నొకనుపవాసి యగునె?**
**తలపు నీయందెయుంచిన కలదుగాని భక్తిసుంతైన లేనిదె ముక్తి కలదె**
**ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు**
**సాధుసద్గుణ గణ్యులౌ సభ్యులార!**

ఈ శివరాత్రి దినము చాలా పవిత్రమైన దినము. ఈ దినములోపల ఎన్నిరకములైన భావములుండినప్పటికి ఒక్కరాత్రియైనా నిశ్చింతగా దైవచింతన చేసినప్పుడు ఎంతైనా మనము సాధించటానికి అవకాశముంటుంది. సర్వేంద్రియములు భగవంతునివైపు మరల్చటానికి చక్కని అవకాశము యిది. మన యింద్రియముల పటుత్వాన్ని దైవమునకర్పితము చేసినప్పుడే నిజమైన త్యాగము. దీనిని పురస్కరించుకొనియే వేదవాణి 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానసుః' అమృతత్వము పొందటానికి త్యాగమే మూలము. దేనిని మనం త్యాగంచేయటం? ధనమును త్యాగము చేయటమా లేక భూమిని త్యాగము చేయటమా? కాదు కాదు. మన యింద్రియములను త్యాగము చేయాలి. ఇంద్రియ త్యాగమే నిజమైన త్యాగము. దానినే తన, మన, ధన అన్నారు. తనువనగా దేహము. శరీరమనస్సుతో కూడిన యింద్రియ ధనము. ఈమూడింటి అంతరార్థమే తను, మన, ధనమని చెప్పారు. అంతేగానీ యీ పాంచభౌతికమైన దేహము భగవంతునికివ్వమని కాదు.

**మలమూత్ర దుర్గంధ మాంసరక్తమె గాని**
**కాంతి కలుగు వజ్రఘటము కాదు**
**నిముష నిముషమునకు నీచులూరునెగాని**
**పునుగు జవ్వాదీలు పుట్టబోవు**

ఇలాంటి దేహము భగవంతునికి కాదు. దేహ భ్రాంతిని త్యజించాలి. ఎంతకాలమని అనుభవిస్తాము? ఎంతకాలము అనుభవించినప్పటికి యింకాయింకా అనుభవించాలని ఆశిస్తున్నాము. ఇది కాదు త్యాగము. ఛ! అనుభవించాము యింతకాలము. దీనియొక్క అంతరార్థము ఏమిటి, సుఖము ఏమిటి, ఆనందము ఏమిటి అని ప్రశ్న వేసుకున్నప్పుడు ఏమాత్రము జవాబు మనకు తెలియటంలేదు. ఈ లౌకిక ప్రకృతి లక్షణములను త్యాగము చేయనప్పుడు యింకనిజమైన ఆత్మతత్వాన్ని ఏరీతిగా అభివృద్ధిచేసుకోగలము? కాఫీ ఒకనాడు ఒకనిముషము ఆలస్యమైందంటే వంటవానిపై అరుస్తాము మనము. పొగ త్రాగేవాడు ఒక్కక్షణము లేటైందంటే చాలా తపించి పోతాడు. వక్క ఆకు నమిలేవారు ఒక్కతూరి ఆకులు లేకపోతే చాలా బాధపడతారు. ఈ తుచ్ఛమైన యీ అభ్యాసములే మనము వదలలేకపోయినప్పుడు నిత్యసత్యమైన మానవత్వముతో కూడిన యింద్రియతత్వము ఏరీతిగా వదలటానికి వీలవుతుంది? కనుక వదలటానికి వీలుకాని యింద్రియములను సాధనచేత సాధించాలి. వదలటం నా ఉద్దేశ్యములో చాలా సులభము. వీటిని పట్టుకోటమే చాలా కష్టము. చేతిలోనున్న బట్టను వదలటం చాలా సులభము. దీనిని పట్టుకున్నంతసేపు చేతులు నొప్పిగా ఉంటాయి. కనుక త్యాగమే ఎంతో సులభంగా ఉంటుంది. నిత్య జీవితంలో మనం చేస్తున్న త్యాగాలు చక్కగా పరిశీలన చేసుకోండి. ఇది మనకెంత సేవనందిస్తున్నది విచారణ చేయండి. గాలిని తీసుకుంటున్నాము. తీసుకున్న గాలిని తిరిగి వదులుతున్నాము. అది వదలినప్పుడే మన ఊపిరితిత్తులు క్షేమంగా ఉండగలవు. కాబట్టివదలటం వలన క్షేమమే ఏర్పడిందికదా! తిన్న ఆహారము మరొకవైపున విసర్జన చేస్తున్నాము. విసర్జన చేయకపోతే కడుపు చెడిపోతుంది కదా. ఈ త్యాగము వలన మనకెంత క్షేమం కల్గింది. ఈ ప్రత్యక్ష ప్రమాణాన్ని మనం విచారణ చేసుకున్నప్పుడు అపరోక్షమైన తత్వము మనకర్థమవుతుంది. త్యాగములోనే క్షేమముంటున్నాది. పర్వదినములన్నీ త్యాగనిమిత్తమై ఏర్పడినవేగానీ భోగనిమిత్తము ఏర్పడినవి కావు. భోగమునకు రోగమే ఫ్రెండ్, త్యాగమునకు యోగమే ఫ్రెండ్. భగవంతుడు నీ భక్తిని చూస్తాడుగానీ నీ శక్తిని చూడడు. భగవంతుడు నీ చిత్తమును చూస్తాడు గానీ నీ విత్తమును చూడడు. భగవంతుడు నీ గుణములు చూస్తాడుగానీ నీ కులమును చూడడు. భగవంతుడు నీ మతిని చూస్తాడుగానీ నీ మతమును చూడడు. భగవంతుడు చిత్తాపహారిగానీ విత్తాపహారి కాదు. కానీ యీనాడు విత్తాపహారిగా భగవంతుని భ్రమించి భగవంతుని విత్తముచేత తృప్తిపరచటానికి ప్రయత్నం చేస్తున్నాం. ఇదియే భక్తుని అజ్ఞానము. ఐతే మంచి కార్యములోపల విత్తము ప్రవేశపెట్టవచ్చు. భగవంతునికి దీనితో ఎట్టి సంబంధము లేదు. కొన్నిరకములుగా ఫోర్సుతో భగవంతుని అనుగ్రహానికి పాటుపడుతున్నాము. భగవంతుడు ఫోర్సుకి ఏనాడూ చిక్కడు. సోర్సుకే చిక్కుతాడు.

మానవుడు నిత్యము అనిత్యము, క్షేత్రజ్ఞుడు క్షేత్రము, చైతన్యము జడము, ప్రాణము శరీరము, దేహి దేహము, సత్ అసత్ వీటి కలయిక. వీటిని విభాగముచేసి దేహికి, క్షేత్రజ్ఞునికి, చైతన్యమునకు, శాశ్వతమునకు ప్రాముఖ్యతనిచ్చి దానితో కాలమును వ్యయము చేయుటే సాధకుల లక్షణము. అట్లు చేయక శాంతిని కోరుచూ అశాంతి పలుకులు, అక్రమ మార్గములు, అసత్య భావములు, అన్యాయ విషయములు వీటితో కాలమును అపవిత్రము చేసిన శాంతి ఎట్లు దొరకును? చక్కెరపానకమునాశించి చక్కెరా, ఉప్పాయని విచారణ సల్పక, చక్కెరకు బదులు ఉప్పువేసి పానకము త్రాగిన అది రుచించునా?

ఇన్నివేలమందిలో నాకు మోక్షము కావలెను అని ఆశించి నన్ను కోరేవాళ్ళు నూటికి డెబ్భైఐదుమందైనా ఉంటారు, నాకు తెలుసు. ఏమికావాలని నేను అడిగితే 'నాజన్మము సార్థకము కావాలి, సాక్షాత్కారమునను(గహించండి' అని జవాబిచ్చేవారు ఎక్కువ. అయితే నిజముగా మోక్షమునాశించి దానికొరకు ప్రయత్నించేవారు తక్కువ. తీరా మోక్షమునిచ్చుటకు వచ్చినప్పుడు మాత్రము వెనుకకు పోదురు. దానిని పుచ్చుకొనుటకు సిద్ధముగా లేరు. 'పది సంవత్సరముల తరువాత యివ్వండి. ఇప్పుడు నేను సిద్ధముగాలేను' అంటాడు. అజ్ఞాన నిర్మూలనము కొరకు శివరాత్రి వరకు వేచి ఉండనక్కరలేదు. ఏనాడు దానికొరకు శ్రద్ధతో ప్రయత్నము చేయబడునో ఆనాడే శివరాత్రి. ఏకించిత్ ప్రయత్నము చేసినా మీరు మోక్షమునకు సమీపవర్తులే. ఎల్లప్పుడు భగవత్కర్మలయందు, భగవచ్చింతనలయందు, భగవద్భావములయందు కాలము పవిత్రము గావించండి. ఇదే నిజమైన జాగరణ, ఉపవాసము. జాగరణ అనిన జాగ్రత్తగా ఉండటమే. ఈజీవితం ఏ నిముష మంత్యమగునో అనే భయముతో మరణించుటకు సిద్ధముగానుండవలెను. ప్రాణప్రయాణమునకు కావలసిన వైరాగ్యమును, నిత్యానిత్యవస్తువివేకమును యిప్పుడే సంపాయించుకొనవలెను. విషయవాసనలు నిద్రించి, వివేకవిచక్షణములు మేలుకొనవలెను.

జాగరణమనగా మేలుకోటమని. హెచ్చరిక. అదే చైతన్యము. ఈ చైతన్యము దేనితో కూడి ఉండాలి? హృదయముతో కూడి ఉండాలి. కానీ అట్లుకాకుండా జాగరణే దీనికి ప్రధానమని లౌకిక భావమును ఆశ్రయించుకొని మూడు సినీమాలు చూడటము, నాలుగు సినీమాలు చూడటము జాగరణచేశామని అనుకోటం. ఇది అజ్ఞానముయొక్క చిహ్నము. ఇంక ఉపవాసము చేస్తుంటారు యీ శివరాత్రి దినము వెఱ్ఱిమనుష్యులు. ఏమిటి ఈ ఉపవాసము? ఉపవాసమనగా భగవంతుని సమీపములో చేరే మార్గమే. అట్లుకాకుండా అన్నపానాదులు మాని చిరుతిండ్లు అధికంగా తింటూ ఉంటారు. ఉపవాసమనుకుంటున్నారు. ఆహారము నింపుకుంటున్నారు. ఇదికాదు ఉపవాసము. సమీప నివాసమే ఉపవాసము. దేనికి సమీపము? దైవానికి సమీపము. ఈ పర్వదినమున భగవత్సన్నిధిలో యింతటి ఆనందముతో మహాశివరాత్రి జరుపగలిగిన మీ అదృష్టము అంతులేనిది. మీ ఆనందమును నేనందుకొని నా ఆనందమును మీరందుకొని సంతోషించే సమావేశమిది. నామసంకీర్తన వలన ఆత్మానందము, వాతావరణపరిశుభ్రత, ఆస్తికతయొక్క అభివృద్ధి మొదలైన ఫలములు లభించును. సంకీర్తనము వలన యితరుల హృదయాకాశములను ప్రకాశింపజేయ వీలగును. ఇంతటితో మీ సంకీర్తన కార్యక్రమము సమాప్తి అయినదని అనుకోకండి. సమాప్తి అంటే బ్రహ్మప్రాప్తి అనేదే అర్థము. జీవితమున్నంతవరకు నామసంకీర్తన చేయవలయును. చేసే తీరవలయును. స్వామి పలుకులను హృదయములో భద్రపరచి ఆచరణసల్పు ప్రయత్నమునకు పూనుకొని జన్మ సార్థకముగావించుకోండి.

శివరాత్రి విశిష్టతకు శ్రీశైలమందు జరిగిన మరొక సంఘటన కూడ గమనించవలసినది. శ్రీశైలము దగ్గర ఒక చిన్న ఎలిమెంటరీ స్కూలులో బాలరామన్న అనే తొమ్మిది సంవత్సరముల పిల్లవాడు, తన సహపాఠకులు మా యింటికి రేపు శివరాత్రి కొరకు మా అక్క వస్తుంది, బావగారు వస్తారు అని ఉల్లాసముగా ఉత్సాహముగా వుండుట చూచి, తన యింటికి వచ్చి, "అమ్మా! మా అక్కా బావ మన యింటికి ఎప్పుడు వస్తారు? ఎందుకు యింతవరకు రాలేదు? మిగతా పిల్లల యిండ్లకు మాత్రము వారివారి అక్కగార్లు, బావగార్లు వస్తారటనే" అని చాలా గోల చేసాడు. ఏడ్చినాడు. అబ్బాయిని శాంతపర్చుటకు ఆ తల్లి " నీకూ ఉన్నారు, నీ అక్క బావ కొండపై గుడిలో ఉన్నారు. వారి పేర్లు భ్రమరాంబ, మల్లికార్జునస్వామి" అని చెప్పింది. ( మల్లికార్జున..తెల్లటి మల్లెపువ్వు. భ్రమర అంటె తుమ్మెద. ప్రకృతి దేవి పురుషోత్తముడు, పరమాత్ముని మధుర ప్రేమతత్వమును ఆ తీయని మకరందమును, ఆ దివ్యజ్ఞాన శక్తిని అనుభవించునది. భ్రమరాంబ అనేదాని అంతరార్థము.)

సరే! నేను పోయి నా అక్కను, బావను చూచి యింటికి రమ్మని అడిగి వారిని పిలిచి తీసుకొని వస్తానని ఒకే మొండిచేసినాడు. ఏమిచేసేదీ తెలియక, ఆ తల్లి పక్కింటి వాళ్లతో శ్రీశైలమునకు పంపింది. అక్కకు, బావకు ఏదైనా యివ్వాలని పిల్లవాడు చెబుతే, చిన్నవాడు పెద్దవారికిచ్చుట ధర్మము కాదు. వారే నీకు దండిగా తిండి, పండ్లు, గుడ్డలు ఏమికావలెనో అంతా యిస్తారని తల్లి సమాధానమిచ్చింది. పిల్లవాడు అడిగినవన్నీ మీరే గుట్టుగా తెచ్చి యియ్యండని పక్కింటివాళ్లకు గుట్టుగా చెప్పి, కొంత డబ్బును కూడ వాళ్ల చేతిలో పెట్టింది.

శ్రీశైలము చేరేవరకు పిల్లవాడు అక్కా, బావ అని వారి చింతనతోనే అడుగడుగుకు ఆతుర పడుతూ వెళ్లాడు. ఈమే నీ అక్క అని వారు భ్రమరాంబను చూపించిరి. ఈయనే నీ బావ అని గుడిలోని మల్లికార్జునస్వామిని చూపించిరి. నిర్మల, నిశ్చల, నిస్వార్థ ప్రేమతో, గాఢమైన విశ్వాసముతో ఆ పిల్లవాడు మల్లికార్జునుని పట్టుకొని బావా బావా అని ఏడ్చినాడు. ఇంటికి నాతో రమ్మని గోలచేసినాడు. అమ్మ చెప్పింది నువ్వు యింటికి రావాలని భ్రమరాంబ విగ్రహము యొక్క చేయి పట్టి లాగాడు. అక్కడ పూజారులు

వీడు పిచ్చి పిల్లవాడని ఆ అబ్బాయిని పట్టి పక్కకు నెట్టిరి.

రామన్న ఆవేదన అంతటితో ఆగలేదు. వాడు కొండపైకి పరుగెత్తి ఒక గుండుపై ఎక్కి నిలుచుకొని "అక్కా! బావా! మీరు నాతో వస్తారా లేకపోతే యిదిగో ప్రాణము తీసుకొంటాను, యింక బ్రతికి లాభం లేదు" అని కేకలు వేశాడు. తక్షణమే "మరిది రామన్నా నిలు, నిలు!" అని శబ్దము విన్నాడు. ఇద్దరూ ప్రత్యక్షమై అబ్బాయిని చేతిలో తీసుకున్నారు. నా యింటికి రావాలని పిల్లవాడు చెప్పగా , వాని యింటికి వెళ్ళారు. అక్కడ ఆ శివశక్తి స్వరూపములతో తల్లి కొడుకూ ఇద్దరూ లీనమై మోక్ష పదవినందుకున్నారు. శివరాత్రి శ్రీశైలమందు పెద్ద పర్వదినమగుటకు ఇదికూడా ఒక కారణము.

బాలరామన్న పరిశుద్ధచిత్తము కలిగి పవిత్రమైన విశ్వాసము వలన తన సర్వస్వమును పరమాత్మునికి అర్పితము గావించి తరించాడు. క్రింది స్థాయినుండి పెద్ద స్థాయికి తలంపులను, భావాలను అభివృద్ధిచేసుకోవాలి. పరమాత్ముని తన పెద్ద స్థాయినుంచి క్రింద స్థాయికి దించకూడదు. అంటే రాయిని దేవుడని పూజించు, చక్కని దేవుడని ఆరాధించు. మట్టితో గణపతిని చేసి, దానిని పూజించు. అయితే దేవుడు రాయి, దేవుడు చెక్క, దేవుడు మట్టి అని భావించకూడదు, వాదించకూడదు. ఆధునికయుగము అధ్వాన్నయుగముగా దీనివల్లనే తయారైనది. కలియుగము కలహయుగమైనది.

కాశీకి లక్షలమంది వెడుతుంటారు. కాశీ క్షేత్రము దర్శించే వారికి పునర్జన్మ లేదంటూ ఉంటారు. పునర్జన్మ ఉండబోదు. ఒకనాడు కైలాసంలో పార్వతీపరమేశ్వరులు మాట్లాడుకుంటున్నారు. పార్వతి అడుగుతున్నాది,"నాథా! కాశీకి వచ్చిన వారందరూ కైలాసానికి వెడుతున్నారంటున్నారే. కాశీకి లక్షలు లక్షలు వెడుతున్నారు. వారంతా కైలాసానికి వస్తే మనకు చోటు సరిపోతుందా! వీరందరూ కైలాసానికి వస్తారా?" అని అడిగింది. అప్పుడు ఈశ్వరుడు చెప్పాడు,"కాశీకి వచ్చినవారందరూ కైలాసానికి చేరుటకు సాధ్యం కాదు. ఎలాంటివారు కైలాసానికి చేరుతారో ఒక నాటకం ఆడిచూపిస్తాను. నేను చెప్పినట్లు నీవు చేయి" అన్నాడు. పార్వతి ఎనభైయేండ్ల ముసలి రూపు ధరించింది. ఈశ్వరుడు తొంభైయేండ్ల వృద్ధత్వం పొందాడు. కాశీవిశ్వేశ్వరుని ఆలయసింహద్వారము దగ్గర ఆ వృద్ధురాలు ఈ వృద్ధుడైన భర్తను తొడపైన వేసుకొని దేవాలయం లోపలికి పోయేవారినందరినీ అడుగుతున్నది, "అయ్యా! భక్తులు యెవరైనా దయతలచి నా భర్తకు దాహం తీర్చుటకు గంగా జలం పోయండి. నేను గంగా జలం తీసుకొని రావటానికి సాధ్యం కాదు. నా భర్త నా తొడపై ఉన్నాడు. నేను వెడితే నా భర్త ప్రాణం విడుస్తాడో ఏమో. కనుక మీరెవరన్నా కొంత జలం నా భర్త నోట్లో పోయండి" అని అందరినీ ప్రార్థించింది పాపం. దేవాలయానికి వెళ్ళేవారు గంగానదిలో స్నానం చేసి తడిగుడ్డలతో వస్తున్నారు. ఈమెను చూసేసరికి, ఏమిటిరా, విశ్వేశ్వరుని దర్శనానికి వస్తే యీదరిద్రం ఎదురైందని అనుకొని ,వాళ్లను తప్పించుకొని పోయేవారు కొందరు. ఆమె అడుగుతుంటే ఏమీ తెలియనట్లు వెళ్ళేవారు కొందరు. ఇంకా కొందరు అటువైపు తిరిగి వెళ్లేవారు. ఈరీతిగా అందరూ కూడ వారిని తప్పించుకొని పోతున్నారు. మేము మొట్టమొదట దర్శనం చేసుకొని తరువాత నీ భర్త నోటిలో నీరు పోస్తాం కానీ మొదట నీరు పోయము అనేది కొందరు. కానీ, ఒకడు గజదొంగ. కాశీకి వచ్చేవారిని మార్గమధ్యములో పట్టుకొని కొట్టే గజదొంగ వాడు. ఆ గజదొంగ దేవాలయము వాకిలి వద్ద అందరూ చేరినప్పుడు కిక్కిరిసి ఉంటారు, అప్పుడు జేబులు కొట్టవచ్చని వెళ్లేవాడు విన్నాడు. "అమ్మా! మీరెవరు?"అని అడిగాడు. "మేము కాశీవిశ్వేశ్వరుని దర్శనం కోసం వచ్చాము నాయనా, కానీ నా భర్త మూర్ఛపోయాడు దాహంతో. ఎవరైనా కొంచెం గంగాజలం తెచ్చి కంఠంలో పోస్తే బ్రతుకుతాడో యేమో. నేను ఆయన్ను విడచి గంగాజలము తేలేను. మీరు కొంచెం సహాయం చేసి పుణ్యం కట్టుకోండి". అప్పుడు వాడు చంకలోనున్న సొరకాయ బుఱ్ఱలోని నీరు పోయటానికి సిద్ధపడ్డాడు. ఆమె చెప్పింది,"ఆయనకు నీరు పోసే ముందుగా నాకొక అభీష్టముంది. ఆ అభీష్టము నెరవేర్చి నీరు పోయి" అన్నది. "ఏమి అభీష్టము?" అడిగాడు. "ఆ నీరు పోసేటప్పుడు నా భర్త ప్రాణం వదులుతాడో యేమో. నీవు సత్యం అని చెప్పి పోయాలి. అసత్యం చెప్పి జలం పోస్తే ప్రయోజనం లేదు". ఏమిటని అడిగాడు."నీవు యింతవరకు ఏమి పుణ్యం చేశావో చెప్పి జలం పోయాలి"అంది. అప్పుడు వాడు, "అమ్మా! యింతవరకూ నేను ఒక పుణ్యకార్యమూ చేయలేదు. అన్నీ పాపాలే చేశాను. ఇదిగో యీ సమయంలో దాహంతోనున్న వృద్ధునికి నీరు పోయటం ఒక్కటే పుణ్యం," అని చెప్పి నీరు పోశాడు. అప్పుడు శివుడు పార్వతి స్వస్వరూపములతో దర్శనమిచ్చి, " పరోపకారార్థమే జీవితము, స్వార్థము నిమిత్తము కాదు. కావున నీవు ఎన్ని చెడ్డ పనులు చేసినా, దొంగ పనులు చేసినప్పటికీ, పరుల సేవయే పరమార్థ సేవగా భావించి సత్యాన్ని ఉచ్చరించి గొంతులో నీరు పోశావు. సత్యాన్నాస్తి పరోధర్మః. సత్యానికి మించిన ధర్మము లేదు. పరోపకారానికి మించిన ప్రార్థన లేదు"అని కైలాసానికి తీసుకుపోయారు.

## ఈశ్వరేచ్ఛకు ప్రతిబింబమే సమాజము

మౌళి గుల్కెడు చంద్రమఃఖండ కళతోడ
    బెడగారు గంపెడు జడలతోడ
జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ
    దంబైన ఫాలనేత్రంబుతోడ
నల్ల నేరెడువంటి నల్లని మెడతోడ
    కరమున నాగ కంకణముతోడ
నడుమున చుట్టిన నాగచర్మముతోడ
    మైనిండనలదు భస్మంబుతోడ
నుదుట దీర్చిన పెద్ద కుంకుమ బొట్టుతో
    తాంబూల రాగాధరంబుతోడ
ఆరుశాస్త్రములందున నందగించి
నల్ల కలువల హసియించి కొల్లలాడు
మెరుగు చామన ఛాయ మేనితోడ
శైలరాజేంద్రుదు నేడు ప్రత్యక్షమయ్యో

దివ్యజీవితమునకు ప్రాతిపదికము ఆత్మ. శరీరము ఆత్మకు క్షేత్రము. ఆధ్యాత్మిక జీవితమునకు సాంఘిక జీవితము అనుగుణంగా ఉండాలి. కానీ యీనాటి మానవుదు దేహమునే సత్యముగా విశ్వసించటంచేత ఆత్మజ్ఞానము ప్రబోధించవలసి వచ్చింది. వ్యక్తియొక్క పరిణామమునకు, సాంఘిక పరిణామమునకు మూలాధారము ఈశ్వరేచ్ఛయే. ఈశ్వరేచ్ఛయొక్క ప్రతిబింబమే సమాజము. ఇట్టి స్థానమునుండి మానవుదు ప్రవర్తించినప్పుడే, అహంకార ప్రమేయము లేక మానవుదు తన కర్తవ్యాన్ని నిర్వర్తించగలదు. కనుక మానవుని యొక్క ప్రధాన ధర్మము ఈశ్వరేచ్ఛయే. ధర్మమనగా సమాజమునుండి వెలువడిన ఈశ్వరేచ్ఛయొక్క చైతన్యమే.

'ఈశావాస్యమిదంసర్వం' అనేది ఈశావాస్య ఉపనిషత్తులోని మొదటి శ్లోకము. 'ఈశ' అనే శబ్దమునకు ఈశ్వరుదు అని అర్థము. ఈశ్వరుదు అంటే, సర్పములను ఆభరణములుగా ధరించి, గంగను శిరస్సుపై ఉంచుకొని, చంద్రుని తలపై పెట్టుకొని, గజచర్మాంబరుదై, త్రిశూలధారియై, వృషభమునెక్కిన వాదని లోకవిదితము. సకలైశ్వర్యములతో కూడినదే ఈశ్వరతత్వము, ఈశ్వర రూపము. ఈశ్వరుదు సకలైశ్వర్య సంపన్నుదు. ప్రాపంచికముగా ధనకనకవస్తువాహనాలు, విద్యా భాగ్యము, ఆరోగ్య భాగ్యము అన్నీ ఐశ్వర్యములే. అయితే వీటికన్న విలువైన ఐశ్వర్యములను ఈశ్వరానుగ్రహము వలన మానవులు అందుకొనుటకు వీలున్నది. ఈశ్వరుదు కరుణించు ధనములలో అత్యుత్తమమైనది ఆత్మజ్ఞానధనమే.

'యతో రుద్ర శివోతనూఘోరాపాపనాశినీ' వేదపురుషుదైన ప్రజాపతికి రెండువిధములైన స్వరూపస్వభావములు, ఆకారవిశేషములు ఉన్నవి. ఘోరమైన రూపమునకు రుద్రమనియు, అఘోరమైనదానికి శివం అనియు పేర్లున్నవి. స్తంభమును ఛేదించుకొని నారసింహుదు బయలుదేరినప్పుదు ప్రహ్లాదుదు ఆ సుందరాకారమును చూచి ఆనందోన్మత్తుడైనాదు. దైవ విరోధి అయిన హిరణ్యకశిపునికి అది రుద్రాకారముగా కనబడి భయాందోళనములను కలుగచేసినది. అనగా ఏకత్వమైన దివ్యత్వములోనే రుద్రము అరుద్రము, ఘోరము అఘోరము మానవుని మనస్తత్వమునసుసరించి గోచరమగునని స్పష్టమగుచున్నది. ఈరెండు రూపములే సృష్టి, స్థితి, లయములకు

ఆధారముగా పేర్కొనబడినవి. లోకకళ్యాణనిమిత్తమై ఆ పరమాత్ముడే శివముగాను, రుద్రముగాను తన స్వరూపస్వభావములను నిరూపించుకుంటున్నాడు.

ఘోరము, అఘోరము లోకమునందు సర్వసామాన్యములు. భోగ్యవస్తువులను ఆరగించునప్పుడు దానివలన కలిగే తుష్టి, పుష్టి, సంతుష్టి, ఆరోగ్యము అఘోరము. శివము. అదే వస్తువులను మితము తప్పి భుజించిన అది ఘోరాకారమును ధరించి మృత్యువునకు అతి సమీపముగానే తీసుకొని వెళ్లును. అంటే ఆనందమునకు అభ్యంతరము కలిగించే విషయములు, అనుభూతులు, సన్నివేశములు, సంఘటనలు యివన్నీ ఘోరము. హద్దులను పాటించిన, మితాహారము అఘోరానందము నందించును. అమితాహారము ఘోరత్వమనే రోగతత్వానికే దారితీయును.

శంకరుడు అని ఈశ్వరునికి మరొక పేరు. శం అనగా సుఖము, చిదానందము, మంగళము అని అర్థము. కర..అనగా అందించేవాడు, కలిగించేవాడు. సర్వసుఖములను యిచ్చి పోషించేవాడు. తనను ఆశ్రయించిన వారలకు, తనను ఆరాధించిన వారలకు చిదానందమును, సౌఖ్యమును చేకూర్చేవాడు శంకరుడు. ఆత్మ సుఖమే ఉత్తమమైన, శాశ్వతమైన సుఖము. అదే నిత్యానందము. దాని కన్న మంగళమైన స్థితి జగత్తులో లేదు.

సర్వసుఖములు, మంగళములూ అనుగ్రహించు ఈశుడు ఎక్కడున్నాడు? ఇదం సర్వం. సర్వత్రా ఉన్నాడు. అతను పురుషుడు కాదు. స్త్రీ కాదు. రెండూ కాబట్టి దివ్యపురుషుడు. అందువలననే సాంబశివుడు. సా అనగా దివ్యత్వము. అంబ అనగా తల్లి, జగత్తు. శివ అనగా తండ్రి. ప్రకృతి పురుషుల దివ్యమైన సంబంధబాంధవ్యమే ఈశ్వరత్వము. అదేవిధముగా సా అనగా దివ్యమైన, ఆయి అనగా తల్లి, బాబా అనగా తండ్రి. సాంబశివుడు, సాయిబాబా వీరికి ఏమాత్రమూ వ్యత్యాసము లేదు. సాంబశివుడను పదమునకు అర్ధనారీశ్వరుడని మరొక అర్థము. ప్రకృతంతయూ భగవంతునిలో ఒక అర్ధ భాగము. ప్రకృతి చైతన్యము వ్యర్థమైనది కాదు. అహంకార పరమైనప్పుడు వికృతంగా మారుతుంది. ఆత్మ పరమైనప్పుడు సుకృతంగా మారుతుంది.

శివం అనగా మంగళము. భౌతిక స్వరూపంతో అవతారముగా వచ్చినప్పుడు శాశ్వత మంగళ స్వరూపము మరుగు పడవచ్చును. కొంతకాలమైన తర్వాత దేహము త్యజించి గతించును. అయితే నిత్యమంగళ స్వరూపము యొక్క ఆవిర్భావము కాబట్టి, అవతారములయొక్క పేరుల ముందు మంగళ సూచకమైన శ్రీ అనే పదము వాడుదురు. శివ, విష్ణు, బ్రహ్మ అంటారుగానీ శ్రీశివ, శ్రీవిష్ణు, శ్రీబ్రహ్మ అని వాడరు. ఎందుకంటే త్రిమూర్తులు శాశ్వత మంగళ స్వరూపులు. అయితే మానవ వేషములో శరీరోపాధిని ధరించిన అవతారములకు శ్రీరామ, శ్రీకృష్ణ, శ్రీసాయిబాబా అని మంగళ సూచక పదమును వాడుదురు. ముందు అమంగళముగా మారిపోవును కనుక శ్రీ అని గుర్తు అవసరము.

ఈశ్వరునికి మృత్యుంజయుడు అని మరొక పేరు. ఈశ్వరుడు కాలస్వరూపుడు కాబట్టి మృత్యువును జయించినవాడు. అతడు కాల ధ్వంసకుడు. కాలాతీతుడు. కాలమును తన హస్తమునందు పెట్టుకున్నవాడు. భూత, భవిష్యత్, వర్తమాన కాలములనుగుర్తించే త్రిశూలము అతని హస్తమునందు ఆయుధముగా ఉన్నది. ఈశ్వరుని ఆశ్రయించిన యెడల కాలమేమి చేయగలదు? కాలము వచ్చి కాయమును తీసుకొని పోవునేమోనని భయపడనక్కరలేదు. మార్కండేయుని చరిత్ర చూడండి. ఆయనకు 16 సంవత్సరములు ఆయుః ప్రమాణము. అదే భగవంతుని వరప్రసాదము. దీనిని తెలుసుకున్న ఆ బాలుడు నిరంతరము ఈశ్వరసన్నిధిలోనే భజన చేయుచూ ఆ శివలింగముతో ఐక్యమైనాడు. గడువు తీరి, కాలుడు వచ్చి పాశము వేసినప్పుడు ఆ పాశము శివుని మెడలోకూడా పడింది. శివుడు ప్రత్యక్షమై 'నాలో చేరిన వానికి కూడా పాశము వేస్తావా?' అని మందలించాడు. అంటే ఈ కథకు అంతరార్థమున్నది. కాలమే యముడు. అహంకార, మమకారములతో మనం తయారుచేసే బంధసాధనమే త్రాడు. అదే పాశం. కాలస్వరూపుడైన శివుని అనుగ్రహము పొందిన వానిని కాలః కిం కరిష్యతి? శివుని రెండవ చేతిలో ఢమరుకము పెట్టుకున్నాడు. అది శబ్దమునకు గుర్తు. శబ్దమునుండి సృష్టి బయలుదేరినది కాబట్టి యిది ఈశ్వరుని సృష్టికర్తృత్వము సూచిస్తున్నది.

ఈశ్వరునికి మరొక పేరు పెట్టారు. లోకమెట్లా ఉందో చూడండి. ప్రశాంతి నిలయంలో ఉన్నవారంతా దైవం, దైవం అని చింతిస్తుంటే బయట ఉన్నవారంతా ఏమి పిచ్చివాళ్ళురా వీళ్ళకు సాయిబాబా పిచ్చి పట్టింది, ప్రశాంతినిలయంలో చేరారు అని మిమ్మల్ని పిచ్చివాళ్ళుగా భావిస్తుంటారు. ఇక్కడకు రాకుండా ద్వేషించే వారిని మీరు పిచ్చి వాళ్ళని భావిస్తారు. వారు మిమ్మల్ని, మీరు వాళ్ళని పిచ్చి వాళ్ళనుకుంటున్నారు. ఇద్దరూ పిచ్చివాళ్ళే. దైవం పిచ్చి మీది, లోకం పిచ్చి వారిది. పిచ్చాసుపత్రిలో రకరకాల పిచ్చివాళ్ళుంటారు.

ఒకరు కొట్టేవాడు, ఒకడు తిట్టేవాడు, ఒకడు ఉమ్మేసేవాడు, ఒకడు గలాటా చేసేవాడు ఎన్నోరకాలుగా ఉంటారు. కానీ ఒక మూల కూర్చొని శాంతంగా ఉండే పిచ్చివాని వల్ల డాక్టరుకి కూడా సుఖమే కదా! కనుకనే ఋషులు ప్రకృతిని చక్కగా పరిశీలించి అందరూ అన్ని రకాల పిచ్చివాళ్ళేనని, పిచ్చివాళ్ళందరి కంటె గొప్ప పిచ్చివాడొకడున్నాడని, పిచ్చివాళ్ళలో అగ్రగణ్యుడు దేవుడేనని తేల్చి ఉన్మత్తశేఖరుడని అతనికి పేరు పెట్టారు. ఈశ్వరుని పిచ్చివాడని ఎందుకన్నారంటే అతనికి జిల్లేడుపూలు, ఉమ్మెత్తపూలు యిష్టమట. ఈ పువ్వులు పిచ్చి పట్టించేవైనా అవే ఆయనకు యిష్టమట. అందుకే అర్కద్రోణప్రియాయనమః అన్నారు. ఇందులోని అర్థమును మనం గమనించాలి. లోకంలో పాపం చేయనివారు నల్గురు. బాలుడు, ఉన్మాది, జ్ఞాని, పిశాచి. బాలునికేమీ తెలియదు పాపం. తెలిసి పాపం చేయడు. పిచ్చివానికి కూడా యేమీ తెలియదు. అతను కూడా తెలిసి పాపం చేయడు. జ్ఞానికి సర్వత్రా దైవత్వమే కనిపిస్తుంది. కనుక అతను ఏ పాపకార్యంలోనూ ప్రవేశించడు. పాపఫలాన్ని అనుభవిస్తున్న పిశాచికి జ్ఞానం నశిస్తుంది. కనుక అదికూడా తెలిసి యే పాపము చేయదు. పాపం చేయని వారికి పుణ్యము నిండుగా ఉంటుంది. పిచ్చివారిలో ఈశ్వరుడు అగ్రగణ్యుడు కనుక అతనికి ఎట్టి పాపాలు అంటుకోవు. నిరంతరం పరిశుద్ధుడై ఉంటాడు. కనుక ,సంసారమనే బురదలో చిక్కుకున్న వారిని గట్టునున్నవాడే లేవనెత్తగలడు. ప్రాకృత సంబంధమైన విషయవాసనలలో పడి కొట్టుకుంటున్న మానవులందరినీ గట్టుచేర్చి రక్షించేవాడు ఈశ్వరుడు. దైవత్వం విశిష్టతను, గుణగణాలను, శక్తిసామర్థ్యాలను యిట్టివి అట్టివి అని ఎట్టివారికి వర్ణించటం సాధ్యం కాదు. అవాఙ్మానసగోచరుడు.

ఈశ్వరునికి మరొక పేరు యోగశిఖ అని. ఆకాశమే అతనియొక్క నీలాలుగా, దిక్కులే అంబరములుగా కలిగినవాడు కనుక దిగంబరుడని మరొక పేరు. పంచాననుడని మరొక పేరు కలదు. పంచభూతములు జలము, అగ్ని, వాయువు, పృథ్వి, ఆకాశము తననుండి ఆవిర్భవించినవి. అట్టి పంచభూతములతో నిర్మింపబడిన దేహధారులే మానవులు కాబట్టి, వారిలో కూడా అదే శివతత్వమున్నది. ఇతనికి భూతనాధుడని మరొక పేరు. భూతమనగా సృష్టి. సృష్టింపబడిన ప్రతి ప్రాణికి యితను అధిపతి. ఏతావాతా సృష్టి అంతయూ ఈశ్వరునియందే ప్రతిబింబిస్తుంది.

ఈశ్వర స్వరూపములో కంఠమున లోకమునే క్షయము చేయగల హాలాహలమున్నది. లోక కళ్యాణము చేకూర్చే నిమిత్తమై కంఠమునందు విషమునుంచుకున్నాడు. శిరస్సుపై సర్వ జీవులకు ప్రాణాధారమైన గంగ ఉన్నది. ఫాల ప్రదేశమందలి నేత్రమున అగ్ని ఉన్నది. శిరస్సుపై కల నెలవంక చైతన్యమునకు సంకేతము. శివుని దేహముపైనున్న పాములు ప్రాణికోటికి సంకేతములు. త్రిగుణములు త్రిమూర్తికి ప్రతిరూపము. కనుక త్రిలోక, త్రికాల, త్రిమూర్తి స్వరూపమే ఈశ్వరత్వము. తానున్నది వెండి కొండ. తన ఆప్తమిత్రుడు ధనాధిపతియైన కుబేరుడు. ఇన్ని ఉండియూ ఈశ్వరుడు ఆది భిక్షకుడుగా మారటానికి కారణం ఏమిటి? ధన,కనక, వస్తువాహనాదులు దివ్యత్వమునకు ప్రతిబంధకములనే సత్యాన్ని జగత్తుకు చాటే నిమిత్తమై తాను యీవిధంగా సర్వమూ త్యజించాడు. త్యాగముచేతనే శివుడు సదానందుడుగా, చిదానందుడుగా మారాడు. వివేక, వైరాగ్య, విచక్షణలతో జ్ఞానము సంపాయించిననే గమ్యమనే సత్యస్య సత్యమును ప్రబోధించుచూ యీరూపముగా ప్రచారము చేయునదే భిక్షాటనము యొక్క అంతరార్థము. ఈశ్వరుని మరొక పేరు కామారి. అనగా వాంఛలను జయించినవాడు.

శివుడు నిరంతరమూ అఖండ మంగళ స్వరూపుడే. మానవుడు ఈశ్వరతత్వము ననుసరించి జీవించాలి. శివుడు ప్రజలకు హాని కలిగించే విషమును, దానినుండి యెవరికీ ప్రమాదము కలుగకుండా తనలోనే ఉంచుకొనుట మానవులకు ఒక గుణపాఠము నేర్పించుటకే. శివుడు చంద్రుని శిరస్సుపై ధరించి ప్రదర్శించుచున్నాడు. లోకానికి వెలుతురునిచ్చి, శీతలముగా హాయినిచ్చే చంద్రుని దాచిపెట్టక అందరియందు ప్రకటించుచున్నాడు. మానవులు కూడా మంచిని పెంచి చెడ్డను అణగద్రొక్కాలి. జగత్తును నాశనము చేసే చెడ్డ వస్తువులను బయట ప్రదర్శించక లోపల దాచి ఉంచాడు. మానవుడు కూడా చెడ్డదానిని బహిరంగపర్చక చెడుభావాలను, క్రియలను, ప్రవర్తనలను, ప్రేరణలను అణగద్రొక్కి వాటి శక్తిని క్రమక్రమేణా తగ్గించాలి. అంతేగాని సమాజమునకు చాటుటకుగానీ, ప్రకటించుటకుగానీ పూనుకో కూడదు. ఇతరులకు మంచిని కోరి, మంచి చేసి, మంచి పనులతో వారిని సంతోషింపజేసి వారికి సహాయకులుగా నిలవటమే శ్రేయస్కరము.

ఈశ్వరుని విభూతిధారి అంటారు. కానీ విభూతి అనే పదం యొక్క అర్థాన్ని గుర్తించుకోలేనివారు ఈశ్వరునిపై విభూతి కనిపించదే అని అనుకుంటారు. అసలు విభూతి అంటే ఏమిటి? సర్వసంపత్తులూ, సర్వశక్తులూ భగవంతుని విభూతులే! సకలైశ్వర్యసంపన్నుడే ఈశ్వరుడు. భగవంతుని దగ్గర యిది కలదు, అది లేదు అని ఎవ్వరూ చెప్పలేరు. సమానరాహిత్యము భగవంతుని ప్రత్యేక లక్షణము. ఆయనకు సాటి లేదు. ఆ దివ్యత్వమునుంచి ఆవిర్భవించినదే లీలావిభూతి, అంటే ప్రపంచము. ఈశ్వరత్వములోని

అంతర్లీనమైయున్న యోగశక్తివలన ఆయన జగత్తుగా కనబడును. కాబట్టి 'ఈశావాశ్యమిదంసర్వం'. ప్రతిమానవునియందు ఈశ్వరాంశమున్నది. దానివల్లే మానవుడు శివం, అదిలేకపోతే, మానవుడు శవం. త్రిగుణాత్మకమైన జీవతత్వమందు గుణాతీతుడైన ఈశ్వరుడున్నాడు. ఈశ్వరుడు నిత్యవిభూతి.

భగవంతుని దేని నిమిత్తము ప్రార్థించాలి? నాకు అది కావాలి, యిది కావాలనే లౌకికమైన కోరికల నిమిత్తమై కాదు. 'ఓ భగవంతుడా! నా దగ్గరలేని ఆనందము, శాంతి నీ దగ్గరున్నాయి. వాటిని నాకు ప్రసాదించు' అని ప్రార్థించాలి. ధనము, బంగారము, వజ్రవైఢూర్యములు యీ ప్రపంచములో కావలసినంత. మనకు కనిపిస్తూనే ఉన్నాయి. కనుక యివన్నీ మనం కోరనక్కరలేదు. కానీ యీ ప్రపంచములో కనిపించనివి, వినిపించనివి రెండున్నాయి భగవంతుని దగ్గర. అవే శాంతి, ఆనందము. కనుక, 'భగవంతుడా! నీవే నాకు కావాలి' అని కోరుకోండి. భగవంతుడు వెంట ఉంటే సర్వమూ ఉన్నట్లే. అన్నీ తానే అందిస్తాడు. మీకు రక్షణ కలిగిస్తాడు. భుక్తినిస్తాడు, రక్తినిస్తాడు, విరక్తినిస్తాడు, ముక్తినిస్తాడు. తుచ్ఛమైన కోరికలచేత మీరు అప్పటికప్పుడు తృప్తి పదుతున్నారు. తిరిగి మరునిముషంలోనే దుఃఖాన్ని అనుభవిస్తున్నారు. ధనవంతులు, ఐశ్వర్యవంతులు, అధికారులు ఎంతమంది లేరీలోకంలో? కానీ వారందరూ శాంతిని, ఆనందాన్ని అనుభవిస్తున్నారా? లేదు. శాంతి, ఆనందము భగవత్ వరప్రసాదములే.

జ్ఞానమూ ద్వైతమే, అజ్ఞానమూ ద్వైతమే. జ్ఞానాజ్ఞానములకు అతీతమైన స్థితిని పొందటమే పరతత్వము. పరమనగా రాకపోకలు, జననమరణములు లేనటువంటి స్థానము. వచ్చేది పోయేది కాయము. నీవు స్థిరము. 'జాతస్య మరణం ధ్రువం' జన్మించుట, మరణించుట సత్యము. ఏది జన్మించునది? ఆత్మయా? కాదు. దేహము. దేహము జడమని మనం భావిస్తాము. కానీ కేవలము జడముకూడా కాదు. ఇందులో కూడా సత్తామాత్రమైన చైతన్యముంది. దేహమందు సత్తామాత్రచైతన్యము సర్వత్రా వ్యాపించి ఉంది. కనుకనే దేహమునకు సంబంధించినదాని కంతకూ జగత్తు అని పేరు పెట్టారు. కాయముగానీ, వస్తువుగానీ నిరంతరము మార్పు చెందునవే. మార్పే చెందకుండిన మనస్సు స్థాయిలో ఉండదు. మనకు తృప్తే కల్గదు. మార్పు మనిషి భ్రాంతి. అనేకమంది వాతావరణం మార్పును, స్థానం మార్పును కోరుతుంటారు. ఎక్కడికి పోయినా, ఎక్కడ ఉన్నా దేహం దేహమే. మనిల్లు మనిల్లే. దీని స్వభావము ఎక్కడికి పోయినా మారదు. కుక్కను గంగ దగ్గరకు తీసుకొని వెళ్లినా నాలుకతో గతుకుతుందేగానీ చక్కగా కుడువదు. మనిషి స్వభావం యిటువంటిదే. మనస్సును అనుసరించటంచేత అనేక వికారములు చెందుతున్నాం. ఈ వికారములచేత మన ఆకారములు అనారోగ్యమునకు, అశాంతికి గురౌతున్నాయి. ఈ రోగములకు మూలకారణము మన భ్రాంతే. ముఖం పూర్ణచంద్రునివలె విలక్షణంగా ఉండాలి. పూర్ణమైన ఆరోగ్యంలో ఈశ్వర తేజస్సు ప్రజ్వలిస్తుంది. మనస్సులో ఆనందాన్ని అభివృద్ధి పరచుకుంటే అదే కైలాసం. ఆనందమెట్లా లభిస్తుంది? కైలాసము హిమాచల ప్రదేశమన్నారు. హిమమంటే మంచుగడ్డ. చల్లదనం మంచు స్వభావము. తెల్లగా ఉంటుంది మంచు. తెలుపు పవిత్రతకు చిహ్నము. అచలమనగా స్థిరమైనది. చల్లదనమంటే ప్రశాంతము. అనగా పరిశుద్ధము, ప్రశాంతము, నిశ్చలము అయిన హృదయమే హిమాచలము. మనలో ఎప్పుడు ప్రశాంతత ఏర్పడుతుందో, ఎప్పుడు నిశ్చలత్వం కలుగుతుందో అప్పుడే మన హృదయం ఈశ్వరుని నివాసమైన హిమాచల పర్వతమౌతుంది. అప్పుడే జీవితము ధన్యమౌతుంది.

## లింగోద్భవము

ప్రతి మాసమందలి కృష్ణచతుర్దశికి మాసశివరాత్రి అనియూ, మాఘకృష్ణ చతుర్దశికి మహాశివరాత్రి అనియూ వ్యవహారమున్నది. శివరాత్రులందు ఉపవాసము, జాగరణ, మహేశ్వర దర్శనము, బిల్వార్చనము, నామసంకీర్తనము మొదలైనవి మిక్కిలి ఫలప్రదములు. జ్ఞానం మహేశ్వరాదిచ్ఛేత్ అనే శ్రుతి వచనమునను సరించి ఈ ఆచరణవలన ఆత్మజ్ఞానము కలుగునని ప్రసిద్ధము. చంద్రమా మనసో జాత మనస్సుయొక్క అధిదేవత చంద్రుడు. ఆ చంద్రునియొక్క కళలు కృష్ణపక్షమున దినదినమునకు క్షీణించి చతుర్దశినాడు కేవలము అత్యల్పముగా, చాలా బలహీనముగా ఉండుటవలన ఆ రాత్రి శివపూజ, శివచింతన, శివనామ సంకీర్తనము, శివదర్శనము, శివధ్యానములచే శివరాత్రిగా ఆచరించిన మనస్సు శివమయమై దానినుండి పెరిగి ప్రచండరూపమును ధరించు మాయ నాశనమగుననేదే శివరాత్రి యొక్క గూఢార్థము.

మాఘకృష్ణ చతుర్దశికి మహాశివరాత్రి అనే పవిత్రత వచ్చినది ఏ కారణమువలననగా ఆరాత్రి శివుని దివ్యదేహోపాధినుండి జ్యోతిర్లింగోద్భవమగుననీ పురాణములు ఘోషించుచున్నవి. మాఘకృష్ణ చతుర్దశి రాత్రి ఉత్తర దిక్కున కైలాసగిరి ప్రాంతమున ఒక మహా జ్వాలయును ,తన్మధ్యమున ఒక సహస్ర సూర్యసమ ప్రభావితమగు లింగము ఆవిర్భవించును. దాని ఆద్యంతములను కానలేక బ్రహ్మదేవుడు, విష్ణుదేవుడు యిద్దరూ ఆదిమధ్యాంతరహితుడగు సదాశివునకు ప్రణమిల్లి నుతించిరనేది ఆస్తికుల నమ్మకము. ఇందువల్లనే ఆనాటి రాత్రికి లింగోద్భవ కాలమని సర్వదేశవ్యవహారము కలదు.

రూపరహితమైన ఈశ్వర తత్వమునకు లింగము ఒక గుర్తు. లింగము అనే పదమునకు గుర్తు అనేదే అర్థము. లింగము లయమునకు గుర్తు. ప్రపంచమంతా లింగములో లీనమగును. ఇంద్రియములు, ఇంద్రియ విషయములు వీటి వెంట తిరిగే మనస్సు కూడా లయము కావలెను. భావములు, ఊహలు, మనోవికారములు, చిత్తవృత్తులు అన్నీ ఆ ఈశ్వరతత్వ చిహ్నముయొక్క ధ్యానములో లీనమై మానవుడు మనోజయమును సాధించవలెను. లింగము సృష్టికార్యము ప్రారంభమై నిరాకారనిర్గుణబ్రహ్మమునుండి హిరణ్యగర్భుడు (చరాచరాత్మక ప్రపంచమంతయూ) బహిర్ముఖమై ఆవిర్భవించిన గుర్తుగానీ వేరుకాదు. శివుడు లింగాకారముగనే ప్రపంచమును సృష్టించి, ఈజంగమ ప్రపంచములో సంగములగొడవలో జీవించుచున్న అన్ని జీవుల అంగములను నడిపించుచున్న శక్తితత్వము ఆ లింగమే. అంగములో అంటే కర్మేంద్రియజ్ఞానేంద్రియములు అంతఃకరణముతో చేరిన ఈ దేహములో సంగమున్నది. దేని సంగము? చిత్తు, జడము వీటి సంగము. ఆత్మ, అనాత్మ వీటి సంగము. ఈ సంగము వలనే సత్యాసత్య మిశ్రమమైన మిథ్యా జగత్తు ఉద్భవించింది. జగత్తు జంగమము. ఒక చోటు నిలకడ లేనిది. సంసారమని దీనికి పేరు. అదొక ప్రవాహము. భూత భవిష్యత్ కాలములలో మార్పు చెందును. ఈ జంగము సంసారములో మునిగి తేలుతూ, మానవుడు తన వివేకవిచక్షణవైరాగ్యాది గుణములనభివృద్ధిచేసుకొని పరమాత్ముని లింగస్వరూపమును, అంటే గుర్తును అన్నివైపుల్లోను శబ్దస్పర్శరూపరసగంధముల్లో అనుభవించి ఆనందించి తరింపవలెను. ఇదే జీవితముయొక్కసార్థకత.

ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణవేదములలో ఒక్కొక్క మహా వాక్యము గోచరించును. అవన్నియూ వేదసారమునకు చెందిన జ్ఞానరత్నములే. లింగములలో కూడా నాలుగు వేరువేరు నామములున్నవి. వాటిలో ఒక్కొక్కటి ఈ మహావాక్యముల ప్రతీకములుగానే రూపొంది వాటినే ప్రతిబింబించును. "అయమాత్మ బ్రహ్మ" అనే మహా వాక్యమునందిమిడియున్న ఈ ఆత్మ బ్రహ్మమే అనే సత్యమునే అండపిండలింగము ప్రత్యక్షముగా నిరూపించును. అండమే ఉపాధి, జీవుడు. పిండమే బ్రహ్మతత్వమైన ఆత్మ.

"ప్రజ్ఞానం బ్రహ్మ' అనే మహావాక్యము బ్రహ్మతత్వము కేవలము జ్ఞానస్వరూపమేగానీ వేరుకాదని చాటుతున్నది. ఈ సత్యమును సదాశివలింగము సూచించి బోధించును. సదా అనిన దేశకాలాతీతమై, కార్యకారణముల సంబంధములేక, 'శివం' మంగళకరమైన జ్ఞానముయొక్క గుర్తే ఆ లింగము. మూడవ మహావాక్యము 'తత్వమసి'. అదియిదియేనని బోధించుచున్నది. లింగరూపములలో జ్ఞానలింగము అనేపేరుతో వాడుచున్న ఆకారమే దీని గుర్తు. పండిన ఆకు కొమ్మనుంచి పడునట్లు జ్ఞానము కల్గినప్పుడు జీవుడు అదియే తానని అనుభవముతో తెలుసుకొని బ్రహ్మలో మునిగి లీనమగును. "అహం బ్రహ్మస్మి" అనే నాల్గవ మహావాక్యమునకు

'ఆత్మలింగము' సరైన ప్రత్యక్ష వ్యాఖ్య. లింగరూపుడు లింగోద్భవము గావించి లింగతత్వమును బోధించుచూ సాకారమైన అహం అనేదే నిరాకారుడైన బ్రహ్మమని తెలుపును.

శివరాత్రి ఈశ్వరునికి ఆత్మార్పణ గావింపవలసిన దినము. హిమాలయ పర్వతాగ్రములనుండి కన్యాకుమారి వరకు నేడు యావద్భారతదేశము 'శివోహం, శివోహం' 'ఓం నమశ్శివాయ' అను స్తోత్రములతో ప్రతిధ్వనించుచున్నది. ఇచ్చట అనేక వేలమంది, తదితర చోట్ల లక్షలు కోట్లాది ప్రజలు ప్రార్థనలు సల్పుటవలన నాలోనుండి లింగములావిర్భవించుచున్నవి. ఈ లింగోద్భవము వలన ప్రపంచమంతయూ నా ఆశీర్వాదమును, మీరు నా అనుగ్రహమును పొందగలుగు చున్నారు. ఈ లింగోద్భవము నాకు సహజ స్వభావమే. దీనికి పండితులొక యితిహాస గాథను వివరింతురు. పూర్వమొకపరి శివుడు తాను పొందిన ఆకారముయొక్క ఆద్యంతములను కనుగొన వలసినదిగా బ్రహ్మ, విష్ణువులను కోరెను. వారు తమ శక్తి కొలది ప్రయత్నించియు విఫలులై తమ ఓటమిని అంగీకరించిరి. కానీ ప్రార్థనానుగ్రహము వలనే లింగోద్భవము జరుగును. లింగోద్భవ కార్యమందు దైవసందర్శనమును, అతని అపార అనుగ్రహమునకొక చిహ్నముగా గుర్తించ వలెను. ఓంకారము పరమాత్మునియొక్క నాదచిహ్నమైనటుల లింగము భగవంతునియొక్క దృగ్గోచరమగు ఆకార చిహ్నము. ఇది మిగుల అర్థవంతమైనది. లింగమనగా అంతమందు జగత్తు పొందెడు మార్పు.

ఈనాడు శివరాత్రి. కొంతమంది తమలోనే ప్రశ్నలు వేసుకుంటున్నారు. 'స్వామి లింగోద్భవము చేయటములోని అర్థమేమి?' అని భగవంతుని శక్తిసామర్థ్యములు అగమ్యము, అగోచరము. దానికి అర్థనిరూపణము చేయటానికి యెవరికి సాధ్యము కాదు. "రసో వై సః" రసముతో కూడినదే ఈ దేహము. కనుక ఈ లింగోద్భవము ప్రత్యేకముగా వచ్చినది కాదు. భగవంతుడు హిరణ్య గర్భుడు. తన యొక్క ఉదరము హిరణ్మయముగా ఉంటున్నది. కాబట్టి ఈ రసమయమైన హిరణ్యము తిరిగి రసమంతా హిరణ్మయమై ఒక దగ్గర చేరిపోతుంది. దీనినే లింగ మన్నారు. లింగమనగా ఒక గుర్తు. దీనికి కన్ను, ముఖము, నోరు లేదు. ఇది తల, ఇది కాళ్ళు అని చెప్పుటకు వీలు లేదు. ఇది యిటు చెప్పవచ్చు, అటు చెప్పవచ్చు. ఏది తల, ఏది కాళ్ళు. "లీయతే గమ్యతే యితి లింగం". ఇదే గమ్యము. ఇదే లక్ష్యము. సర్వమునకు మూల కారణము లింగమే. ఈ లింగాకారము లోపల తయారై బహిర్ముఖముగా బయలు దేరుతుంది. ఇది కరగాలంటే యెంతో వేడి కావాలి. ఈ వేడి వల్లనే అది కరిగి లింగముగా తయారౌతుంది. అదియే యిది వచ్చే సమయంలో కలిగే బాధలు. ఇది లింగాకారమై బయటకు రావాలి. ఇది బయటకు వచ్చే సమయంలో పడే బాధ స్వామిబాధ అని భావిస్తున్నారు. ఇది బాధ కాదు. ఇది మీకు ఒక బోధ. తల్లిగర్భమునందున్న శిశువు బయటకు రావాలంటే తల్లి కొంత బాధ పడుతుంది. పాడు బిడ్డ అని తిట్టుకుంటుందా! నా బిడ్డ సుక్షేమంగా ఉండాలని ఆశిస్తుంది. అదేవిధముగా లింగము వచ్చేటప్పుడు ఎట్టి బాధలు లేవు. ఇది నాకు బాధ అని నేను భావించను. ఇంతమందికి బోధగావిస్తున్నానని ఆనందమే. దైవత్వమునకు యెట్టి బాధలు ఉండవు. ఎట్టి విచారములు ఉండవు. ఎట్టి కష్టములు కలుగవు.

ఈ హిరణ్యస్వరూపం కేవలం యీ దేహంలో మాత్రమే కాక ప్రతి ఒక్కరి హృదయమందు ఉన్నది. కుడి భాగమునందున్నది. అయితే యిది దేహమంతా వ్యాపించి ఉంది. నేను సంకల్పించి నప్పుడు ఒక స్వరూపాన్ని ధరిస్తుంది. ఇది ఆవిర్భావమయ్యే సమయంలో ఎవరు చూస్తారో వారికి యిక జన్మ లేదు. వచ్చే సమయంలో దీని ఆకారం చూడాలి. మీ జీవితాలను పావనం గావించే నిమిత్తమై యిలాంటి పవిత్రమైన దర్శనములను నేను అప్పుడప్పుడు అనుగ్రహించవలసి వస్తుంది. దీనివల్ల మానవత్వంలోని దివ్యత్వం మీకర్థకమౌతుంది. ఈ హిరణ్యగర్భలింగం ఎక్కడ వేసినా పగిలేది కాదు. ఏవిధంగానూ మారదు. సామాన్యమైన బంగారమైతే కిందికి విసరి కొడితే ముక్కలౌతుందిగానీ యిది ఎక్కడ కొట్టినా పగలదు. ఇదే అమృతత్వము. ఇలాంటి దివ్యత్వము జగత్తులో ఎక్కడా కానరాదు. ఇది ఒక్క దైవందగ్గరే నిరూపణ అవుతుంది. ఒక్క దైవత్వము దగ్గర తప్ప యింకెక్కడా యీ ఆనందము ప్రాప్తించదని మీరు తెలుసు కోవాలి. ఏదో నేను మీవలె నడుస్తున్నాను, మాట్లాడుతున్నాను, నవ్వుతున్నాను, తింటున్నాను, తిరుగుతున్నాను అని యీ దేహాన్ని మాత్రమే ఆధారం చేసుకోకండి. నేను ఏది చెప్పినా నిస్వార్థమే. ఒక వెంట్రుక మందమైనా నాలో స్వార్థము లేదు. అంతా పరార్థమే. పరార్థమే. ఈ సత్యాన్ని మీరు ధృఢంగా విశ్వసించండి.

ఏదో ఒక రకమైన ఆవేదనతో ఇక్కడకు రావలయుననే ఉత్సాహముతో మీరందరూ, యిటువంటి సన్నివేశమందు, యిటువంటి సమావేశములో, యిటువంటి సన్నిధిలో హాజరగుటకు చాలా పుణ్యశాలులే! ఇన్ని కోట్ల జీవరాసులలో మీరుమాత్రం రాగలిగినారంటే, లింగోద్భవము చూడగలిగినారంటే మీ జన్మలు సార్థకమైనవనుటకు సందేహము లేదు. మీరింతవరకు ఎన్నెన్నో మహా పవిత్రమైన, వేదవిహితమైన కర్మలందు పాల్గొని ఉండవచ్చు. అయితే వేదోపనిషత్తులలో కపిలదేవుడు ప్రబోధించిన కాలదేశాత్మకమైన,

దశాంగుళ స్వరూపమైన, మండలాకారమైన లింగము, లింగస్వరూపునియందు ఉద్భవించిన మహా ముహూర్తమును తిలకించి తరించే పుణ్యము మీకు మాత్రమే లభించింది.

అవతార సమయములో దేవతలనందరిని 'రండి రండి పవిత్ర దర్శనము చేసుకోండి' అని కపిలదేవుని తల్లి కేకలేసింది. కాబట్టి ఆమెకు "దేవహూతి" అని పేరు వచ్చింది. ఇట్టి పవిత్ర దర్శనము మీకు లభించుట వలన మీ జన్మకు సార్థకత చేకూరినది. తిరిగి జగత్సంబంధమైన జనన మరణములు మీకు లేవు. దాన్ని గురించి మీరు చింతించనక్కర లేదు.

మీరందరూ ఈ దివ్యసృష్టిని తిలకించి ఆనందించిరి. ఈ దివ్యస్వరూపమును దర్శించిరి. ఈ ప్రాప్తిని పురస్కరించుకొని పదార్థములో అంతర్గతమైన పరార్థమును స్మరించుకొని, ఈ ప్రకాశమును ధ్యానించుకొని, పవిత్ర కాయాలతో, పవిత్ర తలంపులతో, పవిత్ర వాక్కులతో యికపై నిత్య జీవితమును పవిత్రము గావించండి. క్షణక్షణమూ మీకుమీరే హెచ్చరించుకుంటూపొండి. అదే మీ బాధ్యత.

## 7

## సాక్షీభూతుడు

**పొగకు మూలము నిప్పుల పుంజముండ**
**రైలుబండిని నడిపించు డ్రైవరుండ**
**ఆటొమేటిక్ లైటుకు అవధులుండ**
**ఒకడు ప్రకృతిని సృష్టింప నుండవలదె?**

సమస్త శక్తులన్నీ మూడు కర్మలపైన ఆధారపడి ఉంటున్నాయి. అవే సృష్టి, స్థితి, లయములు. ఈ మూడింటి ఆధారముచేతనే యీ జగత్తు నడవ గలుగుతున్నాది. ఈ కర్మలు ఆధారముగా ఉండినప్పుడు కర్మకు ఒక కర్త ఉండాలికదా. కర్తలేని కర్మ జగత్తులో కానరాదు. కనుక కర్త, కర్మ యీరెండింటి అనుబంధము మన ఫలితమునకు మూలకారణము. కర్త ఎవరు, కర్మ ఏమిటి, ఫలము ఏమిటి అనే మూడు విషయాలను చక్కగా మనము గుర్తించినప్పుడే సృష్టియొక్క రహస్యము మనకు అర్థమవుతుంది. భగవంతుని లీలలు విమర్శించటము సులభము కానీ అవగాహన చేసుకోటం అత్యంత కష్టము. కనుక మనము అవగాహన చేసుకొనే విషయములో మన జీవితమును అంకితము గావించాలి.

ఇందులో మొట్టమొదటిది సృష్టి. మానవత్వములో కొన్నివిధములైన నిబంధనలుంటున్నవి. ఒక వంతెన కట్టవలెనన్న దీనికి అనేకమంది ఆధారమై ఉంటున్నారు. ఒక ఛీఫ్ ఇంజనీరు, ఒక అసిస్టెంటు ఇంజనీరు, ఒక జూనియర్ ఇంజనీరు, ఒక సూపరువైజరు ఉంటుండాలి. ఇంకా యితరులు కూడా ఉండాలి. ఇంతమంది చేరినప్పుడే ఈ వంతెన మనం నిర్మించటానికి వీలవుతుంది. కనుక ఈ జగత్ సృష్టికి మూడు ఆధారములుగానున్న సృష్టి, రక్షణ, లయము యీ మూడింటికి మూడు ప్రధానులుంటున్నారు. ఒకచిన్న రాష్ట్రమును పాలించవలెనన్న ఎన్నియో డిపార్టుమెంటులంతా ఉంటాయి. చాలామంది మినిష్టర్సు నియమింపబడతారు. ఒకచిన్నరాష్ట్రమును పాలించవలెనంటే యింతమంది పరిపాలకులుండినప్పుడు యింత విశాలమైన సృష్టిని పాలించవలెనంటె కొంతమంది ఆధారకులుండవలెను కదా! సమస్త పదార్థములను, సమస్తజీవులను సమస్త నియమములను పాటింపచేసేది యీ సృష్టియొక్క ఘనత. ఈ డిపార్టుమెంటుకు

ఒకరిని నియమించింది దైవత్వము. అతని పేరే బ్రహ్మ. ఈ సృష్టి పరిపాలన అతని అధీనములో ఉంటున్నాది. పోషకత్వము కావాలి. ఉత్పత్తిగావించినంత మాత్రమున దీనికి భద్రత ఉండదు. పోషించే అధికారి కూడా ఉండాలి. అతనే విష్ణువు అన్నారు. ఐతే యీ పోషకత్వము జరిగిన తరువాత భిన్నమయ్యే పరిస్థితి కలగదు. సృష్టి జరిగిన తరువాత అంత్యమయ్యేది ఉంటుంది. ఈ అంత్యము యొక్క విషయములను గురించి సరైన నియమములను పాటించి వారి యొక్క శక్తి సామర్థ్యములను పురస్కరించుకొని దానిని లయముగావించుకునే శక్తి ఒకటి ఉంటున్నాది. అదియే ఈశ్వరత్వము. ఈ సృష్టిస్థితిలయములందు భాగము వహించి, బాధ్యత వహించి, అధికారమును వహించి జగత్తును పరిపాలించే శక్తులు యీ మూడు. ఒక్కొక్కరికి ఒక్కొక్క డిపార్టుమెంటు అందించారు. ఐతే యీ మూడు డిపార్టుమెంట్సుకు ఒకడు అధిపతి ఉంటుండాలి. ఈ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కేవలం పాలకులు మాత్రమే. వీరందరిపై అధికారాధిపత్యము వహించినవాడు దేవుడు. అతనినే భారతీయులు భగవంతుడని పిలుస్తూవచ్చారు. అనేక మతములవారు అనేక పేర్లతో పలుకుతూ వచ్చారు. ఈనాడు జగత్తులో గాడ్ అని ఉపయోగపెడుతుంటాం. ఈమూడు ఆధిపత్యములు తన హస్తమునందుంచుకున్నవాడు భగవంతుడు. గాడ్ అనే పదమునకు మూడు అక్షరములుంటున్నాయి. జి ఒ డి. జి జనరేటర్, ఒ ఆర్గనైజర్, డి డిస్ట్రక్టర్. ఈ మూడింటి సమ్మిళితమైన స్వరూపమే గాడ్. బ్రహ్మ దైవము, విష్ణువు దైవము, శివుడు దైవమని అనుకుంటున్నాము. కాదు. వీరు ఒక్కొక్కరు ఒక్కొక్క డిపార్టుమెంటుకు మాత్రమే అధిపతులు. అందరిపైన ఆధిపత్యము కల్గినవాడు దైవము. ఇతనే సాక్షీభూతుడు. లైట్లు వెలుగుతున్నాయి. కొంతమంది వింటున్నారు. కొంతమంది నిద్రిస్తున్నారు. కొంతమంది వెడుతున్నారు. కొంతమంది వస్తున్నారు. కొంతమంది ఎక్కడనో చూస్తున్నారు. ఎన్నిపనులు చేస్తున్నప్పటికినీ పనులకు లైటుకు సంబంధము లేదు. లైటు సాక్షీభూతము. అదేవిధముగా సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. సూర్యప్రకాశమునాధారము చేసుకొని అనేకమంది అనేక పనులు చేస్తున్నారు. మంచిపనులతో సూర్యునికి యేమీ ప్రకాశము అధికము కాలేదు. చెడ్డపనులతో సూర్యునికి యేమాత్రము అంధకారము ప్రవేశించలేదు. ఎవరి నమ్మకము వారిదే. ఐతే తాను సాక్షీభూతుడుగా అందరికీ వెలుగునందిస్తున్నాడు. సూర్యుడే లేకపోతే ఎవరి పనులు వారు చేయలేరు. కాబట్టి పనులు చేయించే నిమిత్తమై సాక్షీభూతుడై ఉన్నాడుగానీ ఫలనిమిత్తమై తాను సాక్షీభూతుడు కాదు. ఫలమును మాత్రము మనకు మనమే అనుభవించాలి. ఈ ఫలమును అనుభవించే నిమిత్తమై, ఈ ఫలమును తగ్గించే నిమిత్తమై, ఈ ఫలమును దుర్బలముగా మార్చేనిమిత్తమై, దుష్టఫలములను సత్ఫలములుగా మార్చే నిమిత్తమై ఈ బ్రహ్మవిష్ణుమహేశ్వరులు సరైన మార్గమును అనుసరిస్తూ ఉంటారు. వీరిని సంతృప్తి పరచాలంటే మనము యేమి చేయాలి?

**శ్రవణం కీర్తనం విష్ణుస్మరణం పాదసేవనం**
**వందనం అర్చనం దాస్యం స్నేహం ఆత్మనివేదనం**

బ్రహ్మవిష్ణుమహేశ్వరులను ప్రసన్నులనుగావించుకొనే నిమిత్తమై భగవన్నామ స్మరణ అత్యవసరము. భగవధ్యానము అత్యవసరము. భగవత్ జపము అత్యవసరము. ఇవన్నీ వారిని ప్రసన్నులనుగావించుకొనే నిమిత్తము ఏర్పడిన మార్గములే.

సృష్టికర్త అయిన బ్రహ్మ కాలకర్మకారణకర్తవ్యములను పురస్కరించుకొని ఎవరికి ఏజన్మములో చేసిన తత్ఫలితమో దానిననుసరించి వారివారి డిపార్టుమెంటు లోపల వారి వారి స్థాయికి తగినట్టుగా నడుస్తూ ఉంటాడు. వారికి తగిన ప్రమోషన్లు అందిస్తూ ఉంటాడు. ఇదే సృష్టికర్త ప్రధాన కర్తవ్యము. ఈవిధమైన కర్తవ్యములను పురస్కరించుకొని బ్రహ్మతత్వమనేది వ్యాపించి పోయింది. బ్రహ్మమనగా వ్యాపకమైనది. ఇలాంటి వ్యాపకత్వముతో కూడిన బ్రహ్మతత్వము సర్వత్రా ఉంటున్నది. విష్ణువనగా ఏమి అర్థము? అది కూడను సర్వవ్యాపకత్వమే. విష్ణుత్వము సర్వవ్యాపకత్వమే. ఎక్కడ యీ సృష్టి ఉందో అక్కడ రక్షణకూడా ఉంటున్నాది. కనుక బ్రహ్మ ఉన్నచోట విష్ణువుకూడా ఉంటాడు. ఎక్కడ రక్షణ జరిగిందో అక్కడ శిక్షణ ఉంటున్నాది. ఆ శిక్షించే విధానములో ఈశ్వరత్వము ఉంటున్నాది. కాబట్టి బ్రహ్మవిష్ణుమహేశ్వరులనగా త్రిమూర్త్యాత్మక స్వరూపములే. ఈ త్రిమూర్త్యాత్మకమైన దైవత్వము ఏకత్వమైన దైవత్వమే. ఈ ముగ్గురూ తమతమ డిపార్టుమెంట్సునందున్న దోషములను, మంచిని సరైనరీతిలో ఉంచి భగవంతునికి అందించే విధానము. ఆ దైవత్వము ఎక్కడ ఉంటున్నాది? 'సర్వతః పాణిపాదం తత్సర్వతో క్షి శిరోముఖం..' ఎక్కడచూచినా యీ దైవత్వముంటున్నాది. కానీ ఇట్టిరహస్యమును మనము గుర్తించుకొనలేక దైవమును అనేకవిధములుగా ప్రార్థిస్తుంటాము. ఇవి దైవప్రార్థనలు కాదు. ఇది పరిపాలకులను ప్రార్థించే విధానమే. ఈ పరిపాలకులు దీని స్థితిగతులను పురస్కరించుకొని దైవమునకు రికమెండ్ చేస్తారు. దైవము నిరంతరము సాక్షీభూతుడు. అతనికి ఒక్కగుణమూ లేదు. ఒక రూపము లేదు. ఏరూపమునైనా ధరించవచ్చు. కానీ గుణరహితుడైన భగవంతుడు గుణములందుకూడా ఉంటున్నాడు. కుండ మట్టిలో పుట్టింది. మట్టికి ఆకారము లేదు. కానీ మట్టితో చేరిన కుండకు

ఆకారముంటున్నాది. మట్టిలో కుండ లేదు. కానీ కుండయందు మట్టి ఉంది. కాబట్టి దైవత్వము సర్వత్రా ఉంటున్నది. ఆకారము, నిరాకారమునందు కూడా ఉంటున్నాది. గుణము, నిర్గుణమునందు కూడా ఉంటున్నాది. దైవము ఏవిధముగా మీతో వస్తున్నది? చిత్తము. చిత్తమనేదే చిత్రగుప్తుడు అన్నారు. అనగా మనలో గుప్తముగానున్న చిత్తమునే చిత్రగుప్తుడు అన్నారు. మనము చేసిన మంచి చెడ్డలన్నీ ఆ చిత్తములో హత్తుకొనిపోతాయి. ఆ హత్తుకొన్న విషయములకు రూపనామములందిస్తూ తద్వారా ఫలితమును చేకూరుస్తున్నాడు.

ఈవిధమైన ధర్మమును పరిపాలన చేస్తూరావటంచేత భగవంతుని ధర్మస్వరూపుడు అన్నారు. సాక్షిస్వరూపుడు అన్నారు. అయితే యిక్కడ చిన్న రహస్యాన్ని గుర్తించాలి. సృష్టికి సంబంధించిన విషయములో బ్రహ్మతో కొంతవరకు సంబంధబాంధవ్యము కలిగించుకోవాలి. రక్షణనిమిత్తమై విష్ణువుతో మనము సంబంధము కలిగించుకోవాలి. లయము నిమిత్తమై మనము శివునితో సంబంధము కలిగించుకోవాలి. ఐతే మన హృదయము దైవభావముతో సంపూర్ణముగా, పరిపూర్ణముగా, పరిపూర్ణమైన స్థితిలోపల నేరుగా దైవముతోనే సంబంధబాంధవ్యము కల్పించుకోవాలి. దీనికి ఒకవిధమైన అధికారము ఉంటున్నాది. ఈ అధికారము మనకు ఎట్లా వస్తుంది? శరణాగతి. ఆ శరణాగతి తత్వమే డైరక్టు హార్టు టు హార్టు, లవ్ టు లవ్. దైవరహస్యములు చాలా చిత్రవిచిత్రములు. సామాన్యులకు అర్థముకాదు. ఎందుకు స్వామి యిట్లా చేస్తున్నాడు, ఎందుకు భగవంతుడు యీవిధమైన బాధలకు గురిచేస్తున్నాడు అని యీరకంగా మనం మాట్లాడుకుంటాం. భగవత్తత్వము ఎవరికి ఏవిధంగా ఉండాలనేది వారి శాసనములోనే ఉంటుంది. ఈ శాసనమునకు విరుద్ధముగా పోకూడదు. నిత్యజీవితములో ఒక ఉదాహరణ. పోలీసు డిపార్టుమెంటు ట్రాఫిక్‌నియమాన్ని ఒక శాసనముగా తీసుకుంటారు. ఒక సర్కిల్‌లో కీప్ లెఫ్ట్ అని వ్రాసి ఉంటారు. ఇది పోలీసువారు నియమించినదే. పోలీసు అధికారి నేను హెడ్డ్‌కదాయని తాను రైట్ పోవటానికి వీలులేదు. తానూ లెఫ్ట్‌లోనే పోవాలి. అదే విధముగా భగవంతుడు నియమించిన దానిలో తానూ ఆ మార్గములోనే పోవాలి. కొన్నికొన్ని సందర్భములందు భగవంతుడు శాంతము వహించి ప్రసన్నుడై కాలకర్మకారణము కలసి వచ్చేంతవరకు వేచి ఉంటాడు. అంతమాత్రముచేత భగవంతునికి శక్తిలేదని మనం భావించరాదు. అంతమాత్రముచేత భగవంతుడు చేయలేకపోయాడని భావించరాదు. భగవంతుడు ఏమైనా చేయవచ్చును. ఏమైనాచేయవచ్చని అన్నీ చేయటానికి వీలుకాదు. నియమానుసారంగా ఉండాలి. తానుచేసి యితరులకు ఆదర్శమునందించాలి. కనుక భగవంతుడు ఎలాంటివాడంటే ఇంగ్లీషు టీచరువలె లెక్చరుచెప్పి పాఠము బోధించేవాడు కాదు. లెక్కలు బోర్డుపై వ్రాసి చేయండని చెప్పేవాడు కాదు. ఫిజిక్సు, కెమిస్ట్రీ టీచరువలె లేబ్‌లో ఎక్సపరిమెంట్సు చేయండని చెప్పేవాడు కాదు. భగవంతుడు డ్రిల్లు టీచరువలె తాను చేసి చూపిస్తూ ఉంటాడు. కనుకనే మై లైఫ్ యీజ్ మై మెసేజ్. చేసి చూపించేవాడు భగవంతుడు. కానీ యీనాడు యిట్టి దైవత్వమును అనేక అపోహలచేత, భ్రాంతులచేత, భ్రమలచేత దివ్యత్వమునకు కళంకము జరిగేవిధముగా కొంతమంది కొన్ని ప్రబోధలు సల్పుతూ ఉంటారు. భగవంతుడు నిన్ను శిక్షిస్తాడా? భగవంతుడు నిన్ను హింసిస్తాడా? ఇది భగవంతుని పని కాదు. శిక్షించేది భగవంతుని లక్షణము కాదు. హింసించేది భగవంతుని లక్షణము కాదు. శిక్ష, హింస నీ కర్మలయొక్క ఫలితమే. నీవు చేసే దానికి నీవే కర్త. తాను కర్మల ఫలితమునందించే భోక్త. కనుక కర్మఫలమునందించే వానికి ఏవిధమైన సంబంధము ఉండదు. పోస్టుమేన్ ఉంటాడు. అతను ఒక జాబును తెచ్చి ఒక యింటిలో యిస్తాడు. ఇంకొక జాబు యింకొక యింటిలో యిస్తాడు. మొదటి యింటిలోనివారు ఘొల్లున ఏడుస్తారు. రెండవ యింటిలోనివారు ఫక్కున నవ్వుతారు. ఏడ్వటానికి, నవ్వటానికి పోస్టుమేన్ కారణమా? కాదు కవరులోని మేటరు దుఃఖానికి, ఆనందానికి కారణము. వాని ఎడ్రస్సుతో వచ్చిన దానిని వానికి యిచ్చాడు. ఈ ఎడ్రస్సుతో వచ్చిన జాబు యీ యింటిలో యిచ్చాడు. జాబులలోని విషయముల ఫలితములేగానీ పోస్టుమేన్ కారణము కాదు. అదేవిధముగా భగవంతుడు సాక్షీభూతుడు. ఎవరి ఫలితములు వారికి అందిస్తాడు. ఒకవేళ అది బాధాకరమైనప్పుడు ఆ భగవంతుని ప్రసన్నుని గావించుకునే రీతిగా మనము ప్రార్థించినప్పుడు తానే ఆ డిపార్టుమెంటుతో చెప్పి క్యాన్సిల్ చేయిస్తాడు. ఆ స్వాతంత్ర్యము భగవంతునికి ఉంటున్నాది. సృష్టిస్థితిలయములు బ్రహ్మవిష్ణుమహేశ్వరులని. నాల్గవది ఒకటి ఉంటున్నాది. తిలోదాయకమన్నారు. అనగా యీ మూడింటిపైనా అధిపతిగా ఉంటాడు. అతనే దైవము. ఈ మూడింటిని క్యాన్సిల్ చేయవచ్చును. ఏవిధంగా? రూపం మార్పు చేయటంకాదు. ఒక చిన్న ఉదాహరణ. చిన్న బాటిల్ లోపల మందు ఉంది. దీనికి 1932 అని వేసి ఉంటారు. ఆ బాటిల్ మన యింటిలోపల 1945 వరకు ఉంది. చూస్తే మందు ఉంటున్నాది దానిలో కానీ ఎక్స్‌పైర్ అయిపోయింది. అనగా ఆ మందు పనిచేయకుండా పోయింది. అదేవిధముగా భగవంతుడు నీ కర్మలుండినప్పటికి పవర్‌ను ఎక్స్‌పైర్ చేసే అధికారము ఉంటున్నాది. ఎలాంటి దాన్నైనా ఎక్స్‌పైర్ చేయగలడు. అదే దైవత్వముయొక్క దివ్యత్వము. లేనిదానిని సృష్టించవచ్చు. సృష్టించిన దానిని పోషించవచ్చు. పోషించినదానిని లయము గావింప వచ్చును. ఈ మూడింటి అధికారము గాడ్‌కి ఉంటున్నాది. ఇలాంటి దైవత్వమును మనం పొందే నిమిత్తమై శరణాగతి

చేయాలి. శరణాగతి అయినప్పుడే దైవత్వమునకు డైరక్టుగా సంబంధము ఏర్పడుతుంది.

ఈ శరణాగతి కాకుండా ఉండినంతవరకు యీ డిపార్టుమెంట్సుకి పోయిన కాలము వ్యర్థమైపోతుంది. కాలము వ్యర్థము చేయటం మంచిది కాదు. కాలము భగవత్స్వరూపము. కాలమే దైవస్వరూపము. కాలము కాయమును మింగుతుందన్నారు కానీ కాలమునే మింగేవాడు భగవంతుడు. అట్టి భగవంతునికి మనం శరణాగతి కావాలి. ఈ శరణాగతి అయినప్పుడు సమయసందర్భానుసారంగా స్థానబలముచేత, పదవీబలముచేత దురవస్థలకు గురౌతాడు. చిన్న ఉదాహరణ. రామలక్ష్మణులు సీతాన్వేణ నిమిత్తమై దండకారణ్యములో ప్రయాణమై పోతున్నారు. అలసి పోయారు. చెట్టు క్రింద కూర్చున్నారు. లక్ష్మణుడు లేచి, 'అన్నా! నేను యీ అవస్థలకు గురికాను. నేను ఈ బాధలను సహించలేను. కాలమునకు భోజనముగానీ, నీరుగానీ చిక్కటంలేదు. ఆహారపానీయములు లేకుండా నా శరీరమును క్రుంగచేసుకుంటున్నాను. నేను అయోధ్యకు వెడతాను. ఒక్క క్షణమైనా నేను యిక్కడ ఉండను' అని చెప్పాడు. ఈ దుర్భావములు అతనిలో ఆవిర్భవిస్తూ వచ్చాయి. రాముడు నవ్వాడు. 'సోదరా మనం వెడదాము. తరువాత మాట్లాడుదాము' అని చెప్పాడు. పూర్వము రాముడే నా తల్లి, రాముడే నా తండ్రి, రామ సన్నిధే నా పెన్నిధి, అయోధ్యలో నేనుండలేను, తల్లిదండ్రులనైనా త్యజించి రాములను త్యజించకుండా ఉండలేను అన్నటువంటి లక్ష్మణునికి యీ దుర్బుద్ధి పుట్టటానికి కాణం ఏమిటి? కేవలం దేహభ్రాంతి కల్గటానికి కారణం ఏమిటి? దేహాభిమానం అభివృద్ధిచేసుకోటానికి కారణం ఏమిటి? కొంచెం దూరం వెళ్ళి చెట్టు క్రింద కూర్చున్నారు. తక్షణమే అతనికి పశ్చాత్తాపం వచ్చింది. లేచాడు. రాముని కాళ్ళు గట్టిగా పట్టుకున్నాడు. 'అన్నా! నేనన్న మాటలకు క్షమించు. ఎందుకీ దుర్బుద్ధి ప్రవేసించిందో తెలియటంలేదు. కారణం ఏమిటి' అని ప్రశ్నించేటప్పటికి రాముడు చెప్పాడు. 'లక్ష్మణా! ఆ ప్రదేశమంతయూ శూర్పణఖ సంచారముచేసిన ప్రదేశము. వృక్షముక్రింద శూర్పణఖ విశ్రాంతి తీసుకొనే స్థానము. ఆ దుర్గుణములు ఆ వాతావరణములో కలసిపోయినాయి. ప్రతి శబ్దము విద్యుత్ వైబ్రేషన్‌గా నిల్చిపోయి ఉంటుంది. ఆ ప్రభావము నీలో ప్రవేశించి యిలాంటి దుర్భావము పుట్టింది. ఈ స్థానము వదలినంతనే సద్భావం వచ్చింది. అదేవిధముగా కొన్నికొన్ని స్థానములందు, కొన్నికొన్ని సమయములందు మనం జాగ్రత్తగా ఉంటుండాలి. దుస్సంగముతో మనం దూరంగా ఉండాలి. దుర్బుద్ధులు సంచరించే ప్రదేశమునుండి మనం దూరంగా ఉండాలి. సత్సంగము చాలా అవసరం. మంచివారితో మనం స్నేహం చేయాలి. మంచివారితో మనం సంబంధము ఏర్పరుచుకోవాలి. మన ప్రవర్తన సక్రమమైన రీతిగా మనం తీర్చి దిద్దుకొన్నప్పుడు దైవానుగ్రహము మనకు వచ్చి చేరిపోతుంది. దైవము ఎక్కడ ఉన్నాడని అనుకుంటాం. ఈ త్రిమూర్త్యాత్మకమైన దైవము అణుస్వరూపమై సర్వత్ర వ్యాపించి ఉంటున్నాడు.

విశ్వమనగా ఏమిటి? విశ్వస్వరూపము ఏమిటి? సూర్యచంద్రాదులు, గ్రహములు, నక్షత్రములు యిత్యాది వాటితో కూడినదే విశ్వము. ఈ విశ్వమునకు మధ్యలోనుండిన శూన్యత్వమునకే విశ్వరూపమని అన్నారు. అక్కడే పాలపుంత, గ్యాలాక్సీలు ఉంటున్నాయి. ఈనాటి వైజ్ఞానికులు అనేక పరిశోధనలుచేసి పదార్థము, శక్తి అని నిర్ణయిస్తూవచ్చారు. కానీ నాదృష్టిలో పదార్థమనేది యీ జగత్తులో లేదు. అంతా శక్తిమయమే. ఈ శక్తియే ఒక్క క్షణములో పదార్థముగా మారుతుంది. మరొక క్షణములో యిదే శక్తిగా రూపొందుతుంది. ఈ శక్తి పూర్వముండిన పదార్థమునే పూర్తి నాశనము గావిస్తుంది. కొత్త పదార్థమును సృష్టిస్తుంది. కొండలు శిలామయముకాదు. అడవులు కాష్ఠమయము కాదు. భూమి మృణ్మయము కాదు. దేహము మాంసమయము కాదు. అంతా అణుమయమైన శక్తియే. ఈ అణుశక్తియే ఘనముగా మారుతున్నాది. దీనినే వేదాంత పరిభాషయందు అణోరణీయాన్ మహతో మహీయాన్ అన్నారు. అయితే యీ విశ్వము ఎప్పుడు పుట్టింది? చక్కగా విచారణచేస్తే వేయికోట్ల సంవత్సరములకు పూర్వమే యీ విశ్వము పుట్టింది. మొట్టమొదట అంతా చీకటి. అంధకారమే. భూమి లేదు. అంతా మేఘములతో నిండి ఉంటున్నాది. తదుపరి కొన్ని కోట్ల సంవత్సరములు నిరంతరము వర్షము కురిసింది. వర్షము కురిసిన తరువాత ఎత్తుపల్లములతో భూమి యేర్పడింది. సూర్యునివలె భూమి కూడా చాలా వేడి వాతావరణముతో ఉండేది. ఈ వేడి చల్లారటానికి కొన్ని కోట్ల సంవత్సరములు పట్టింది. క్రమక్రమేణా చల్లబడిన తరువాత దాని ఉపరి భాగము కఠిన పదార్థముగా మారుతూ వచ్చింది. అప్పటినుండి భూమిపై సృష్టి ప్రారంభమైంది. భూమి యేర్పడి 450 కోట్ల సంవత్సరములు పైబడింది. ఈ జీవరాసులు పుట్టటము కొన్ని లక్షల సంవత్సరములైంది.

వైజ్ఞానులు యీనాడు సృష్టిని గురించి అనేకవిధములుగా నిర్ణయిస్తున్నారు. ఆధ్యాత్మికశాస్త్రము పరిపరి విధములుగా యీ సృష్టిని గురించి ప్రబోధిస్తున్నది. ఎవరెన్ని బోధించినా మనకు గోచరమయ్యేది అణువు. ఈ అణువు లేక విశ్వము లేదు. శిలామయమైన పర్వతములు, కాష్టమయమైన అడవులు, జలమయమైన సముద్రము, మృణ్మయమైన భూమి, మాంసమయమైన దేహము అన్నీ అణువులయొక్క చేరికయే. అణువు లేక పదార్థము గోచరము కాదు. త్రాగే నీరు, తినే తిండి, చూచే చూపు, నడచే నడక అన్నీ

అణువులయొక్క చేరికయే. ఈ పరమాణువుల తత్వాన్ని మనము విచారణ చక్కగా చేసినప్పుడు ఈ పరమాణువులయొక్క స్వరూపమే యీ ప్రపంచము. 'అణోరణీయాన్ మహతోమహీయాన్' అణువులో అణువుగనూ ఘనములో ఘనముగనూ ఉన్నది. అణువు అనగా ఏమిటి? అణువు అనగా కేవలము కంటికి కనిపించని పదార్థమని భావిస్తున్నారు. అది చాలా పొరపాటు. అణువనగా రాశీభూతమైన కణస్వరూపము. ఈ కణస్వరూపము కంటికి కానరాదు. ఈ కణముయొక్క స్వరూపమే దైవమని భావిస్తూవచ్చారు పూర్వపు ఋషులు.

ఈ అణుతత్వము గుర్తించాలని వైజ్ఞానికులు వేయి సంవత్సరములు పరిశోధనలు సల్పుతూ వచ్చారు. కానీ బాలుడైన ప్రహ్లాదుడు ఈ అణుస్వరూపమే దైవమని గుర్తిస్తూ ప్రబోధిస్తూ వచ్చాడు.

**ఇందుగలడందు లేడని సందేహము**
**వలదు చక్రి సర్వోపగతుండు**
**ఎందెందు వెదకి చూచిన**
**అందందే గలడు**

యంత్రశక్తి కంటె మంత్రశక్తి చాలా ఉత్తమమైనది, చాలా విలువైనది, చాలా శక్తివంతమైనది అనే సత్యము యీనాడు యువకులు గుర్తించాలి. ప్రణవములో శక్తి, శివ అనే తత్వములు యిమిడి ఉంటున్నాయి. ఈ శక్తికి, శివత్వమునకు శాస్త్రజ్ఞులు ఎలక్ట్రాన్, ప్రోటాన్ అని పేర్లు పెట్టారు. ఈ ఎలక్ట్రాన్, ప్రోటాన్ అనేవి శివశక్తి మయములని బోధపడుతున్నది. ప్రోటాన్లు అనే పరమాణువులు అణువులో కేంద్రముగా ఉంటున్నాయి. కానీ ఈ కేంద్రము చుట్టూతిరుగుతూ ఉంటున్నవి. దీనినే వేదము శివ, శక్తి అని వివరిస్తూ రెండింటికి భేదము లేదని చెబుతూ వచ్చింది. ఎలక్ట్రానుకు ప్రోటాను ఆత్మవంటిదన్నారు. ఈ ఎలక్ట్రాను, ప్రోటాను పుట్టక పూర్వమే న్యూట్రాను ఉంది. దీనినే వేదము సత్ అని చెబుతూ వచ్చింది. సత్ అనగా ఏమిటి? సత్ అనగా ప్రకాశవంతమైనదని భావిస్తున్నారు. కాదు. చీకటి. ఈ చీకటి నుండే వెలుగు పుడుతూ వచ్చింది. అశాంతిలోని ప్రశాంతి, ప్రశాంతిలోని ప్రకాంతి, ప్రకాంతిలోని పరంజ్యోతి, పరంజ్యోతియే పరమాత్మ స్వరూపము. అశాంతి అనే చీకటినుండే ప్రశాంతి అనే వెలుగు ఆవిర్భవిస్తూ వచ్చింది. దీనినే సమహ అన్నారు. అమృతము అని ఒక అర్థము, రెండవది గర్భము అని. ఈ గర్భమును స్పేస్ అని పిలుస్తూ వచ్చారు శాస్త్రజ్ఞులు. ఇక రెండవది మహ. ఈ పదమునకు విషము, కాలము అని రెండర్థములు. సమహ అనేది స్పేస్ అండ్ టైమ్ వంటిది. ఈ రెండింటియొక్క జీవితమే మానవత్వమని నిరూపిస్తూ వచ్చింది. ఈ మానవత్వము ఏరీతిగా జన్మిస్తూ వచ్చింది? మొట్టమొదట గర్భము స్పేస్. ఇందులో ఏడవ దినము బుద్బుదముగా రూపొందుతుంది. పదహేనవ దినము పిండముగా రూపొందుతుంది. ముప్పైవదినము కఠినముగా మారిపోతుంది. అరవైవ దినము శిరస్సు ప్రారంభమవుతుంది. రెండువందలపదవ దినము ప్రాణము ప్రవేశిస్తుంది. రెండువందలనలభైవ దినము రూపము పూర్తి వస్తుంది. రెండువందలడెబ్బైవ దినము ప్రపంచములో ప్రవేశిస్తుంది. మానవ జన్మకు స్పేస్, టైమ్ అత్యవసరమని నిరూపిస్తుంది వేదము. వేదప్రమాణమునకు, విజ్ఞానప్రమాణమునకు అనేకవిధములైన భేదములు కల్పించినట్టుగా ఉంటుందిగానీ భేదములే లేవు. విజ్ఞానము గుర్తించని విషయములు వేదము గుర్తిస్తూ వచ్చింది. వేదము గుర్తించనిది విజ్ఞానము యీనాటి వరకు ఏదీ గుర్తించలేదు. ఈనాడు గుర్తించినది చాలా తక్కువ.

కనుక ఈశ్వరత్వమునకున్న దివ్యశక్తి మానవత్వములో ఎంతవరకు ఉన్నదనేదాన్ని విచారించాలి. జీవుడు దేవుడు వేరు కాదు. అయితే జీవుడు దేహాభిమానియై అనేకవిధములుగా దేహముతో కట్టబడి యీ ప్రాకృతమైన జీవితాన్ని గడుపుతున్నాడు. ఏనాడు ఈ జీవుడు ఆత్మాభిమానమును పెంచుకొనునో ఆనాడే జీవత్వము శివత్వము రెండింటి ఏకత్వము గుర్తించినవాడౌతాడు. ప్రపంచములో వెలుపల ఏమాత్రము, ఏచిన్నవిషయము లేదు. ఏచిన్న వస్తువు లేదు. అంతా అంతర్భాగమందే ఉంటున్నాది. మనము చూస్తున్న ప్రతి ఒక్కటి లోపలిదేకానీ బయటది కాదు. ఈ సత్యాన్ని మానవుడు చక్కగా గుర్తించాలి. కనిపించే యిన్ని శిరస్సులంతా మనలోనున్నవేగానీ బయట ఉన్నవి కాదు. రిఫ్లక్షన్ ఆఫ్ ది ఇన్నర్ బీయింగ్. ఏ పదార్థమైనా యిది నాకు కావాలని అనుకుంటావు. కానీ అది నీయందే ఉన్నదనే సత్యము గుర్తించుకోలేక అజ్ఞానముచేత ఆ వస్తువు కావాలని ఆశిస్తున్నావు. ఏవిధంగా? ప్రతి వస్తువు లోపలినుండి వెలుపలకు వచ్చి వెలుపలనుండి లోపలకు పోతున్నది. దీనికి ఒక చిన్న ఉదాహరణ. వర్షము కురుస్తున్నాది. వేలాది నదులు సముద్రములో ప్రవేశిస్తున్నాయి. ఈ వేలాది నదులు సముద్రములో ప్రవేశించి నప్పటికి సముద్రము పెరగటం లేదు. కారణము ఏమిటి? ఈనాడు చేరిన వేలాది నదులన్నీ ఏనాడో ఈ సముద్రమునుండి బయటకు పోయినాయి. మేఘరూపములో బయటకుపోయి కొంతకాలము బయట సంచరించి తిరిగి సముద్రములోనే ప్రవేశిస్తున్నాయి. ఈనాడు సముద్రములో చేరేవన్నీ ఏనాడో ఒకనాడు సముద్రమునుండి

వెలుపలకు పోయినవే. మనకు యీనాడు  కనిపించనివి మననుండి ఏనాడో బయటకు పోయినవే. విషయములుగానీ, వ్యక్తులుగానీ, పదార్థములుగానీ యివన్నీ మననుండి వెలుపలికి పోయినవే. తిరిగి మనలోవచ్చి చేరిపోతున్నాయి. సముద్రమునుండి బయటకుపోయిన జలము, సముద్రముయొక్క రూపము, రుచి మారిపోతున్నవి. కానీ వెలుపలికి పోయిన తరువాత పవిత్రమై, మధురమై తిరిగి సముద్రములో ప్రవేశిస్తున్నది. ఎంత సంస్కారము పొందింది. ఆవిరిగా మారి మేఘములుగా రూపొంది వర్షముగా కురిసి వంకలుగా ప్రవహించి నదులుగా ప్రవహిస్తున్నాయి. ఆవిరిగా మారటమే సత్యము. మేఘములుగా నిలవటమే ధర్మము. వర్షబిందువులుగా రూపొందటమే ప్రేమ. ఆ ప్రేమబిందువుల ఏకత్వమే  ఆనందమనే ప్రవాహము. ఈ ఆనందమనే ప్రవాహము తిరిగి అనుగ్రహమనే సముద్రములో లీనమైపోతుంది. ఏనాటికైనా తిరిగి గమ్యములో చేరక తప్పదు. కనుక మానవుడుగా పుట్టి, జీవుడుగా జీవించి, మాధవునిగా రూపొంది తిరిగి దివ్యత్వములో లీనమైపోతుంది. దైవము రూపరహితుడుకదా. ఏరూపు మనము  వర్ణించేదని కొన్నిరకములైన శాస్త్రములు తర్కిస్తూ వచ్చాయి. రూపరహితమైనది జగత్తులో ఎక్కడా లేదు. చిన్న పరమాణువు కూడా రూపము ధరించింది. తెలియని మూర్ఖుడు దీనికి రూపము లేదని భావిస్తాడుగానీ ప్రతి చిన్న అణువుకు రూపముంది. రూపము లేదని చెప్పుటకు వీలుకాదు. అందువలనే ప్రాచీన మహర్షులు రూపాన్ని ఆరాధిస్తూ వచ్చారు. అన్నీ ఏక బిందువుల ఏకత్వమే రూపమని, అనేక అణువుల స్వరూపమే రూపమని ఈ అణువును ఆరాధించటంచేత ఆత్మతత్వము ఆవిర్భవిస్తుందని ఆనాటి వారి విశ్వాసము.

ప్రపంచములో ప్రతి మానవునకు సత్యము నిరూపించే విచిత్రములెన్నియో కన్నులకు కట్టినట్లున్నవి. సినిమా తెరపైన అనేక బొమ్మలను చూస్తున్నాము. తెరపైన నదులు పొంగి ప్రవహిస్తూ జలమయమైనట్లు కనిపిస్తుంది. నదులు పొంగి ప్రవహించుట మన కనులకు కనిపిస్తున్నదిగానీ ఆ జలము తెరను కించిత్తైనా తడుపుట లేదు. అదే తెరపైన అగ్నిపర్వతములు ప్రజ్వలిస్తూ కనిపిస్తుంటాయి. తెర కించిత్తైనను కాలటం లేదు. ఇన్ని బొమ్మలకు ఆధారమై, నిలయమై ప్రకటించుటకు ప్రధాన సూత్రముగానున్న తెర మంచికిగాని, చెడ్డకిగాని తనకేమాత్రం సబంధము లేనట్లుగా కనిపిస్తుంది. అదేవిధముగా మానవుని జీవితములో మంచిచెడ్డలు, సుఖదుఃఖములు, జననమరణములు, ఆనందాహ్లాదములు అనేకం వస్తూపోతూ ఉంటాయి. కానీ ఆత్మకు ఏమాత్రం సంబంధము ఉండదు. సినిమాతెర వంటిదే యీ ఆత్మ. ఇదే శివుడు. ఇదే శంకరుడు. ఇదే దైవం.

శంకరత్వమునకు సరైన అర్థము గుర్తించినప్పుడే సార్థకమైన రీతిలో దీనిని అనుభవించుటకు వీలవుతుంది. శంకరుడనగా సకలైశ్వర్య స్వరూపుడు. ఐశ్వర్యమనగా ఏమిటి? లోకరీతిగా మనము అనుభవించేవి ఐశ్వర్యములు కావు. దృశ్యకల్పితమైన, చరాచర ప్రపంచములో ఉండు ప్రతి పదార్థము ప్రతి వ్యక్తి ఐశ్వర్యముతో కూడుకొని ఉండేదే. పంచభూతములు, పంచప్రాణములు, పంచకోశములు, పంచేంద్రియములు, సర్వము ఐశ్వర్యములే. ఇంతే కాదు. చరాచర జీవరాసులన్నీకూడా ఐశ్వర్యముతో కూడుకొని ఉన్నవే. ఈ ఐశ్వర్యమే ఈశ్వరత్వము. ఏతావాతా ఈశ్వరత్వమనగా దృశ్యకల్పిత చరాచర జగత్తు సర్వం అనే సత్యాన్ని గుర్తించాలి. దీనినే సత్తామాత్ర చైతన్యమన్నారు. అనగా సత్యమై, నిత్యమై, శాశ్వతమై, అగోచరమై, అదృశ్యమైన యీ చైతన్యమే సర్వత్రా ఉన్నది. చైతన్యము అఖండ  స్వరూపమైనది.

ఈ చైతన్యమును రెండు విధములుగా విభజించారు ప్రజలు. ఒకటి లౌకికము. రెండవది దైవికము. ఈశ్వరత్వమునకు సగుణాకారమని ఒకటి, నిర్గుణాకారమని మరొకటి. మానవుని బాధలను, కష్టములను గురించి వాటి నివారణ నిమిత్తమై మనో సంకల్పములతో నిర్మించుకున్నవి సగుణాకార రూపములు. ఈ సగుణసాకారములనేవే మూర్తులు. ఇక్కడ మూర్తులనగా లోకరీతిగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. వీరే త్రిమూర్తులు. ఈ త్రిమూర్తులలో ఒక్కొక్క మూర్తిలో తిరిగి మూడు మూర్తులున్నాయి. ఈ మూర్తులలో గుణత్రయమైన మూర్తిత్వము కూడా అంతర్భూతమై ఉంటున్నది. అవియే సాత్విక, రాజసిక, తామసిక గుణములు. వీటినే బ్రహ్మవిష్ణుమహేశ్వరులన్నారు. బ్రహ్మ అనగా రాజసికము. విష్ణువనగా సాత్వికము. శివుడనగా  తామసికము. ఇవియే మూర్తిత్రయములైన సగుణస్వరూపసాకారములు. ఈ రాజసికములో  అ కారము బ్రహ్మత్వమునకు విశ్వరూపమై ఉంటున్నది. సాత్వికరూపమునకు స్వరూపమైనది ఉకారమైన విష్ణుస్వరూపము. శివస్వరూపమునకు స్వరూపమైనది మకారమనే ఈశ్వరుడు. ఈమూడింటి సాకార ఆరాధనే సగుణోపాసన, లౌకికోపాసన. సగుణారాధనయందు ప్రతి మానవునిలోను అకారమనే బ్రహ్మ, ఉకారమనే విష్ణువు, మకారమనే ఈశ్వరుడు సాక్షీభూతులై నిరంతరము మంగళకర స్వరూపాన్ని నిరూపిస్తున్నారు. ఈ మూర్తిత్రయములైన బ్రహ్మవిష్ణుమహేశ్వర రూపములు శాశ్వతము కావు. కారణమేమనగా భౌతిక దేహము  ధరించి ఉండటంచేత భౌతిక, లౌకికములు మాత్రమే లక్ష్యములు కనుక యివి  భ్రమస్వరూపములు, సంకల్ప ప్రభావములు, మనోవృత్తుల ఆకారములు. ఈ మూడింటిలోను  ఏకాత్మమైన నిరాకార

తత్వము ఈశ్వరునియందున్న మరొక ఈశ్వరత్వము. అదే అక్షర స్వరూపమైన దైవం ఆకారము.

జీవ తత్వమందున్న ఆత్మ పరమును చేరటంచేత పరమాత్మ అని చెప్పబడుతుంది. అనగా మనోవృత్తులు పరతత్వము పొందినప్పుడు పరమాత్మగా రూపొందుతుంది. మనో సంకల్పములతో కూడి ఉన్నంతవరకు జీవాత్మ. పరమాత్మ ప్రత్యేకించిన స్థాయిలో ఉన్నాడనుకోటమే పెద్ద అజ్ఞానము. మనస్సు తత్వము అధోగతి మార్గములో ప్రవేశపెట్టి లౌకిక చర్యలందు జీవితము వ్యర్థముగావించుకోటం జీవాత్మ లక్షణం. మనస్సు ఊర్ధ్వగతిలో ప్రయాణం సల్పి నిర్గుణ నిరాకార తత్వంలో నిత్యానంద స్థాయిని చేరినప్పుడు ఇది పరమాత్మగా రూపొందుతుంది. అనగా బహిర్‌దృష్టి భ్రమలతో కూడినది. అంతర్దృష్టి భ్రమరహితమైనది. భ్రమ రాహిత్యమే పరమాత్మ తత్వము. భ్రమతో కూడినదే జీవ తత్వం. ఈనాటి మన చర్యలన్నీ భ్రమలతో కూడినవి. భ్రమలతోనే జీవిస్తున్నాము. ఈభ్రమలచేతనే అహం తత్వమును అపారముగా అనుభవిస్తున్నాము. అహం అనగా ఏమి? నేను చేసిన పని, నేను సంపాదించిన ఆస్తి, నేను అభివృద్ధి చేసినది, నేను చూచినది, నేను విన్నది అని వినియోగిస్తున్నాము. వాస్తవానికి నేను అనే పదమును అర్థంచేసుకోటమే పరతత్వం. నేను అనేదాని అర్ధం తెలియక, నేను అనగా దేహమునకు సంబంధం ఉంచుకోటంచేత జీవితాన్ని వ్యర్థం చేస్తున్నారు. జీవితమంటే మధురమైనది. విలువైనది. పవిత్రమైనది. జీవించతగినది.

శివం అనగా మంగళం. జీవితము మంగళకరమైనది. మంగళకరమైన శివం లేని స్థానము జగత్తులో కానరాదు. సర్వమూ మంగళమే. మన మనోతత్వం అధోగతికి ప్రవేశించటం చేత కొన్ని అమంగళాలు కల్గుతూ ఉంటాయి. మంగళ, అమంగళములకు కారణం ఏమిటి? మంగళము లేనిది అమంగళము. అమంగళము కానిది మంగళము. మన దేహములో సత్తామాత్ర చైతన్యం నఖశిఖ పర్యంతము సంచరిస్తున్నంతవరకు యీ దేహం మంగళం. మంగళమైన చైతన్యముండినంత వరకు యిదే శివం. అయితే యీ చైతన్యం దృశ్యరహితమై, సర్వత్రా వ్యాపించి ఉన్నా ఒక్కొక్కతూరి దేహమును విడిచిపెట్టినట్లుగా కనిపిస్తుంది. అప్పుడే అది అమంగళంగా మారుతుంది. అమంగళంలోకూడా మంగళం ఉంది. అయితే అంతర్దృష్టితో విచారణ సల్పక అమంగళంగా భావించిన యీ దేహమే శవంగా మారిపోతుంది. అనగా విశ్వాసమనే శ్వాస ఉండినంతవరకు మంగళం. ఈ విశ్వాసమనే శ్వాస లేకుండా పోయిన అమంగళమనే శవంగా మారిపోతుంది. నిర్గుణనిరాకారమైన మనోసంకల్పరహిత తత్వమే నిజమైన శివత్వము. మనస్సు ప్రభావం చేతనే మానవత్వ, దానవత్వ పశుత్వములకు కొన్ని కారణములేర్పడుతున్నాయి. మనస్సు అధోగతి మార్గమైన దృశ్యకల్పితమైన వస్తువాహనాదులపైన భ్రమింపజేసినప్పుడు పశుత్వంగా మారిపోతుంది. ఇదే మనస్సును ఊర్ధ్వగతిలో లక్ష్యం చేసుకున్నప్పుడు నిర్గుణనిరాకారమైన ఆత్మతత్వమునకు, మనోసంకల్పరహిత భావమును పెంచుకున్నప్పుడు యిది మోక్షస్థితికి కూడా అర్హమవుతుంది. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో' ఒకే మనస్సు బంధనకు మోక్షమునకు కారణంగా ఉంటున్నాది. మనస్సు చెడ్డదని చెప్పుటకు వీలుకాదు. ఎందుకనగా మోక్షానికి కూడా కారణమవుతున్నాది. కనుక యిది చెడ్డ ఎట్లా అవుతుంది? మనసు మంచిదే. బంధమోక్షములకు మనస్సు ప్రయాణమే ప్రధాన కారణం. కనుక మనస్సు ఊర్ధ్వగతియైన దైవత్వమందు విశ్వాసం అభివృద్ధిపర్చుకొని సర్వత్రా ఉన్నది సత్తాచైతన్యమైన ఏకత్వమనే సత్యాన్ని గుర్తించాలి.

ఒక సాధకుణ్ణి అతని గురువు నిరంతరము 'శివోహం, శివోహం' అని జపించమన్నాడు. గురువుయొక్క ఆదేశానుసారం ఆ శిష్యుడు నిరంతరం 'శివోహం,శివోహం' అంటూ వచ్చాడు. కూర్చున్నా 'శివోహం', లేచినా 'శివోహం', తింటున్నా 'శివోహం'. ఈవిధంగా, ఏ పని చేస్తున్నా అతడు 'శివోహం' అనటం చూసి అతని స్నేహితుడొకడు ఆ మంత్రముయొక్క అర్థమేమిటని అడిగాడు. 'శివోహం' అంటే 'నేనే శివుడను' అని చెప్పాడు. దానిపై అతనికి ఎంత నమ్మకముందో పరీక్షించే నిమిత్తమై ఆ స్నేహితుడు "అయ్యా! నీవు 'నేనే శివుడను' అంటున్నావు బాగానేవుంది. అయితే పార్వతి నీకేమి కావాలి? ఆమెకు నీకు ఉన్న సంబంధము ఏమిటి?" అని ప్రశ్నించాడు. వెంటనే ఆ శిష్యుడు "అపరాధం! అపరాధం" లెంపలేసుకున్నాడు. నిజంగా ఆ శిష్యునికి తాను ఉచ్చరించే మంత్రార్థముపై విశ్వాసం ఉంటే 'పార్వతి నా అంగమే' అని ఎందుకు చెప్పకూడదు? కానీ యీనాటి మానవునియందు ఆ నమ్మకము లేకుండా పోయింది. ప్రతి మానవుడు ఈశ్వరత్వముతో కూడినవాడే. దేహమే పార్వతి, ఆత్మయే ఈశ్వరుడు. ఈ రెండింటి ఏకత్వమే మానవత్వము.

అగ్నిజ్వాలలనుంచి నిప్పుకణములు పారుతాయి, అట్లనే ఈశ్వరుడనే జ్వాలనుంచి, జీవులు అనే నిప్పులు బయటపడతాయి. నిప్పులో, జ్వాలలో రెండింటిలోనూ మంట ఒక్కటే, తేజస్సు ఒక్కటే. వాసనలు అనే గాలికి జీవుల తేజస్సు తగ్గిపోతుంది. అయితే ఆ గాలి ఈశ్వర తేజస్సుని ఏమాత్రము తగ్గించదు. జ్వాలయొక్క శక్తి యింకనూ అభివృద్ధి చెందుతుంది. ఈశ్వరునికి వాసనలే లేవు. వారికి

ఉండేది సంకల్పము ఒక్కటే. ఆ సంకల్పమనే గాలికి వారి తేజస్సు యింకనూ పెరుగుతుంది కానీ తరగదు.

ఈశ్వర సంకల్పము లేకపోతే అన్నియూ వృథా. ఒక చిన్న ఉదాహరణ. హిమాలయా పర్వతమందు శివుడు అనుగ్రహించే నిత్యబోధలను వినుటకు అనేకమంది ఋషులు వచ్చి కూర్చొనేవారు. అప్పుడప్పుడు ఈశ్వరుడు చక్కగా ఆత్మబోధ చేయు సమయమందు సరిగ్గా మంచి వర్షము కురిసేది. అంటే యీ బోధను విని గంగ ఆనందముతో ఉప్పొంగి వర్షరూపముగా వారిపై పడేది. దీన్నిచూచి పార్వతి "నాథా! మనకు ఉండటానికి ఒక యిల్లులేదు. వర్షంవస్తే తల దాచుకోటానికి కొంప లేదు. అంతేకాక తమ బోధను శ్రవణము చేయుటకు అనేకమంది ఋషులు వస్తున్నారు. గంగయొక్క కుతంత్రము వలన (ఆమె పార్వతికి సవతి కదా) వారంతా తడిసిపోతున్నారు. నేను ఒక చక్కని సభామండపము కట్టిస్తాను. సమ్మతించండి" అని ప్రార్థించింది. గృహలక్ష్మికి గృహం కావాలని ఆశ. ఇది సహజంగా ఆడవారికి ఉండే గుణమే. ఈశ్వరునికి యిష్టము లేదు. అప్పుడు ఈశ్వరుడు " ఇల్లు కట్టినంతమాత్రాన వచ్చే లాభమేమిటి? మనకెందుకు యిల్లువాకిలి? ఇల్లంటే ఎలుకలు, ఎలుకలకోసం పిల్లి, పిల్లి కొరకు ఆవులు. ఆవులను సాకటానికి పనిమనిషి కావాలి. ఇట్లు సంసార బాధ్యత పెరుగుతుంది. బిక్షాటనము చేసేవానికి కాపురము గొడవ ఎందుకు?" అని చెప్పిననూ పార్వతి వినలేదు. ఈమె కావాలని, ఆయన వద్దని... ఈరకంగా యిరువురికీ వాదన జరిగింది. ప్రతి కుటుంబములో ఈ 'యెస్', 'నో' లు ఉంటూనే ఉంటాయి. కట్టకడపటికి పార్వతి చాలా శాంతంగా "ఈశ్వరా! ఇల్లు కట్టించేది నా ఒక్కదానికోసం కాదు. ఇక్కడికి ఋషులు వచ్చినప్పుడు నిలువటానికి ఒక నీడ ఉంటుంది. మీకూ, నాకూ, అందరికీ తలదాచుకోటానికి ఉపయోగపడుతుంది. ఎందుకు మీకింత మొండితనం?' అన్నది. అప్పుడు ఈశ్వరుడు "పార్వతీ! నీవు సంకల్పించిన లగ్నం సరియైనది కాదు. ఎంత పెద్ద భవనం కట్టించినా దానిని అగ్నిదేవుడు భస్మం చేస్తాడు. భవిష్యత్తు గురించి నాకు తెలుసు. నీకేమీ తెలియదు. నోరు మూసుకొని కూర్చో" అన్నాడు. కానీ పార్వతి పట్టు వీడలేదు. "ఈశ్వరా! సర్వ శక్తులూ మీలోనే ఉన్నవి. సమస్త దేవతలు మీ ఆధీనంలోనే ఉన్నారు. అగ్నిదేవుడు కూడా మీ బంటే కదా! పంచభూతములు మీ దాసులే కదా! కాబట్టి, నేను కట్టించే యింటిని కాల్చవద్దని అగ్నికి ఆజ్ఞాపించండి. అతను మీ ఆజ్ఞను తప్పక శిరసావహిస్తాడు" అన్నది. ఆమె కోరికను నెరవేరుస్తానని ఈశ్వరుడు మాటిచ్చి, అగ్ని వద్దకు బయలుదేరాడు. ఈశ్వరుని మాటకు తిరుగులేదు కాబట్టి, ఆమె యింటిని కట్టటం ప్రారంభించింది. ఈశ్వరుడు వెళ్ళే సమయంలో ఒక మాట చెప్పింది, "నాథా! మీరు అగ్నిహోత్రుని కలుసుకొని, ఈ గృహాన్ని కాల్చక రక్షిస్తాను అని ఆయనతో మాట తీసుకోవాలి. ఒకవేళ ఆయన సమ్మతించకపోతే, నేను నా స్వహస్తములతో దానికి నిప్పు వేస్తాను. నేను కట్టిన గృహాన్ని అగ్ని వచ్చి కాల్చటం నాకు చాలా అవమానకరం. కాబట్టి, అగ్ని ఒప్పుకోకపోతే మీరు డమరుకం వాయించండి. ఆ శబ్దం విని నేను కట్టిన యింటిని నేనే కాల్చివేస్తాను. వానికి అవకాశం యివ్వను". ఈశ్వరుడు సరేనని అగ్నివద్దకు వెళ్ళాడు. అగ్ని నమస్కరించి "స్వామీ! మీరు వచ్చిన పని ఏమిటి? ఆజ్ఞాపించండి" అన్నాడు. "పార్వతి యిల్లు కడుతున్నది. ఆ యింటికి నీ ద్వారా గండం ఉంది. కాబట్టి, నీవు దాని జోలికి పోకుండా ఉంటానని మాటివ్వు" అన్నాడు. అగ్ని సరేనని మాటిచ్చి " నేను మీ ఆజ్ఞ శిరసావహించువాడను. ఇంతదూరము తామే వచ్చి నన్ను యీరీతి గౌరవించటమేమిటి? నేను దానిని ఏమీ చేయను. దహించను" అన్నాడు అగ్నిదేవుడు. దీనితో శివుడు చాలా సంతోషించాడు. భక్తునిపై అమితమైన వాత్సల్యమును కురిపించాడు. " నీకేమైనా కోరికలుంటే చెప్పు యిప్పుడే తీరుస్తాను" అన్నాడు. అగ్నిదేవునికి చాలా సంతోషమైంది. "స్వామీ! ఎన్ని దినములనుండియో మీ తాండవ నృత్యము చూచి ఆనందించాలనేది నా కోరిక. ఇంతవరకూ అది నాకు లభించలేదు. దయచేసి నా కోరిక తీర్చండి. ఆనందిస్తాను" అని ప్రార్థించాడు. భక్తుని సంతృప్తి పరచే నిమిత్తమై మైమరచి తాండవ నృత్యము చేశాడు.

**తాండవ కేళి సల్పెను!**
**పరమేశ్వరుడు శ్రీ సాంబశివుడు**
**తాండవ కేళి సల్పెను**
**తాండవ కేళి సల్పె కుండలీంద్ర కంకణుడు**
**సాలుగ ఢక్క చేపట్టి**
**ఝణఝణ ఝణఝణతక యనుచు**
**తాండవ కేళి సల్పెను!**
**శిఖలో మిన్నేటి కన్య**

**ముఖములో మూడవ కన్ను**
**సొగసుగ స్ఫటికాక్షమాలలు**
**నిగనిగ నిగనిగ నిగనిగ మెరయగ**
**తాండవ కేళి సల్పెను!**

ఈవిధంగా శివుడు తాండవమాడుతూ డమరుకం వాయించాడు. ఆశబ్దం విన్న తక్షణమే పార్వతి యింటికి అగ్ని పెట్టింది. ఈశ్వరుడు తిరిగి వచ్చి చూసేసరికి ఇల్లు కాలిపోతున్నాది. "పార్వతీ! ఏమిటీ విచిత్రం! అగ్ని కాల్చనని మాటిచ్చాదే!" అన్నాడు. "మరి మీరు డమరుకం ఎందుకు వాయించారు?" అంది. అప్పుడు ఈశ్వరుడు చెప్పాడు" ఈ యిల్లు ఉండకూడదని నేను సంకల్పించుకున్నాను. కానీ నీ తృప్తికోసం అగ్నిని అడగటానికి వెళ్ళాను. అగ్నిని సంతృప్తి పరచాలని తాండవమాడాను. తాండవమాడే సమయంలో మరచిపోయి డమరుకం వాయించాను". ఈశ్వరుని సంకల్పము లేదు కాబట్టి గృహము నాశనము కాక తప్పలేదు.

## 8

### అవతరణ.. ప్రేమబోధ

**ఏప్రేమ శక్తిచే నీ ధారుణీ చక్ర**
**మిరుసు లేకుండగా తిరుగుచుండు**
**ఏప్రేమ శక్తిచే నెల్ల నక్షత్రాలు**
**నేలరాలక మింట నిలచియుండు**
**ఏప్రేమ శక్తిచే నీ పుడమి బడక**
**కడలిరాయుడు కాళ్లు ముడుచుకొనియె**
**ఏప్రేమ శక్తిచే ఏడేడు లోకాలు**
**గాలి దేవుడు సురిటీలు విసరె**
**ఈ మహా ప్రేమ శక్తియే ఆత్మశక్తి**
**అద్భుతమనంత అద్వితీయమగు శక్తి**
**నిండియున్నది బ్రహ్మాండ భాండమెల్ల**
**ఈ మహా సృష్టి యంతయు ప్రేమ మయమె!**

బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపములున్నట్లు మనము విశ్వసిస్తున్నాము. సినీమా యాక్టర్ల మాదిరి ముగ్గురూ మూడు ఆకారాలు ధరించి దర్శనమివ్వటానికి వీలు లేదు. జగత్తులో యీరూపాలు చూచినవారు ఎవ్వరూ లేరు. ఇది విశ్వాసమును అభివృద్ధిపరచే నిమిత్తము ఏర్పడినవే. కేవలం భ్రాంతులు. ఐతే బ్రహ్మ,విష్ణు,మహేశ్వరులు ప్రతి ఒక్కరి హృదయమందు ఉన్నారు. హృదయమే ఈశ్వరత్వము. హృదయమే ఆత్మతత్వము. హృదయమే దివ్యత్వము. హృదయమే ప్రేమతత్వం. హృదయమంటే భౌతిక హృదయంకాదు. ఆధ్యాత్మిక హృదయం అపరిమితమైనది. ప్రేమకు హద్దులు లేవు. హృదయమునుండి ఆవిర్భవించేదే మనస్సు. అది సర్వత్రా ఉన్నది. జగత్తంతా వ్యాపించి ఉన్నాది మనస్సు. మనస్సు విష్ణువు. విష్ణువు విశ్వవ్యాపకుడు. సర్వాంతర్యామి. హృదయమునుండి

పుట్టినది మనస్సు. అనగా ఈశ్వరత్వం నుండి వచ్చినది విష్ణుత్వం. మనస్సునుండి ఆవిర్భవించినవాడు బ్రహ్మ. అతనే అహం. అహం నుండే అన్నీ ఆవిర్భవిస్తున్నాయి. బ్రహ్మ, విష్ణువు నాభి నుండి పుట్టినాడని అంటున్నాము. అనగా మనస్సు కేంద్రస్థానమునుండి వచ్చేది అహం. ఏతావాతా హృదయం ఈశ్వరుడు. మనస్సు విష్ణువు. అహం బ్రహ్మ.

ప్రతి అవతారమునకు తల్లిదండ్రులుంటారు. అయితే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల తల్లిదండ్రులెవరు? ఈ విషయాన్ని ఏ శాస్త్రములు, ఏ ఉపనిషత్తులు వివరించలేదు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు శరీరధారులు కాదు. కేవలం గుణస్వరూపులు మాత్రమే. వారు గుణస్వరూపులై ప్రతి మానవునియొక్క దేహమునందు సంచరిస్తున్నారు. దేహము నాశ్రయించి, దేహమునందే సమస్త కర్మలను ఆచరిస్తున్నారు. కాని, తనలోని మానవత్వాన్ని యేరీతిగా గుర్తించగలడు? బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు గుణస్వరూపులే అన్న సత్యాన్ని మానవుడు గుర్తించి వర్తించాలి.

ప్రతి దేహమందు ఒక హృదయమున్నది. దీనికే వేదము 'ఆత్మ' అని పేరు పెట్టింది. ఆత్మకే 'ఈశ్వర' అని పేరు. 'ఈశ్వర స్సర్వభూతానాం' ఈశ్వరత్వం ప్రతి వ్యక్తియందు, సర్వభూతములయందు ఉన్నది. ఇట్టి హృదయమనే ఈశ్వరత్వం నుండియే మనస్సనే విష్ణుత్వం ఆవిర్భవించింది. 'విశ్వం విష్ణుమయం జగత్' అన్నారు. విష్ణువనగా సర్వవ్యాపకుడు. మనస్సు కూడా అట్టిదే. విష్ణువుకున్న సర్వవ్యాపకత్వం మనస్సుకు కూడా ఉంది. మనస్సు ఏ క్షణమునందైనా, ఏ ప్రదేశమునందైనా, ఏ దేశమునందైనా సంచరించగలదు. కనుకనే, 'మనోమూలమిదం జగత్' అన్నారు. మనస్సే విష్ణుస్వరూపం. విష్ణువుయొక్క నాభికమలమునుండి ఉద్భవించినవాడు బ్రహ్మ. అట్లే మనస్సునుండి ఆవిర్భవించినది వాక్కు. కనుక, బ్రహ్మ వాక్స్వరూపుడు. దీనిని పురస్కరించుకొనియే మహర్షులు దివ్యత్వాన్ని 'శబ్దబ్రహ్మమయి' అని వర్ణించారు.

ఆత్మ, మనస్సు, వాక్కు... ఈ మూడు అవినాభావసంబంధము కల్గినది. వాక్స్వరూపుడే బ్రహ్మ. మనోస్వరూపుడే విష్ణువు. ఆత్మస్వరూపుడే శివుడు. కనుక, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు గుణస్వరూపులై ప్రతి మానవునియందు ఉన్నారు. వారికి ప్రత్యేకమైన ఆకారములు లేవు. ఆత్మ చైతన్యస్వరూపం. అదే ఈశ్వరత్వం. విశ్వమంతా వ్యాపించినవాడు విష్ణువు. బృహత్స్వరూపుడైనవాడు బ్రహ్మ.

మానవత్వములో దైవత్వమున్నదని ప్రకటించుట కొరకు, అవతారములు మానవాకారమును ధరించును. నిర్గుణ, నిరాకార పరబ్రహ్మతత్వము అందరికీ అర్థముకాదు, అందుబాటులో ఉండదు. భగవంతుడు సర్వవ్యాపి, సర్వాంతర్యామి, కాలస్వరూపుడు, కాలాతీతుడు. అగ్గిపుల్లలో మంట ఉన్నది, నిర్గుణముగా ఉన్నది. దానికి సాకార స్వరూపము యిచ్చిన అది కార్యకర్మలను సాధించును. అట్లనే నిరాకారము సాకారమైన, అజ్ఞానము దుర్గుణము మొదలగువన్నింటినీ భస్మము చేసి మానవులతో స్వస్వరూప సంధానము చేయించి వారికి ఆత్మానందమునందించు అవకాశమున్నది. దీనికే ధర్మసంస్థాపన అని పేరు. దీనికొరకే సగుణసాకార అవతారము. 'అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహం' అనేది గీతావాణి. అవతారముల వలన ధర్మస్థాపన, దుష్టశిక్షణ యీ రెండు జరుగును. అయితే ప్రజలను హింసించే సంకల్పము భగవంతునికి ఏనాడూ రాదు, లేదు. ప్రేమసందేశము బోధించి దుర్గుణములను రూపుమాపేదే వారి సంకల్పము. రాచకురుపు వలన దేహమే పతనమయ్యే పరిస్థితి కలిగినప్పుడు డాక్టర్లు ఆపరేషన్ చేసి మహదుపకారము నందించురీతి, రామకృష్ణాద్యావతార కాలమున, యుద్ధభూమిలో ఆపరేషన్ జరిగినది, అంతే. దేహమనే దేశమున కురుపు అనే దుర్గుణము విపరీతమై పెరిగినప్పుడు డాక్టరనే సాకార శ్రీకృష్ణభగవానుడు కాంపౌండరుగా అర్జునుని పెట్టుకొని ఆపరేషను స్వరూపమైన యుద్ధమును జరిపి దురహంకారమును నాశనము చేసి ఆరోగ్యమునను గ్రహించిరి.

జగత్తును సృష్టించిన వాడే అప్పుడప్పుడు మానవాకారముతో అవతరించిన గాథలంతా వ్యాసుడు పురాణములందు తెలియపరచినాడు. తమోగుణము, రజోగుణము, సత్వగుణము మూడూ చేరి మానవాకృతి అయినది. సాత్వికగుణములచే దేవతలు, రాజసగుణములచే మానవులు, తమోగుణములచే దానవులు రూపొందిరి. మానవులకు బుద్ధికుశలత ఎక్కువ. వారికి తీక్షణజ్ఞానసిద్ధి లభించును. తమ దివ్యత్వము తెలుసుకొనే అవకాశము కలదు.

ఈ జగత్తునందు ఐదు విధములైన స్వరూపములతో మానవత్వము అవతరిస్తున్నది. ఇవన్నీ కళలను పురస్కరించుకొనే అవతరిస్తూ వచ్చాయి. ఒకటి నిత్యావతారము. రెండవది విశేషావతారము. మూడవది అవిశేషావతారము. నాల్గవది లీలావతారము. ఈ లీలావతారమే అంశావతారమని కూడా చెప్పవచ్చు. నిత్యావతారము, విశేషావతారము, అవిశేషావతారము, ఐదునుండి తొమ్మిది వరకున్న కళల స్వరూపము మాత్రమే. ఒక పూర్ణావతారము మాత్రమే పదహారు కళలతో నిండి ఉంటుంది. అట్టి పూర్ణావతారమునే

దైవత్వముగా మన పూర్వీకులు విశ్వసించారు. ఏతావాతా ప్రతి మానవుడుకూడా అవతరించటము చేతనే అతనికి అవతారమని పేరు. అంతేగానీ దైవము యీ జగత్తులో ప్రత్యేకమైన స్వరూపము ధరించి సాక్షాత్కరించటం లేదు. ధర్మసంస్థాపన నిమిత్తం, దుష్టులను శిక్షించటానికి, శిష్టులను రక్షించటానికి భగవంతుడు అవతరిస్తుంటాడని భావిస్తారు. ఇది కేవలం కొందరి విశ్వాసము. ధర్మసంస్థాపన అంటే ఏ ధర్మసంస్థాపన? ప్రాకృతమైన ధర్మసంస్థాపన కోసం వస్తున్నాడా? అట్లయితే త్రేతాయుగంలో రక్షించిన ధర్మం ద్వాపరయుగంలో తిరిగి ఎందుకు క్షీణించి పోవాలి? ద్వాపరయుగంలో ధర్మాన్ని రక్షించినప్పుడు తిరిగి కలియుగంలో ఎందుకు నశించిపోవాలి? కనుక యిది లౌకిక ధర్మమునకు సంబంధించినది కాదు. ఊర్ధ్వధర్మమని ఒకటున్నది. అదే హృదయధర్మం. హృదయధర్మం దినదినానికీ క్షీణించిపోతున్నాది. ఎందుకు? మన దృష్టిని బహిర్ముఖం గావించుకోటంవలన. విషయములందు ప్రవేశించే మనస్తత్వాన్ని మనము అభివృద్ధి పరచుకుంటున్నాము. బయటి దృష్టి కలిగినవాడు పశువు తప్ప మనిషి కాదు. అంతర్దృష్టి అభివృద్ధిపరచుకొన్నవాడే మానవుడు.

ప్రేమ అనగా యేమిటి? ఎట్టి ఫలమును ఆశించక ఉపకారముచేసే తత్వమునకే ప్రేమ అని పేరు. భగవద్గీతయందు సుహృత్ అన్నాడు. భగవంతుడే నిజమైన స్నేహితుడు. నీ నుండి యెట్టి ఫలితమును ఆశించక అన్నిసమయములందు నీకు తోడుగా ఉండి నీయొక్క వాంఛలను నెరవేరుస్తూ వస్తున్నాడు. నీనుండి అతను యేఫలమును ఆశించటంలేదు. తల్లి, కుమారుడు పెద్దవాడై తన వృద్ధాప్యములో సాకుతాడనే అపేక్షచేత కుమారుని ప్రేమిస్తుంది. తండ్రికూడా అదేవిధముగా ప్రతిఫలాపేక్షచే కుమారుని ప్రేమిస్తుంటాడు. కానీ భగవంతునియందు స్వార్థరహితమైన ప్రేమ ఉండటంచేత యీ ఒక్కటి మాత్రమే సుహృత్ అనే పదమునకు అర్హత. ప్రేమకు నానార్థములు పెంచి, అనర్థములు స్వీకరించి, యదార్థమును విస్మరించి దుఃఖమునకు గురౌతున్నారు మానవులు. ఈ ప్రేమకు నానార్థములు లేనేలేవు. ఒకే అర్థము. ఇది హృదయానికి హృదయము.

ఒకానొక సమయంలో ధర్మజుడు రాజ్యము వదలి ద్రౌపతీ సమేతుడై హిమాలయములలో కాలము గడుపుతున్నాడు.

**జానెడు పొట్టనింపుకొన చిక్కులు నొందుచు కోటివిద్యలన్**
**పూనికమీర నేర్చి పరిపూర్ణ సుఖంబును పొందలేక యీ**
**మానవజాతి దుఃఖముల గ్రుగ్గగనేటికి శ్రీపరాత్పరున్**
**ధ్యానము చేయు భక్తులకు దారిని చూపకయున్నె మానవా!**

ద్రౌపది కంటిధారలు కార్చుకుంటూ 'నాథా! వేలమందికి అనుకూలములు గావించి, అన్నమును ప్రసాదించి, దుర్భిక్షము దూరముచేసి ధర్మమును కాపాడుతూ దానము చేసిన నీకు యీ కష్టములకు కారణమేమిటి? సాక్షాత్ ధర్మస్వరూపమే నీవు. నీకా యీ కష్టములు రావటం. పట్టెడన్నముతో పొట్ట నింపుకొనలేకపోతున్నావుకదా యిప్పుడు. ఈ కఠినమైన జీవితాన్ని కారడవులందు గడపటానికి కారణం ఏమిటి? భగవంతుని అనుగ్రహము లేకపోవటమా లేక నీ భక్తిలోని దోషమా? ఈ కష్టములకు కారణం ఏమిటి?' అని ప్రశ్నించింది. ధర్మరాజు చిరునవ్వు నవ్వుతూ 'ద్రౌపదీ! చూడు. ఈ హిమలయా పర్వతములు యెంత అందముగా ఉంటున్నాయి. ఈ అందమైన పర్వతములు నాకేమి ఫలితమునందిస్తున్నాయి? నాకేమి సహాయము చేస్తున్నాయి? ఏమీ చేయటంలేదు. కానీ నాకు వాటిని చూచిన తక్షణమే ఆనందము ఆవిర్భవిస్తున్నాది. అందమె ఆనందం. ఆనందమె జీవిత మకరందం. అందమే ఆనందము నందిస్తుంది. దానికి మించిన ఆనందము మరొకటి లేదు. ఒక పుష్పము. పుష్పము మనకు యేమీ సహాయము చేయటం లేదు. మనకు అనుకూలములు చేయటం లేదు. చూచిన తక్షణమే ఆనందము వేస్తుంది. భగవంతుడు ప్రకృతి స్వరూపుడు. ఈ ప్రకృతిని చూచిన తక్షణమే ఆనందము వస్తుంది. ఈ ఆనందము నిమిత్తమే నేను అతనిని ప్రేమిస్తున్నానుగానీ ప్రతిఫలాపేక్షతో కాదు. కనుకనే వేదము నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానసుః అనింది. ఈ త్యాగభావముచేత ఈ ప్రేమ స్వరూపుని చూచినప్పుడే మనకు అన్ని ఫలితములు చేకూరుతాయి. భగవంతుని ప్రేమించటమే నిజమైన ప్రేమ. ప్రేమ నిమిత్తమే ప్రేమ. సాధించవలసినది భగవంతుని ప్రేమ. అతని ప్రేమ ఒక్కటి ఉండెనా సర్వమూ సాధించిన వారమౌతాము. కనుక ఆ ప్రేమ నిమిత్తమై చింతించు. లౌకికమైన, క్షణభంగురమైన కష్టనష్టములకు నీవు చింతించ నక్కరలేదు. ఇది సరైన మార్గము కాదు. ఆ దైవత్వము పొందే నిమిత్తమై నీవు చింతించు. ఆ దైవత్వముయొక్క ఆనందము యిట్టిది అట్టిది అని ఎవ్వరూ కూడా వర్ణించలేరు. అవాఙ్మానస గోచరమైనది. యథో వాచా నివర్తంతే అప్రాప్య మనసా సః. మనస్సునకు గానీ, వాక్కునకుగానీ అందనిది యీ ఆనందము. ప్రాకృతమైన ఆనందము పరిమితముతో కూడి ఉంటుంది. ప్రాకృతమైన సంబంధము ఒక పరిమితముతో కూడి ఉంటుంది. ఇది పరిమితమునకు మీరినది. అతీతమైన తత్వము.

అదియే దైవానందము. అదియే నిత్యానందము. అదియే యోగానందము. అదియే అద్వైతానందము.

భగవంతుడు అవతరించటము ప్రేమను బోధించే నిమిత్తమే. ప్రేమను నేర్పునిమిత్తమే. ప్రేమ అనగా ఏమిటని ప్రజలకు బోధించే నిమిత్తమే. అట్టి ప్రేమను మనం పొందినప్పుడే మనకు దుఃఖములు దూరమౌతాయి. పాపములు అంతర్ధానమైపోతాయి. భీతి అనేది మన చెంత చేరదు.

అవతారపురుషుల దివ్యజన్మ, దివ్య కర్మలే మానవులకు మార్గదర్శకంగా , ప్రమాణంగా ఉండాలి. అప్పుడే అవతారతత్వం మానవులలో అవతరించును. జగత్తు దివ్యంగా ఉండినప్పుడే ప్రాణుల జీవితాలు కూడను దివ్యంగా ఉంటాయి. అందుకోసము దైవము తాను సర్వదా సృష్టిలో అవతరించుచుండును. దివ్యానుభూతి, దివ్యస్థాయి కేవలం మానవాతీతం కాదని, అది మానవులకు సిద్ధిస్తుందని నిరూపించటమే అవతారతత్వపు రహస్యం.

కృష్ణపరమాత్ముడు కాయమును వదలి నిరాకార స్వరూపమును ధరించినప్పుడే లోకమందు అధర్మము ప్రబలినది. తదుపరి ఎంతోమంది పరమహంసలు, దైవాంశ సంభూతులు ఉద్భవించి పరమ పవిత్రమైన సనాతన ధర్మమును, పరమ సత్యమును ప్రజలకు బోధించి వారిని తరింపజేయు నిమిత్తమై తమ జీవితమును అంకితము చేసియున్నారు.

అద్వైత మతమును స్థాపించి, ద్వైతభావము వలన మానవునిలో అభివృద్ధైన రజోగుణమును అణగద్రొక్కి, అజ్ఞానమును జ్ఞానజ్యోతిచే దూరము చేసే కొరకై శ్రీశంకరాచార్యులవారు కేరళరాష్ట్రమందు 'కాలడి' అనే గ్రామమందు జన్మించిరి. ఐదవ సంవత్సరమందే గాయత్రీ మంత్రోపదేశమునందుకొని శంకరుడు పదునాల్గు సంవత్సరములు వయస్సు పూర్తి అయ్యే లోపలనే వేదవేదాంగములను క్షుణ్ణముగా చదివి ఆత్మమార్గముననుసరించి లోకోద్ధరణకు కంకణము కట్టుకున్నాడు. గృహమును, సంసారమును త్యజించి దేశాటనమందుద్యుక్తుడై ప్రస్థాన త్రయమునకు అద్వైతరీత్యా వ్యాఖ్యానములను రచించి తన కాలమును, కాయమును పవిత్ర భారత జననియొక్క సేవకై, మానవ కులముయొక్క ఉద్ధారము నిమిత్తమై అర్పితము చేసాడు.

ఇంకొక్క ప్రధానమైన విషయమును మీకు గుర్తుకు తెప్పించవలెననుకున్నాను. జీసస్సు కాయమును వదలిపెట్టి ఆత్మతత్వములో లీనమయ్యే సమయమందు తన అనుచరుడైన జాన్ అనే ఆయనకు ఒక మాట చెప్పి పోయినాడు. ఆమాటకు భిన్నభిన్న మార్గములలో నానార్థములను కల్పించి వ్రాతను అభివృద్ధి పరచే వ్యాఖ్యాతలు, దాని సత్యమే అడుగంటిపోవునట్లు పెద్ద సమస్యగా పెంచారు. కానీ నిజార్థము చాలా స్పష్టముగానే ఉన్నది. 'నేను పోయిననూ మీరు చింతించనక్కర లేదు. కాలకారణములు ఒరిగి వచ్చినప్పుడు నన్ను సృష్టించిన వాడే మరి వస్తాడు. లోకమున అవతరిస్తాడు' అన్నాడు జీసస్. అక్కడున్న ఒక గొఱ్ఱె పిల్లను(ల్యాంబ్) చూపించి 'ఈ పేరుతో వస్తాడు' అన్నాడు. అంటే ల్యాంబ్ అనే ప్రాణిగా కాదు. గొఱ్ఱెపిల్ల యొక్క ధ్వని ఏమిటి? బాబా అని కదా! బాబా పేరుతో ఈ రూపములో వస్తారని అర్థము. మరియూ ఈ అవతారము యొక్క పేరు సత్యము. ఆయన వామనుడని, కేశరాశి కిరీటముతో ఉందురని, ఎట్టిటి రక్తపు రంగు రోబ్ ధరింతురు అని వివరములు కూడా బోధించి జీసస్సు మాయమైనాడు. మీ అందరిలో సాయి ఉన్నాడు. రక్తపు కలరు గౌను వేసుకొని పొట్టిగా, కుటిలకుంతల కేశరాశి కిరీటముతో మీమీ హృదయ పీఠమందు బాబా అనే పరిశుద్ధమైన, నిర్మలమైన, పవిత్రమైన ల్యాంబ్ దివ్య స్వరూపమున్నదనేది మీ నిజ తత్వము. ఇదే అవతార తత్వము. అవతారము బోధించే తత్వము. శిరిడీ శరీరముతో నున్నప్పుడే చెప్పియుంటిని. ఎనిమిది సంవత్సరముల తర్వాత వస్తానని. దానిని దీక్షిత్ ఎనిమిది సంవత్సరముల బాలుడుగా కనిపిస్తానని వ్రాసాడు. 1918 సంవత్సరములో విజయ దశమినాడు సమాధి పొందుతే ఆరు సంవత్సరముల వరకు అప్పుడప్పుడు భక్తులకు ప్రత్యక్ష దర్శనము యిచ్చాను. అబ్దుల్‌బాబాకు ఒకప్పుడు దర్శనమిచ్చి 'దేహానికి సమాధిగానీ నన్నెవరు సమాధి చేసేది?' అని అడిగాను. అబ్దుల్‌బాబా దగ్గర వచ్చే సమాచారము చెప్పియుంటిని. అంతియే వచ్చానుకూడా! అయితే వారే వీరా, వీరే వారా అని తర్కించి కాలాన్ని మీరు వృధాచేయకండి. మీకెంత తెలిసినదో దానినే నమ్మండి. అనుభవించిన ఆనందాన్ని పోగొట్టుకో వద్దు.

విల్సన్ అనేవాడు పరాశరమహర్షి రచించిన పురాణములను యింగ్లీషులోకి తర్జుమా చేశాడు. ఈ కలియుగమునందు పర్తి అనే గ్రామములో సత్య అనే పేరుతో ఐదడుగుల మూడంగుళముల పొడవుగల వ్యక్తి ఉద్భవిస్తాడని పద్మపురాణంలో ఉంది. అతడు యావత్ప్రపంచమును ఆకర్షించే బిగ్గెస్ట్ మేగ్నెట్ అని కూడా అందులో ఉంది.

ఎవరి హృదయం పరిశుద్ధముగా ఉంటుందో అట్టి వారికే దివ్యత్వాన్ని గుర్తించటానికి సాధ్యమవుతుంది. 1926 నవంబరు 24 వ తేదీన అరవిందుడు మౌనవ్రతాన్ని వీడి గొప్ప సభను ఏర్పాటుచేయించాడు. "నిన్నటి దినము దైవం ఈ ప్రపంచములో

అవతరించాడు" అని చెప్పాడు. ఈ విషయాన్ని చెప్పటానికే తాను మౌన వ్రతాన్ని వీడానని చెప్పాడు. ఈవిధంగా ప్రకటించిన తరువాత తాను తిరిగి మౌనం వహించాడు.

**9**

**ఆనందమే..ఆహారము**

**ఏ గుణంబు గణించి యేతెంచెనో నాడు**
**ప్రహ్లాదు పాలింప పరమపురుషు**
**ఏ గుణంబు గణించి యేతెంచెనో నాడు**
**కరిని గాచెడి తరి కమలనయను**
**దే గుణంబు గణంచి యేతెంచెనో నాడు**
**ధ్రువకుమారుని సాక వైకుంఠవాసి**
**నే గుణంబు గణించి యేతెంచెనో నాడు**
**పేద కుచేల్రోవ వేదచరితు**
**దా గుణంబె గణించి యా అమరవంద్యు**
**దార్త జనులను పాలించు నట్టివాడు**
**శ్రీనివాసుండు లోకైక చిన్మయుండు**
**వెల్గె పర్తీశుడై నేడు పృథ్వియందు!**

శ్రీకృష్ణుడు దేవకీదేవియొక్క అష్టమ గర్భమందు జన్మించాడు. దీని అంతరార్ధమేమనగా, యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి అనే అష్టాంగ యోగము నందు క్రమముగా అన్ని సోపానములనూ యెక్కి సమాధి స్థానమును చేరినప్పుడే భగవంతుడు హృదయమందు జన్మిస్తాడు. సమాధి అనే పదమునకు సమబుద్ధి, సమత్వ భావన అని అర్థము. సమాధి అంటే సామాన్యముగా తెలివితప్పి పడిపోవటము అని అనుకొంటారు. అది ఒకవిధమైన హిస్టీరియా కాని నిజ సమాధి కాదు. నిద్రను కూడ సమాధిస్థితి అందురు. నిజముగా, ఒకరు సమాధిస్థితిలో ఉన్నారని చెప్పాలంటే , ఆయనకు సుఖము దుఃఖము, చలి, వేడి, చీకటి, వెలుతురు మొదలగు ద్వంద్వ భావములే వుండవు. అన్నిటినీ సమత్వముగా చూచు స్థితియే సమాధి. అట్టి పరిపక్వ స్థితి సంపాదించిన, తప్పక భగవంతుడు ప్రత్యక్షమై సర్వదా సర్వత్ర అందుబాటులో ఉంటాడు.

నందునికి ఎందరో పిల్లలు పుట్టడము, చావడము, యిట్లే జరిగినది. కృష్ణుడు 'పుట్టినపుడు' అతడు శిశువుకు చెవులు, ముక్కు కుట్టినాడు! అట్లు కుట్టితే, పిల్లలు చావరు, అనేది పల్లెలవారి నమ్మకము. ముక్కుకు బంగారు తంతి వేసి దానికి ఒక చిన్న ముత్యమును తగిలించారు. ముత్యము సముద్రములో చిక్కే పదార్థము. సంసార సాగరములో లోతుగా మునిగి జపధ్యానాదులచే శ్రమ పడిన దొరికే వివేక వైరాగ్యముల సంకేతము ముత్యము. ముత్యముతో కూడిన నాసాభరణము, ఏకాగ్రత యొక్క చిహ్నము. నాసాగ్రమందు దృష్టిని కేంద్రీకరించాలి అని యోగశాస్త్రమందు ఉపదేశింపబడి ఉన్నది. అప్పుడే అర్ధనిమీలిత నేత్రమును సాధించుటకు వీలగును. నేత్రములను పూర్తిగా తెరిస్తే ఏకాగ్రత కుదరదు. లోకమంతా దృష్టిపథమందు గోచరమగును. నేత్రములను పూర్తిగా మూసితే నిద్ర వచ్చును. కాబట్టి, జగత్తుపై దృష్టి పోకుండా, నిద్ర రాకుండా, ధ్యానము జయప్రదముగా కొనసాగుటకు నాసాగ్రముపై దృష్టిని వుంచాలని

మహర్షులు బోధించిరి. కృష్ణుడు అంత తెలుపూ కాదు, అంత నలుపూ కాదు. మూడు భాగములు నలుపు, ఒక భాగము తెలుపు కలిపితే ఎంతో అంత. అతనిది శ్యామల స్వరూపం! నందుడు వైష్ణవుడు కాబట్టి, అబ్బాయికి స్నానము చేయించి ఒకే ఒక గీత కస్తూరీ తిలకము పెట్టేవాడు. నందుని తల్లి ఆమె కంఠాభరణమును శ్రీకృష్ణునికి ధరింపచేసేది. అదే కౌస్తుభము. ఆ కాలములో దానికి చాలా గొప్ప వెల. ఆ పతకము మధ్య ఒక పెద్ద పచ్చ, మరకత రత్నము వుండెను. దాని చుట్టునూ విలువైన వజ్రములు పొదగబడినవి. అది శ్రీకృష్ణుని వక్షస్థలమందు తళతళలాడుతూ వుండేది.

చేతికి కంకణములు, అంటే వెండి కడియములు. పల్లెలో వాళ్ళు, గొల్ల పిల్లలు ఆ కాలములో వేసుకునేవారు. అయితే కృష్ణుడు వేసుకున్న కంకణములకు వేరే అంతరార్థముంది. యజ్ఞసమయమందు, పెండ్లి సమయమందు కట్టుకునే దీక్షా కంకణములు కావు. అవి ప్రతిజ్ఞా కంకణములు. మూడు. గీతలో వాటిని గురించి వెల్లడించాడు. మొదటిది.

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే.**

రెండవది

**అనన్యశ్చింతయంతోమాం యే జనాః పర్యుపాసతే**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం.**

మూడవది.

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ**
**అహంత్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ.**

చూడండి, రెండవ దాంట్లో యేజనాః అంటాడు! ఎవరైనా సరే, అనన్య భక్తితో భగవంతుని భజించిన , ఉపాసన చేసిన, వాని యోగక్షేమమును వహిస్తాడు. ఏదేశము వారైనా, ఏ మతము వారైనా సరే, అని దీనికి అర్థము. "నేను జగత్తును సంరక్షిస్తాను, ధర్మ సంస్థాపన చేస్తాను, అన్యాయ అక్రమ అసత్యములనే అహంకార జన్య కల్మషములన్నియూ నాశనము చేస్తాను, భక్త రక్షణ సల్పుతాను, అనేది కంకణముల భావార్థము. దానివలననే శ్రీకృష్ణుని ప్రేమావతారము అంటారు. తిరిగి అట్టి పూర్ణ ప్రేమావతారము వచ్చినపుడు మీరందరూ దర్శన భాగ్యమునందుకొంటున్నారంటే, మీ జన్మములు ఎంత పుణ్యము, ఎంత సార్థకము! దానికే ఇదిగో! పరమ పవిత్రమైన ఈ కౌస్తుభమాల, కృష్ణుడు తన మెడలో వేసుకున్న పతకము. చూచి ఆనందించండి. (శ్రీవారి హస్తమందు ప్రత్యక్షమైన ఆ దివ్య కంఠాభరణమును, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సమావేశమైన భక్తులకు శ్రీవారే సమీపమునకు వచ్చి చూపించి ఆనంద పరచిరి.)

సర్వశక్తిమయుడైననూ శాంతిని బోధించి దానికై సర్వప్రయత్నము చేసినాడు. ఆనాడూ, ఈనాడూ ఎప్పుడూ బోధ ఒక్కటే, నీలోని సత్యమును చూసుకో, అప్పుడు నా సత్యము నీకు గోచరమగును. మానవునికి సన్నిహితముగా వచ్చి వానికి అందుబాటులోనున్న సాంప్రదాయములను తీర్చిదిద్ది మాధవత్వము అందజేసేదే ఆనాటి, ఈనాటి దైవ సంకల్పము. మానవత్వముతో రాకపోతే ఎవరూ దగ్గరగా రాలేరు. దైవత్వముగానే వస్తే అందరూ దూరమవుతారు. మానవుణ్ణి శారీరకంగా సమీపించి, సమతత్త్వం ద్వారా ప్రేమతత్త్వాన్ని పంచటానికే భగవంతుడు అవతరిస్తుంటాడు. దానికే "దైవం మానుష రూపేణా" రావలసియున్నది. భగవంతుడు మానవాకారంలో వచ్చినప్పుడే మానవునికి అత్యంత సమీపంగా ఉండటానికి వీలవుతుంది. మానవునికి ఆనందం చేకూరుతుంది. దర్శనం పాపనాశనం గావిస్తుంది, సంభాషణ చింతలు తీరుస్తుంది, సమీపత్వం సాయుజ్యమును అందిస్తుంది.

ఈ ప్రపంచమందు గోచరమయ్యే సమస్త పదార్థములూ దైవస్వరూపములే. రామాయణం, భారతం, భాగవతం, ఉపనిషత్తుల అంతరార్థమును చక్కగా విచారణ చేసినప్పుడు, వాటిలో ఉన్నది అణుతత్త్వమే అని మనకు అర్థమవుతుంది. ఆనాటి గోపికలు కూడా చెప్పారు

**అణువుకంటె నతి సూక్ష్మరూపుడవు**
**ఘనముకంటె నతి గణనీయుండవు**
**ఎనుబదినాలుగు లక్షల జీవుల**
**అనయంబును ఎడబాయకుందువట**

**అణురేణు తృణ కాష్ఠము మొదలుగ**
**అఖండ రూపుడవై వెలయుదువట**
**నిను కనుగొనగలమా కృష్ణా!**

ఇలాంటి దైవత్వాన్ని ఒక ఆకారమునకు పరిమితం చేయటం పొరపాటు కదా! ఇప్పుడొకవిషయాన్ని మీరు చక్కగా విచారణ చేయాలి. గాలిది ఏ రూపం? ఏ రూపము లేదు. గాలిని బెలూన్‌లో నింపుతే అది బెలూన్ రూపాన్ని ధరిస్తుంది. నీటిని ఏ పాత్రలో పోస్తే అది ఆ పాత్ర రూపాన్ని ధరిస్తుంది. అదేవిధంగా, దివ్యత్వం ఏ ఆకారంలో చేరితే ఆ స్వరూపాన్ని ధరిస్తుంది. రాముడు, కృష్ణుడు కేవలం ఆకారంలో వేర్వేరుగానీ, వారిలో ఉన్నది ఒకే దైవత్వమే. ఇదేవిధంగా ప్రతి మానవునియందు అణుతత్త్వమనే దివ్యత్వం వ్యాపించి ఉంది. ఇట్టి దివ్యత్వాన్ని గుర్తించటానికి మీరు ఏ సాధనలు చేయనక్కరలేదు. దైవము సర్వస్వరూపుడనే సత్యాన్ని గుర్తించుకుంటే చాలు. భారతము, భాగవతము, రామాయణము, గీత మున్నగు గ్రంథములయొక్క ఏకత్వం దివ్యమైన ఆత్మతత్త్వమే. మీరు పెద్ద పెద్ద తలదిండులవలెనున్న ఎన్నో గ్రంథాలను చదువుతున్నారు. కానీ యిలాంటి గ్రంథం ప్రపంచంలో మరొకటి లేనేలేదు.(అని పలుకుతూ స్వామి అగ్గిపెట్టె సైజులో ఉన్న ఒక బంగారు పుస్తకాన్ని సృష్టించారు) ఇదియే ఆగ్రంథము, చూడండి. ఇందులోనే రామాయణం, భారతం, భాగవతం, గీత సర్వమూ ఏకమై ఉన్నాయి. అణుమాత్రమైన ఈ గ్రంథమునందే అఖండ స్వరూపమైన దైవత్వం యిమిడి ఉన్నది. ఒక్కొక్క పేజీలో 700 శ్లోకాలున్నాయి. ఇది పూర్వం వ్యాస మహర్షి వద్ద ఉండినది. అతడు దీనిని తన కుమారుడైన శుకునకు అందించాడు. ఇందులోనే స్వామియొక్క అవతారాన్ని గురించి తెలిపే శుకనాడి ఉన్నాది.

పరమాత్మ తత్త్వాన్ని గుర్తించటానికి సాధనలు అక్కరలేదు. భగవంతుడు సర్వత్రా ఉన్నాడనే సత్యాన్ని గుర్తించటమే నిజమైన సాధన. అందరిలోనున్న ఆత్మతత్త్వం ఒక్కటనే సత్యాన్ని గుర్తించాలి. ఈ దేహములు కేవలం ఉపాధులు, పనిముట్లు, తొడుగులు. మీరు కేవలం బాహ్యమైన రూపమును ఆధారం చేసుకొని ఆరాధన సల్పుతున్నారు. అందరియందున్న ఆత్మతత్త్వమే అన్ని దేహములందున్నది. ఐతే, ఇట్టి సత్యాన్ని గుర్తింపచేయటానికి ఒకరు అవసరం. ప్రమిద, నూనె, వత్తి కలవు. దీపపు వెలుగు కలుగునా? ముట్టించేవాడు ఒకడుండాలికదా! బంగారము, రత్నములు కలవు. సొమ్ములు నిర్మాణమగునా? చేసే కంసాలి ఒకడుండాలికదా! పూలు, సూది, దారము కలవు. పుష్పమాలతానగునా? దానిని కూర్చేవాడు ఒకడుండాలికదా! బోర్డుపై ఎ,బి అనే అక్షరాలున్నాయి. ఏ అక్షరమును ఏ శబ్దముతో పలకాలో చెప్పటానికి టీచరు ఒకడుండాలికదా! అదేవిధంగా, అన్ని దేహములందున్న ఆత్మతత్త్వం ఒక్కటే అని చెప్పటానికి ఒకరు అత్యవసరం. అందుకోసమే అవతారాలు రావటం. దివ్యత్వాన్ని, పవిత్రతను, ఏకత్వాన్ని అందరికీ ప్రకటింప చేయటంకోసమే అవతారాలు వస్తుంటాయి. వేద స్వరూపుడే భగవంతుడు. వేదములను బ్రాహ్మణులయందే పరమేశ్వరుడు నిక్షేపించి యున్నాడు. కావున, వేదపోషణ, గోబ్రాహ్మణ పోషణ చేత సనాతన వైదిక ధర్మ సంస్థాపనము సల్పి, అందుమూలమున, సర్వదేశములకు శాంతి సౌఖ్యములు సమకూర్చుటే నా సంకల్పము. నా రాక యిందుకే. నా యిచ్ఛ అమోఘము. బ్రహ్మాదులెదిరించిననూ నన్నాపలేరు, లేరు,లేరు. అందరూ నాకు సమానులే. అందరి మేలుకే నా యీ పూనిక. కలిలోని దుష్టశక్తుల నణగార్చి విశ్వశ్రేయము గూర్చుటే నా యీ విజయ యాత్రకు విశిష్ట ఫలము.

పుత్రకామేష్టి యజ్ఞహోమము నుంచి వెలువడిన పాయసము నుండి రాముడు జన్మించినట్లు వర్ణించారు. ఏ అవతారమైనా సరే, ఈ అవతారము కూడా అంతే. రక్తమాంసాలనుంచి జన్మించదు. ఇతరుల శరీరాలు జడవస్తునిర్మితాలు. అవతారమూర్తి దేహం చిన్మయం. స్వచ్ఛమైన పవిత్ర క్షీరంలో తేలుతూ ఎదుగుతుంది. అందువల్లనే అవతారపురుషుడు లోపరహితుడు. అన్నమయమైన దేహమునకు ఆహారవిహారముల వలన కొన్ని మార్పులు రావచ్చు. మానవాతీతుడు కాబట్టి ఈ దేహమునకు ఆహారవిహారముల వలన గానీ, ఏ కారణముతోగానీ ఎప్పుడూ రోగములు రావు. ఆహారవిహార దోషములు ఎప్పుడూ ఈ దేహమునకు లేవు. ఇన్ని దేహములను కాపాడుట కొరకే ఈ దేహము వచ్చినది కనక దీనికి రోగములే లేవు, రావు.

ఈ అవతారము వచ్చినది ధర్మ రక్షణ చేసి, యదార్థం చూపించి, నిజతత్వాన్ని తెలియపరచి మిమ్ములను వాంఛారహితులుగా చక్కచేయటం కోసమే. దానినే నేను చేసేది. మీకు తెలియకుండా మిమ్ములను చక్కచేసేదానికన్నా, తెలిపి చేసేదే మంచిది. మహత్త్యములను చూపించి మీ నమ్మకాన్ని ధృఢపరచేదే నా ఉద్దేశ్యముగానీ, నాకు కీర్తిప్రతిష్ఠలు అక్కరలేదు. నాకవి అనవసరము. నా క్రియలన్నియూ మహాత్త్యములే! అవి మానవాతీతము. అందరి శక్తిసామర్థ్యములకన్న మించినవి.

అవతారపురుషుల దివ్యజన్మ, దివ్యకర్మలే మానవులకు మార్గదర్శకంగా , ప్రమాణంగా ఉండాలి. అప్పుడే అవతారతత్వం

మానవులలో అవతరించును. జగత్తు దివ్యంగా ఉండినప్పుడే ప్రాణుల జీవితాలుకూడా దివ్యంగా ఉంటాయి. అందుకోసము దైవమే తాను సర్వదా సృష్టిలో అవతరించుచుండును. దివ్యానుభూతి, దివ్యస్థాయి కేవలం మానవాతీతం కాదని, అది మానవులకు సిద్ధిస్తుందనేదే అవతార రహస్యం.

మీరు నన్ను వదలినా, నేను వదిలేవాడిని కాదు. అట్లా వదిలే స్వభావముంటే నేను రావలసిన అవసరమే లేదు. నన్ను వదలిపెట్టి పోయినవారు మరల రాక తప్పదు. వీరిని నేనే నా దగ్గరకు లాక్కుంటాను. అదియే నా స్వభావము.

దేవుని స్వరూపము మహిమలలోనే చూడాలి. భగవత్ శాసనము చాలా విచిత్రముగా ఉన్నది. దానిలో తర్కమే అనవసరం. అది అనుభవైకవేద్యము. అవతార తత్వము బుద్ధికి అతీతము. భగవద్విషయాన్ని నిజమైన విశ్వాసముతో తెలుసుకోవాలి. అది విమర్శతో తెలియదు. దశేంద్రియాలు పనికిరావు. దీనిని తెలియుటకు అంతర్దృష్టిని అభివృద్ధి చేసుకోవాలి. మీలో వ్యక్తిత్వము ఉన్నంతవరకు, మీకు శక్తి కనబడదు.

ప్రత్యక్షముగా వచ్చినప్పటికీ సందేహాలు తప్పవు. అర్థము లేనటువంటి మాట, కారణము లేనటువంటి కార్యము యిక్కడ జరుగదు. ఇక్కడ నిష్కారణముగా ఏమీ జరగదు. పవిత్రం కానటువంటి కార్యము నేనెప్పుడూ చేయను. నాకు కావలసినది ఏమియూ లేదు. మీ యొక్క ఆశను నెరవేర్చటమే నాకు అనందము. మిమ్ములను గమ్యము చేర్చేదే నా పని. నాకు కావలసినది ప్రేమ హృదయమే.

ఈ దేహముపైన కూడా మోహము పెట్టుకో వద్దు. దేహ భ్రాంతి కూడదు. ఈ హస్తము మీకు వస్తువులనిస్తుంది, అయిన అవి ఏ చేతిలోనుండి వస్తున్నవో, అదే నా హస్తము. నా పోకడ వేరు. ఏ విషయంలో కూడా నేను ఏకీభవించను. ఐసే నీళ్ళు, నీళ్ళే ఐసు. అదే యిది, ఇదే అది. నిర్గుణమే సగుణం,సాకారమే నిరాకారం. రాముడు వచ్చాడు, కృష్ణుడు వచ్చాడు, సాయిబాబా వచ్చాడు. ఈ పుట్టపర్తి సాయిబాబా వచ్చి అంతా నేనేయని దబాయించి కొడుతున్నాడు అని మీరు సందేహ పడవచ్చు. మీకిది అర్థంకాదు. అదే యదార్థము. నా సమాచారము మీకు తెలియదు. కొద్ది కాలములో ప్రపంచమంతా యిక్కడికి వచ్చి మునిగిపోతుంది. ఏ యుగములో కూడా యింత దృష్టాంతరాలు ప్రజలకు దొరకలేదు. మీరు నిజంగా అదృష్టవంతులు. ప్రేమ నేత్రంతోగానీ, జ్ఞాననేత్రంతో గానీ , యోగనేత్రంతో గానీ భగవత్స్వరూపమును చూడవచ్చు. కర్మ నేత్రముతో చూడటం సాధ్యం కాదు.

కలియుగము నిజముగా పవిత్రమైనది. మీరు కూడా ధన్యులు. భగవదవతారమును దర్శించి, స్పర్శించి, వారితో సంభాషించే మార్గము మీకుదొరికింది. పది అవతారములు కాదు 26 ముఖ్యా వతారములున్నాయి.అయిన దైవాంశ సంభూతులు వేరే. దైవీ శక్తితో వచ్చినవారు వేరే. భగవన్నియామకమై భగవదాజ్ఞానుసారము వచ్చినవారు వేరే. పరశురాముడు అవతారము కాదు. వచ్చిపోయిన అవతారములంతా చెదలను చంపి చెట్టును కొట్టారు. అయితే యిప్పుడు చెదలను చంపటం లేదు. దానిని తీసివేసి, చెట్లకు ఎరువు వేసి పెంచటమే యిప్పటి అవతారపు ఉద్దేశ్యము. శిక్షించే స్వభావము నాకు లేదు. చెడిపోయిన నగను చక్కచేసే కంసాలివాడను నేను. రాముడు సత్య, ధర్మ, శాంతి స్వరూపుడుగా వచ్చాడు. కృష్ణుడు ప్రేమస్వరూపుడుగా వచ్చాడు. ఇప్పుడు సత్య, ధర్మ, శాంతి, ప్రేమ యీ నాల్గింటితో కూడి వచ్చింది. ఎందుకంటే యిప్పుడు అన్నీ కావాలి. ఈ కాలములో తెలివి మితిమీరి పెరిగినది, గుణము మాత్రము అధఃపాతాళానికి పడిపోయినది. పరమాత్ముడు ప్రజలకోసం ఎన్ని బాధలు అనుభవిస్తున్నాడనేది మీరు గ్రహింపలేరు.

మీ అనుభవమే మీకు ప్రధానము. మీ ఆనందమే మీకు ఆధారం. ఒక ద్రౌపదిని రక్షించాడు, ఒక అహల్యను ఉద్ధరించాడు, ఒక ప్రహ్లాదుని కాపాడినాడు అనిచెప్తారేగానీ ఇంక ఎంతమంది ద్రౌపదులున్నారో, ఎంతమంది అహల్యలున్నారో, ఎంతమంది ప్రహ్లాదులున్నారో ఎంతమంది అనుగ్రహము పొందినవారున్నారో మీకేమి తెలుసు? పరమాత్ముని ప్రేమ ప్రవాహము ప్రవహిస్తూనే ఉంటుంది. అది అంతులేని విషయము. అయితే మీరు హద్దులో చూస్తారు. సృష్టి, రక్షణ, శిక్షణ యీ మూడే భగవంతుని కార్యములు, భగవంతుని లక్షణములు. భగవంతుని వాంఛలన్నియూ లోకసంగ్రహార్థమే. లోకానుగ్రహము కొరకే. నా ఉత్సాహము నాది, ఒకరిష్ట ప్రకారము నేనెప్పుడూ పోను. ఎవరి యిష్టమునకు నేను చోటివ్వను. సర్వులకు, సర్వమునకు సాక్షీభూతమైనటువంటి వాడనే నేను. కొద్ది సంవత్సరములలోనే సర్వశక్తులూ నేనేయని మీకు తెలుస్తుంది. సర్వదేశములనుంచి ఆర్తులు, జిజ్ఞాసులు, జ్ఞానులు యిక్కడికి వస్తారు. మీరు ఎక్కడ ఉండిననూ, నమస్కారము చేసే బుద్ధిపుట్టిన నా పాదాలు మీ దగ్గర ఎప్పుడూ ఉంటాయి. 'భగవంతుడా! నా మొర వింటున్నావా లేదా?' అని మీరంటే నా చెవులు అక్కడనే ఉంటాయి. చూస్తున్నావా లేదా అని ప్రార్థిస్తే నా కన్నులు అక్కడనే ఉండి చూస్తుంటాయి. రామ, కృష్ణ, షిరిడి సాయి, ఈ సత్యసాయిబాబా ఆ రూపము అట్లనే, ఈ రూపము యిట్లనే అనే సందేహాలు

ఎందుకు? వేసుకునే గుడ్డలు మారినాయిగానీ దేహమొక్కటే.

నేను చెప్పినట్లు నడచుకొనవలయును. విశ్వాసము మీకు మొదటిది. తరువాతనే అనుభవము. నమ్మితే మీకు తెలియకుండానే అనుభవానికి వస్తుంది. నేను యిచ్చే మందునూ తీసుకోవాలి, నేను చెప్పే పథ్యాన్నీ ఆచరించాలి. నేను చేసేదెప్పుడూ శాంతముగా చేస్తాను. మీరు అడిగిన వాటికన్నింటికీ తథాస్తు తథాస్తు అని వరమీయను. మీరు వచ్చినది పరమాత్ముని చేరటానికి. అది తెలియక మాయను తలకెక్కించుకొని దించుకోటానికి చేతకాక బాధపడుతూ, బాహ్య ఫలితాలకు ప్రార్థిస్తూపోతుంటే ఏమి ప్రయోజనం? అవిద్య ఉన్నంత వరకు చవి చూడలేరు, గుర్తించలేరు, పొందలేరు. మీరు శాంతముగా కాచుకొని ఉంటే, నేను తప్పక సంతోషమిస్తాను. అయితే నిరాశ వద్దు. చిన్న చిన్న తామర మొగ్గలు కూడా రేపో మరునాడో వికసిస్తాయి. సూర్యుడు ఉదయిస్తాడు. ఈ భాగ్యము మీకు ఎన్నో జన్మల తపఃఫలమునుంచి దొరికింది. ఆ కష్టము మీకు యిప్పుడు తెలియదు. మీకు తెలియనీ తెలియకపోనీ తత్ఫలితము మాత్రము నేను యివ్వకపోను.

నేను అనుగ్రహ స్వరూపుడను. అందరాని పండు చిక్కినప్పుడు అడుగరాని కోరికలడుగుతే ఎట్లా? మీ వాంఛల వల్ల పరమాత్మపైనున్న ప్రేమ చలిస్తుంది. మీరు ఏమైనా చేయండి, సర్వమూ మీ కర్పణము అనండి. నేను అన్నియూ చూచుకుంటాను. మీ భక్తివిశ్వాసములు మార్చకూడదు. మీ బుద్ధికి పరిమితి ఉన్నదిగానీ నా శక్తికి పరిమితి లేదు. నాపైన మీకు ప్రేమ లేకుండాపోయినా మీపైన నా ప్రేమ తగ్గదు.

లోకమేమన్ననూ నేను లెక్కచేయను. సత్యానికే తప్ప వేరొకదానికి లొంగను. కారణమేమనగా, సత్యము కొరకే, ఈ దేహము ధరించి వచ్చియున్నాను. నేను సత్యస్య సత్యము, సత్యానికే సత్యము. ఈ దేహమునకు సత్యమనేదే పేరు. దీనిలో సంచరించే శక్తియొక్క పేరు కూడా సత్యము. సర్వశక్తులూ అరికట్టే శక్తి యిది.

**అఖిల మానవులకు నానందమొనగూర్చి**
**రక్షించుచుండుటె దీక్ష నాకు**
**సన్మార్గమును వీడి చరియించు వారల**
**పట్టి కాపాడుటే వ్రతము నాకు**
**బీదసాదలకైన పెను బాధ తొలగించి**
**లేమిని బాపుటే ప్రేమ నాకు**
**మంచి చెడ్డలు కూడ మనసులో సమముగా**
**భావించుచుండుటే భక్తి నాకు**
**అనగ బేరొంది నా యంద నలరువారి**
**నెన్నడును మరువనివాడనన్నమాట**
**ఎట్టి కుత్సితము మదికి నేర్పకుందు**
**అట్టి నా పేరు చెడునెట్లు భువిని.**

దేని కొరకు యీ సత్యము లోకానికి వచ్చినదని విచారణ చేసిన, సత్య మార్గములో ప్రజలను నడిపించి, సత్యాన్వేషణమందు వారి దృష్టులను మరల్చి, వారిని సత్య మార్గములోనికి రప్పించే నిమిత్తమని తేలక పోదు. సత్యమును బోధించి, సత్యమార్గమును వారికి తెలియపరచే నిమిత్తమై ఈ సత్యము వచ్చినది.

మీకు కావలిసిన అందుబాటులో యిప్పుడు వచ్చాను. నా వాంఛలన్నిన్నియూ లోకానుగ్రహము కొరకే. నా ఉత్సాహము నాది. ఒకరి యిష్టప్రకారము నేను ఎప్పుడూ పోను. ఎవరి యిష్టమునకు చోటివ్వను. నా చేతిలో ఉండేవాడు నాకేమి చెప్పేది? మీకు ఆకలి లేదు. నిజమైన ఆకలి ఉంటే నేను పస్తుపెట్టువాడను కానేకాదు. మనస్సును మర్దనము చేసి వెన్న తీసి, హృదయావేదనలో కరగించుకోవాలి. వెన్న కరగలేదంటే వేడి చూపలేదనేదే అర్థము. ప్రేమయే ఆ వేడి.

నన్ను వర్ణించటము, నన్ను పొగడటము నాకు నచ్చదు. ఉన్నదానిని ఉన్నట్లు చెప్పు. దానిలో ఆనందముంది. ఎక్కువ చెప్పినా,

తక్కువ చెప్పినా రెండూ ద్రోహమే. నా కష్టములను నీవు తీర్చవలసినది అని హక్కుతో అడగండి. హృదయాన్నిచ్చి, హృదయాన్ని తీసుకోండి. మాటలిచ్చిన మీకు దొరికేది మాటలే. భగవంతుడు ఏనాటికీ మాట తప్పేవాడు కాదు. నేను చెప్పేది ఒకటి మీరు తీసుకొనే భావము మరొకటి. ఇట్లుండవచ్చునేగానీ , నా ఉద్దేశ్యమే, నా సంకల్పమే ఎప్పుడూ జరిగేది. సంకల్పములు మూడు విధములు. యోచనా సంకల్పము(చేస్తామా చేయకూడదా అని తర్కం చేస్తూచేస్తూ సంకల్పానికి వచ్చేది) మనన సంకల్పం(చేస్తామని నిశ్చయించిన తరువాత చేసేది), సిద్ధసంకల్పం. స్వామికి ఎప్పుడూ సిద్ధసంకల్పమే. తుపాకి శబ్దము, దెబ్బ రెండూ ఒక్క క్షణములోనే...సంకల్పము, కార్యము రెండూ ఒకే క్షణములో జరిగేవి.

అలాంటి సమయమున యేరీతిగా నడువవలెనన్న, మిమ్ములననుసరించుచూ, మీ వలె తింటూ, తిరుగుచూ, నవ్వుచూ, మాట్లాడుచూ, ఆడుచూ, పాడుచూ, అక్కడక్కడ కనిపించుచూ, నవ్వించుచూ, యేడ్పించుచూ, యింకా అనేకరకములుగా చేయుచూ...(ఇవన్నీ ఎవరి కోసము? మీ కోసమే!) మీ మార్గములోనే నేను నడచి ఆచరించ వలెను. అయితే సర్వమూ నాకు తెలియును. నేను సర్వజ్ఞుడను. నాకు సర్వ శక్తులు ఉన్నవని నేనెన్నడూ తప్పి నడువను. దీనిని మీరు చక్కగా గుర్తించ వలెను. ఎందుకనగా, ఎవరు అధికార స్థానములో లీడరుగా నున్నారో, వారే నడక నడచుచున్నారో దానిని అనుసరించే యితరుల నడక.

ధర్మమును నిలబెట్టే నిమిత్తమై వచ్చిన దేహము యిది కాబట్టి 24 గంటలూ కూడను, ప్రతి నిముషము, మీపై ప్రేమతో, యింకొకరి సహాయములేక నా దిన కృత్యములను, సర్వకార్యములనూ నిర్వర్తించుచున్నాను. మీ ఆనందమే నా ఆహారము.

## 10

### చమత్కారము..సాక్షాత్కారము

**ఆ నందబాలుడే ఆనందబాలుడై**
**తనవారి గుర్తింప తరలివచ్చె**
**ఆ రామచంద్రుడే ఆరామచంద్రుడై**
**తన బంటులను కనుగొనగ వచ్చె**
**ఆ మహా విష్ణువే ఈ మహీ విష్ణువై**
**తన ఆయుధమును చేగొనగవచ్చె**
**ఆ ఈశుడే బాలసాయీశుడై నేడు**
**తన గుంపుతో నాడుకొనగవచ్చె**
**అట్టి పరమాత్మయను బొమ్మలాటగాడు**
**తాను జీవుల రంగస్థలాన నిలచి**
**ఆడు ఆనాటి ఈనాటి యాటలరసి**
**సుంత వర్ణించి సంతసము కొంత గనుడు.**

భగవత్తత్త్వమునకు మానవులు యుగయుగములనుండి ఎన్నో మారు పేర్లు పెడుతూ వచ్చారు. దివ్యత్వమునకు అనిత్యమైన పేర్లు పెడితే సరియగునా? కొన్ని హద్దులను మీరి యోచించుటకు, వచించుటకు మానవులకు వీలుకాదు. స్వామి యొక్క ప్రేమ

తత్త్వమును గుర్తించిన వ్యక్తులకు మాత్రమే యిది సాధ్యము. నా దివ్యవిభూతులు సాధించినవి కావు. మధ్యలో చేరినవి కావు. మీరు కూడా ఈ దివ్యవిభూతులను గుర్తించుటకై యిచ్చటికి రాలేదు. దైవత్వమును ఆశ్రయించి, అనుభవించి, ఆనందించుటకై వచ్చినారని నాకు తెలుసు. దైవము దేశకాల పరిస్థితులను పురస్కరించుకొని విభూతులను చాటవలసి యున్నది. వాటికి అద్భుత కార్యములు, చమత్కారములు, మిరకిల్సు అని చెబుతూ వస్తుంటారు. అయితే చమత్కారము ఒక్కటే కాదు. చమత్కారము తరువాత రెండవది సంస్కారము. మూడవది పరోపకారము. నాల్గవది సాక్షాత్కారము. ఈ నాలుగు సోపానములున్నాయి భక్తరక్షణలో, ధర్మ స్థాపనలో.

చమత్కారమనగా రక్షించటమని మరొకరీతిగా చెప్పవచ్చును. రమయతి యితి రామః రాముడు కూడా ఆకర్షించినాడు. కర్షతి యితి కృష్ణః కృష్ణుడు కూడా చమత్కారముల వలన ఆకర్షించినాడు. ఆకర్షించేది దైవత్వము యొక్క మొదటి గుణము. దైవత్వము యొక్క సరైన లక్షణము.

ఆకర్షించేది దేనికోసం? ప్రజలను మోసగించుటకా? వారిని పెడమార్గము పట్టించుటకా? కాదు. కాదు. వారిని సంస్కరింపచేయుటకే. సంస్కారము యొక్క లక్ష్యమేమి? వారిని పరోపకారులుగా చేయుటకే. పరోపకార దీక్షతో వారు స్వార్థమును మరచి, అందరిలో నున్న ఏకత్వమును గుర్తించి, సాక్షాత్కారమును పొందుటయే పరమ లక్ష్యము. 'నకర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానసుః' త్యాగము వలనే, పరోపకారము వల్లనే అమృతత్వమనే మోక్షస్థితిని పొందుటకు సాధ్యమగును. సంస్కారము వలన మానవులు త్యాగబుద్ధిని అభివృద్ధి చేసుకొందురు. యావత్ప్రపంచమందలి మానవ జాతిపై విశాలమైన తన ప్రేమ తత్త్వమును వెదజల్లే దీక్షయే స్వామిది అని గుర్తించటం అత్యవసరం. ఈ నాలుగు సోపానములలోనూ అంతర్వాహినిగా ప్రవహించేది అట్టి ప్రేమ తత్వమే.

చమత్కారమనే మొదటి సోపానమును కొంత వరకు విచారిస్తాము. ఒక పుష్పము విషయమునే తీసుకోండి. దాని రూపము, సుగంధము ఆకర్షణీయముగా లేకుండిన ఎవరూ దానిని ఆశించరు. చేతితో పట్టుకొనరు. మార్కెట్టులో ఫలములను జోడించి పెట్టిననూ, అవి ఆకర్షణీయముగా లేకుండిన మనము వాటిని కొని అనుభవించుటకు వీలుకాదు. నిత్యజీవితమందు ప్రతి కృత్యమును పరీక్షించిన, ఆకర్షవంతమైన వాటినే అనుభవించుటకు మానవులు పూనుకుంటారనుట స్పష్టమగును. ఇది దివ్యత్వము యొక్క ప్రధాన గుణము. ప్రేమ ద్వారానే ఆకర్షణశక్తి లభించును. అన్యమార్గములో పరిశీలించిన యది అర్థమయ్యేది కాదు. దీని ద్వారా మిమ్ములను దగ్గర చేర్చుకొనేది పవిత్రమైన సంస్కారమునందించు నిమిత్తమే.

మానవునికి సంస్కారము వలన ఘనత అధికమగును. సంస్కారము లేని మానవుడు పశుసమానమే. అతనికి ఎట్టి విలువయూ ఉండదు. మీ చేతికి పెట్టుకున్న స్టీలు గడియారమున్నదే, దానిలోని స్టీలుకు రెండణాల విలువ ఉండదు. అయితే సంస్కారము వలన, అది నట్లు,బోల్టులు,స్ప్రింగులుగా మారి కాలప్రమాణము జరిగే క్రమములోనే అన్నింటినీ జోడించి సంస్కరించటము వలన, రెండణాల స్టీలు యిన్నూరు మున్నూరు రూపాయలు విలువగల గడియారముగా తయారైనది. అట్లనే, సామాన్య మానవుడు సదాచారము, సన్మార్గము, సత్ప్రవర్తనము, సచ్చింతనలు, సద్గుణములు అనే సంస్కరణ క్రియల వలన మహనీయుడుగా గొప్ప విలువైన స్థానము పొందగలుగుతాడు. కనుక పవిత్ర ప్రబోధలను వినటము, విశాలమైన ప్రేమ తత్త్వమును సాధించటము, సమాజ సేవ ఆచరించటము వలన, మానవుడు మహనీయుడుగా ప్రకాశించును.

దాని కొరకు నేను చమత్కారముల ద్వారా వారిని ఆకర్షించి సంస్కారముతో రూపొందింపచేసి, పరోపకార మార్గములో ప్రవేశింపచేస్తున్నాను. సమాజ సేవలో ఆసక్తి కలిగి హృదయపూర్వకముగా దానినాచరించినప్పుడు వారికి మానవ సోదరత్వము, దైవ పితృత్వము బోధపడి, అహంకార మమకారములు క్షీణించి, ఆధ్యాత్మిక మనోభావము అభివృద్ధియగుటకు ఎంతైనా అవకాశమేర్పడును.

దైవము యిట్టి విభూతులనే చేయవలయును, యిట్టివి చేయకూడదు అనే నిబంధనలు ఏమాత్రమూ లేవు. అణువు మొదలు ఘనము వరకు ఏమైనా చేయుటకు తనకధికారమున్నది. అది తన యిష్టముకానీ, పరులెవరికీ దానిలో ప్రవేశము లేదు. దైవత్వమును గుర్తించుటకు ప్రథమతః అధికారము అత్యవసరము. వైద్యమార్గమందు, రోగవిషయములను పరిశీలించి తగిన ఔషధోపచారములను నిర్ణయించుటకు డిగ్రీలు సంపాయించిన డాక్టర్లే అధికారులు. భవనములను లేక వంతెనలను కట్టుటకు యింజనీర్లే అధికార్లు. అధికారము లేనివారు దైవత్వమును విమర్శించిన అది హాస్యాస్పదమే యగును. రాముడు,కృష్ణుడు, క్రీస్తు అందరూ చమత్కారములు, అద్భుత కార్యములు చేసిరని వారి పవిత్ర చరిత్రలు తెలుపుచున్నవి. రాముడు తాను ధర్మ మార్గమందు ప్రవేశించి, అద్భుత

కార్యములచే, చమత్కారములచే దిగ్విజయము గావించుతూ వచ్చాడు. కోతులచే లంకకు వంతెన నిర్మించాడని భారతీయ చరిత్రనుంచి అర్థమగుచున్నది. ఆ దేశకాల పరిస్థితి పురస్కరించుకొని అట్టి చమత్కారము, అద్భుత కార్యము ఆకాలమునకు సత్యమైనది. కృష్ణుడు గాఢమైన వర్షధారనుంచి ప్రజలను కాపాడుటకు కొండనెత్తి మిరకిల్ జరిపాడు. అయితే కృష్ణుడు వంతెన కట్టలేదే కాబట్టి కృష్ణుడు అవతారపురుషుడు కాదు అని ఎవరూ విమర్శించరు.

శంకరాచార్యులవారు ఒక అబల యింటికి భిక్ష కొరకు వెళ్ళినప్పుడు, ఆమె తన దగ్గర ఏమియూ లేకపోవటము వలన ఒక ఉసిరికాయ యిచ్చినది. దీనిని చూచి జాలి కలిగి ఆచార్యులవారు ఆశ్చర్యకరముగా బంగారు ఉసిరికాయల వర్షమును కురిపించి ఆమె బీదరికమును అంతము గావించిరని ప్రాచీన గ్రంథములు ప్రబోధించుచూ వచ్చినవి. శంకర పీఠములవారు కూడా ఈ అద్భుతమును ప్రత్యేకముగా వ్యాఖ్యానము చేయుచూ శంకరులవారి దివ్యత్వమును చాటుతున్నారు. అయితే అట్టి వ్యక్తులే యీనాడు 'రాములవారు గడియారములు యీయలేదు, కృష్ణుడు గడియారములు యీయలేదు, శంకరులవారు గడియారములు యీయలేదు, సత్యసాయి గడియారములు యిస్తున్నారు. సత్యసాయి బంగారు ఉసిరికాయలు యియ్యలేదు. కాబట్టి, యిది దైవత్వము కాదంటారు. కృష్ణుడు ఉసిరికాయలు యియ్యలేదే. కాబట్టి కృష్ణునిలో దైవత్వము లేదా! ఇవన్నీ దేశకాల పరిస్థితులననుసరించి యున్నవని మీరు మరచిపోతారు. ఆనాడు గడియారములనవసరము. ఈనాడు కలియుగము లోపల గుమ్మడికాయలు, తోటకూరలను కూడా అడిగేవారున్నారు.

జీవుడే దేవుడనే సత్యమును పెక్కుమంది అంగీకరించక, విశ్వసించక జీవితమంతా దుఃఖముతో, అశాంతితో గడుపుచున్నారు. కొందరు, జీవించు మానవుడు దేవుడెట్లగునని ప్రశ్నించుతారు. ఐన శవము దేవుడగునా? జీవతత్వమే దైవతత్వము. ఇంకా కొంతమంది ' అతివృష్టి, భూకంపములు మొదలగు ప్రమాదములు జరుగుచున్నవే. ఈశ్వరుడుంటే యివన్నీ ఎట్లు జరుగును?' అని ప్రశ్నింతురు. ఇవన్నీ ప్రకృతియొక్క సహజ లక్షణములే. భక్తి ప్రపత్తుల ద్వారా వాటినుండి కూడా నివారణ పొందుటకు వీలుంది. ఇట్టి అవాంతరములు ఎందుకు సంభవించునని అడిగే వ్యక్తులు, మానవులలో యిట్టి బుద్ధులు ఎందుకు రావాలని ఎందుకు ప్రశ్నించకూడదు? వారి వారి ప్రారబ్ధమును పురస్కరించుకొని వచ్చే కష్టనష్టాలను భగవదనుగ్రహముతో నివారణ చేయవచ్చు. దీనికి ఏమాత్రమూ సందేహము లేదు. సాయిబాబా ఎందుకు యిట్టి ప్రమాదముల రాకుండా చేయకూడదు అని అడిగే వాళ్ళను వారు ఆరాధించే, అనుసరించే నిరాకారసాకార దైవములు ఎందుచేత నిరోధించలేదని ప్రశ్నించండి. అవన్నీ ప్రకృతి సహజమైనవి. ఇట్టి సందేహములు అర్థములేనివి. దీనికి జవాబిచ్చుట వ్యర్థము.

సత్యసాయి యొక్క విభూతులన్నీ ప్రదర్శనములు కావు. దైవత్వమునకు నిదర్శనములే. ఆధ్యాత్మికరీతిగా విచారించినప్పుడు, జరుగుచున్నది సత్యసాయి పరిశోధన కాదు, భక్తుల పరీక్షయే. గాలిలో ధాన్యమును తూరుపారపట్టి తరువాత గట్టి గింజలను మాత్రము రైతులు యింటికి తెస్తారు కదా! అట్లనే నిరీశ్వర వాదము అనే గాలిలో యిప్పుడిదొక పరీక్ష. రామావతారమందు మహా శక్తివంతులైన అగస్త్యమహర్షి, విశ్వామిత్ర మహర్షి, వశిష్ఠ, వామదేవ, భారద్వాజ మహర్షులుండిననూ ఒక రాములవారి విషయమునందే తర్కవితర్కములేర్పడినవి. ఒక రామ తత్వమును మాత్రమే పరిశోధించుటకు పూనుకున్నారు. కృష్ణావతార కాలమందు కూడా మహా శక్తివంతులు లేకపోలేదు. అయిననూ, ఒక కృష్ణతత్వమును మాత్రమే అవకాశవాదులు, అవిశ్వాస పీడితులు పరిశోధించుటకు ప్రయత్నించిరి. ఇప్పుడు కూడా అంతే. ఎవరి దగ్గర పోయిననూ, ముందు సాయిబాబాను చూచుకొని తరువాత రండి అని చెబుతున్నారు. దీనిని గమనించిన సాయీతత్వము దైవత్వమనేది సత్యము అని సులభముగా తేలును.

**భుక్తి విద్యలన్ని భక్తితో చదివేరు**
**ముక్తి చదువుకెవరు ముందు రారు**
**ఇట్టివారు నన్ను ఎరుగంగ నేర్తురా**
**ఎట్టివిద్యలుండి ఏమి ఫలము.**

నిజముగా దైవత్వమును గుర్తించుటకు పూనుకొన్న మానవుల బుద్ధి అనేకమార్గములలో ప్రవేశించును. ఆత్మయే మానవుని నిజసత్యము అనే మార్గమునాశ్రయించక, అన్యమార్గము ననుసరించితే లాభము లేదు. మీ మీ విశ్వాసములపైనే మీరు ఆధారపడాలి. పరుల విశ్వాసమును ఆధారముగా స్వీకరించకూడదు. ఇతరులు నమ్మినా నమ్మకపోయినా మీ విశ్వాసముపై మీరు ఆధారపడి విశాల ప్రేమ, సర్వసమానసేవాబుద్ధి అభివృద్ధి పర్చుకోండి. సాయీతత్వమును బాహ్యదృష్టితో చూచి, సాయి యిట్టివాడు, అట్టివాడు అని

అంటున్నారు. వీరు సాయిలోని పవిత్రతను, యదార్ధమును, నిత్యసత్యమును ఏమాత్రమూ గుర్తించలేకున్నారు. సాయి శక్తి అపారము, అనంతము. సర్వశక్తులూ సాయి హస్తగతమై ఉన్నవి. విద్యావంతులు, పండితులు కొందరు బాహ్యదృష్టి కలిగినవారైనందున, వారు కేవలము పైకి కనిపించే యీ మహిమలు మాత్రమే చూచి, వారివారి భావములకు తోచినట్లుగా పలుకుచున్నారుగానీ లోపలి సత్యమును చూడలేకున్నారు. మేమే విద్యావంతులనే గర్వము, అంతా తమకే తెలుసుననే అహంకారము వారి బుఱ్ఱలలో నిండియుండగా వీరు బృందావనములోని సాయిని గుర్తించలేకున్నారు.

నా శక్తులకు హద్దులు లేవు. నా తత్వమునకేమాత్రమూ నియమము లేదు. అనంతశక్తి, అనంత వ్యక్తిత్వము నా చేతులందున్నవి. దీనిని గురించి నేను నేనుగా చెప్పవలసి వచ్చినది కనుక చెప్పుచున్నాను. ఏమీ తెలియని వానికి ఏమి చెప్పినా అర్థము కాదు. తెలిసినవారికి చెప్పనవసరములేదు. తెలిసీ తెలియని వారికి నా మహిమలనే విజిటింగ్ కార్డునివ్వక తప్పదు.

కృష్ణావతారము ఒక్కటే దైవత్వమును ప్రకటించగలిగినది. కానీ ఆ అవతారమునకు ఒక్కొక్క పర్యాయము అపజయమనేది కలిగినట్లుగా మనకు తెలుసు. అది లోకమునకు చూపించుటకు ఆడిన నాటకమేగానీ వేరుకాదు. అనేకమంది రాజులు కృష్ణుని సమీపించి కురుపాండవ యుద్ధము నివారింపమని అభ్యర్థించగా, తన ప్రయత్నములన్నీ విఫలమైనవని కృష్ణుడు వారితో చెప్పినాడు. దీనినిబట్టి కృష్ణునికి యుద్ధము నివారించే శక్తి లేదని అర్థము చేసుకొనకూడదు. దుష్ట శిక్షణ కొరకు ఆడిన నాటకమిది. రాయబారమునకు వెళ్ళటము, కౌరవులు తన మాట కాదనటము, అంతా ఒక ప్రణాళిక ప్రకారము జరిగినట్టిదే. దేశకాల పాత్రలననుసరించి దైవము యిటువంటి నాటకములు అప్పుడప్పుడు ఆడవలసి వస్తుంది.

కానీ ఈ సాయీ అవతారములో యిటువంటి నాటకములకు స్థానమే లేదు. పరాజయములకు అసలే స్థానము లేదు. నేను ఏది సంకల్పించిన అది జరిగి తీరుతుంది. కానీ సంకల్పించటము నాకనవసరము. ఈ సంకల్పమనేది భక్తుని యొక్క శ్రద్ధపైన, అభీష్టము పైన ఆధారపడి ఉంటుంది. ఒకవిధముగా నేను భక్త పరాధీనుడను. సామాన్య మానవుని రూపముతో మీతో కలసి మెలసి సంచరించుతూ ఆడుతూ పాడుతూ ఉన్నప్పటికీ, మేధావంతులు, శక్తివంతులు కూడా నా శక్తిని అర్థము చేసుకోలేరు. మానవత్వమును ఏకత్వపరచి , ఆత్మతత్వమును నిరూపించి, దైవత్వ స్థానములో చేర్చటమే నా లక్ష్యము. పరస్పరము మానవులకున్న సంబంధబాంధవ్యములను ప్రచారము చేయుట కూడా నా విధి. మానవత్వములో దైవత్వము అంతర్భూతమై ప్రకటింపబడుచున్నదని అనుభవ రీతిగా అందించుట కూడా నా కర్తవ్యములలో ఒకటి. పాండిత్యము ప్రకటించినంతనే గొప్పకాదు. ప్రకటించనంత మాత్రమున అది తక్కువ కాదు. ఎంతటి కష్టమైన, క్లిష్టమైన సమస్యలనైనా క్షణములో నేను నివారించగలను.

దివ్యత్వాన్ని, పవిత్రతను, ఏకాత్మ తత్వాన్ని అందరికీ ప్రకటింపచేయటం కోసమే అవతారాలు వస్తుంటాయి. దైవం ప్రేమ స్వరూపం. మీ ప్రేమను యేవిధంగా వెల్లడి చేయాలో, యేవిధంగా పంచుకోవాలో, ఏవిధంగా అనుభవించాలో నిరూపించే నిమిత్తమే స్వామి దేహాన్ని ధరిస్తున్నారు. ఈ ప్రేమ స్వార్థరహితమైనది.

నేను ఆదర్శమానవుడను, ఆదర్శపురుషుడను, ఆదర్శశక్తిని, ఆనంద స్వరూపుడను. నేను అన్నింటికీ సంతోషం, సంతోషం..అంటాను. ఎవరైనా వచ్చి,'స్వామీ! నాకు కడుపు నొప్పిగా ఉంది' అంటారు. 'చాలా సంతోషం' అంటాను. మరొకరు వచ్చి,'స్వామీ! నా బిడ్డ చనిపోయినాడు' అంటాడు. 'సంతోషం' అంటాను. 'మా నాన్నగారు పోయినారు' అంటారు. 'చాలా సంతోషం' అంటాను. అన్నింటికీ సంతోషమే. నా నోటికి ఎప్పుడూ అదే పదము వస్తుంది. నేనెప్పుడూ ఆనందంగానే ఉంటాను. కనుక, నా నోటికి వచ్చే పదములన్నీ అలాగే ఉంటాయి. నా మాటలను అందరూ అర్థం చేసుకోలేరు.

ఒకనాడు ఒకామె ఏడ్చుకుంటూ వచ్చింది. 'ఏమమ్మా ఎందుకోసం ఏడుస్తున్నావు?' అని అడిగాను. 'స్వామీ! నా భర్త పోయాడు' అంది. 'చాలా సంతోషం' అన్నాను. ఆమెకు కోపం వచ్చింది. 'ఏమి స్వామీ! నా భర్త చనిపోతే మీకు ఆనందంగా ఉందా?' అంది. నేను చెప్పాను 'నేనెప్పుడూ దేనికీ విచారించను. నిరంతరం ఆనందంగానే ఉంటాను. కనుక, నీకుకూడా అదే మాట చెప్పానమ్మా. ఆనందము నా స్వరూపం. ఆనందము నా స్వభావం.' ఎలాంటి పరిస్థితిలోనైనా నా స్వభావం మారదు. నా ఆనందాన్ని చూసి అనేకమంది అసూయపడుతుంటారు. 'సాయిబాబాకు అంత పెద్ద బాధ్యత ఉన్నదే! అనేక ఆసుపత్రులు కట్టాడు, విద్యాసంస్థలు పెట్టాడు. కానీ, ఒక్కనాడైనా దేనికీ చింత చేయటంలేదే! ఎప్పుడు చూసినా ఆనందంగా ఉంటాడే!' అని అనుకుంటారు. ఎందుకు నేను చింతించాలి? నా సంకల్పముతో జరగవలసినవి జరుగుతుంటాయి. కనుక, నాకు చింత అనేదే లేదు. ఎప్పుడూ లేదు. ఎప్పుడూ రాదు.

నేనెప్పుడూ ఆనందంగానే ఉంటాను. ఎవరైనా వచ్చి బాధపడితే వారిని చూసి నేనుకూడా విచారంగా ఉన్నట్లు కనిపించటానికి ఎంతో ప్రయత్నం చేస్తాను. కానీ, నాకది సాధ్యం కావటం లేదు. విచారాన్ని యెట్లా చూపించేది? నాకు నవ్వొస్తుంది. కల్పితమైనది నా చేతకాదు. నా దంతా సహజమే. కనుకనే , నేనెప్పుడూ సహజంగా ఆనందంగా ఉంటాను. నాకు ఎంతో డబ్బు కావాలి, ఎన్నో పనులు చేయాలి, కోట్లు ఖర్చు పెట్టాలి. కానీ, దేనికీ విచారించటం లేదు. ఎందుకంటే, అది జరగాలి అని నా ప్లానులో ఉన్నప్పుడు తప్పక జరిగే తీరుతుంది. ఇంతమంది ఇక్కడికి వస్తున్నారు. నేనెప్పుడూ ఎవరినీ యేదీ అడగలేదు. అడిగేవాడు దైవం కానేకాడు. నేను ఎవరినీ అడగకుండానే అన్నీ జరిగిపోతుంటాయి, నేను సంకల్పించుకున్నటువంటి పనులన్నీ నెరవేరుతుంటాయి. నాకు ఏవిధమైన ఆశలూ లేవు. నాకున్నది ఒకేఒక ఆశ. .. 'సర్వేజనాః సుఖినో భవంతు.' అందరూ సుఖంగా ఉండాలి. 'నాకు యిది కావాలి, అది కావాలి ' అని నేనెన్నడూ ఆశించను. ఆశలున్న వానికే దుఃఖము, విచారము. నేను యేదైనా జరగాలని సంకల్పించుకుంటే అది తక్షణం జరిగి పోతుంది. కనుక, నేను దేనికీ విచారించవలసిన పని లేదు.

నా శక్తులనేవి ఏనుగు ప్రమాణము కలిగి ఉంటే ఈ మహిమలనేవి దోమ ప్రమాణము కలిగి ఉన్నవి. నా శక్తిని అర్థము చేసుకొనలేక, నా మహిమలకు ప్రాధాన్యమిస్తున్నందుకు నాలో నేను నవ్వుకుంటున్నాను. ఇది నేను ఎవ్వరికీ చెప్పను. నాలో ఉన్నట్టిది ఎటువంటి కొలతలకు అందనిది. ప్రమాణములకు అతీతమైనది. పరిశోధనలకు గురికానట్టిది. ప్రేమ ఒక్కటే. అది యింత అంత అని ఎవ్వరూ చెప్పలేరు. ఈ ప్రేమ తత్వము గుర్తించి, అనుభవించిన వారు మాత్రమే నన్ను కొంత వరకు తెలుసుకొనగలరు.

ప్రేమ అనే మకరందము పరమాత్మ పాదపద్మములందు మాత్రమే దొరుకుతుంది. కమలము బురదలో పుట్టి నీటిలో పెరుగుతుంది. కానీ కమలము యీ రెండింటికీ అతీతంగా ఉంటుంది. దీనికి బురద అంటదు. నీరొక క్షణము లేకున్న కమలము వాడిపోతుంది. కానీ నీటిని తనలోనికి రానివ్వకుండా బ్రతుకుతుంది. జన్మాంతరమనే బురదలో పుట్టి, సంసారమనే జలములో నివసించుతూ ఉన్నప్పటికీ యీ బురదను అంటుకొనక, ఈ నీటిని చేర్చుకొనక ఉండటమే దైవత్వము యొక్కచిహ్నము.

భగవంతుని అన్ని అంగములూ పద్మములే. ముఖ పద్మము, నయన పద్మములు, హృదయ పద్మము మొదలైనవి. అందుచేత భగవంతుడు ఏది చేసినా విషయ వాసన అనే మాలిన్యము దాని కంటదు. దోషరహితమైన దృష్టి, విశాల హృదయము దైవత్వ చిహ్నములు. చేతులకంటుకొనిన జిడ్డు కడుగుకొనినగానీ పోదు, ఎంతటి జిడ్డు పదార్థములు భుజించినప్పటికీ నాలుకకు జిడ్డు అంటదు. అందుచేతనే పరమాత్మ నామమును చింతించుటకు నాలుక కొక్క దానికే అధికారమున్నది. అట్లే కన్నులకు కాటుక అంటదు.

భగవంతుని దృష్టి పవిత్రమైనదిగా ఉంటుంది. జ్ఞానమునకు దృష్టి అని కూడా అర్థము ఉన్నది. 'అద్వైత దర్శనం జ్ఞానం' అని కాబట్టి దృష్టి జ్ఞానమయమైనదని చెప్పక తప్పదు. ఇది మరొక పాఠము చెప్పుచున్నది. ఎవరైనా ఎదుట నిలబడితే వారి ప్రతిబింబము మన కన్నులలో, మన ప్రతిబింబము వారి కన్నులలో చూడగలుగుతాము. అనగా యిక్కడ నేత్రము అద్దము వలె ఉన్నది. అదేవిధముగా భగవంతుని దర్శించుటకు జ్ఞాననేత్రమును సంపాదించుకొనవలెను. జ్ఞాన చక్షువుతో చూచినప్పుడే సత్యస్వరూపమును గుర్తించుటకు మీకు వీలవుతుంది.

స్వామి అనుగ్రహము చిక్కినప్పుడు మీకు అనంతమైన జగత్తే లభిస్తుంది. పైపై విషయముల మీదికి బుద్ధిని మరలించ వద్దు. అట్టివారు నాస్తికులుగా మారగలరు. అమూల్యమైన వజ్రమును నేనుండగా తుచ్ఛమైనట్టి, అశాశ్వతమైనట్టివాటికొరకు ఎందుకు ప్రాకులాడుతారు? మీరు నన్నే కోరండి. ప్రేమతో, భక్తితో కోరినట్టైన నేను తప్పక లభించుతాను. స్వామి అనుగ్రహించి యిచ్చిన దానిని పుచ్చుకోటములో దోషము లేదు. అది అవసరముకూడా. నా దివ్యత్వములోని విషయములు కొన్ని మీకు చెప్పవలెననుకుంటున్నాను. అప్పుడప్పుడు నా దర్శనము కొరకు వచ్చిన భక్తుల యొక్క మంచి చెడ్డలు విచారించి, వారికి నా మాటలతో శాంతిని అందించుతాను. దీనితోపాటు, ఉంగరములని, లాకెట్లని, పూసలదండలని ఎన్నో వారికి యిస్తుంటాను. ఇవన్నీ నేను మీ వెంబడి ఉన్నాననే దానికి గుర్తులు మాత్రమే. దీని విలువను మీరు మదింపు చేయరాదు. ఇవి లేకున్నా, నేను మీ వెంట, జంట ఉన్నాను. అయితే వీటి ప్రయోజనమేమిటని మీరు అడగవచ్చు. ఇవి ఒకవిధముగా, మీకేదైనా ఆపద కల్గినప్పుడు యీ చిహ్నములు తక్షణమే వాటిని నా దృష్టికి తీసుకువస్తవి. నేను వెంటనే మీ ఆపదలు నివారించుతాను. వీటిలోని రహస్యమిదే. మీకూ నాకూ మధ్య ఇవి ఒకవిధమైన లింకు వంటివి. ఈ రక్షలు అనేక లక్షలమందిని రక్షించుచున్నవి.

అయితే ఈ చిన్నచిన్న కార్యములు చేయటానికి కాదు నేనవతరించినది. ఎన్నో మహత్తర కార్యములు నిర్వహించటానికి,

మానవలోకాన్ని ఉద్ధరించటానికి, మానవులందరిని సత్యధర్మశాంతిప్రేమ మార్గములో నడిపించి వారిని గమ్యస్థానము చేర్పించటానికి వచ్చినాను. ఈ నిర్వహణలో నేనెవరికీ బెదరను. బెదరవలసిన అవసరము లేదు. సర్వమూ సత్యము మీద ఆధారపడి ఉన్నందున, నేను సత్యస్వరూపుడను కనుక నేనెవ్వరికీ లొంగను. సాయిబాబా అనగా దైవిక మాతాపితరులని అర్థము. నాయందు తల్లి గుణములు, తండ్రి గుణములు రెండూ ఉన్నవి. ఈ రెండు స్వభావములు నాయందున్నందున ఇది శివశక్తి స్వరూపము. నేను తల్లివలె లాలించుతాను. తండ్రివలె అదలించి, బెదరించి, దండించి, శిక్షించి సరైన ఉన్నత స్థాయికి తీసుకు వెడతాను. లౌకిక తల్లిదండ్రులకు కొంతైనా స్వార్థముండవచ్చు. తమ బిడ్డలు పెద్దవారై తమకు అండగా ఉంటారనో, సహాయకులుగా ఉంటారనోఅనుకోవచ్చు. కానీ ఈ సాయికి అటువంటి స్వార్థమేమీ లేదు. మీకేదైనా శిక్ష విధించినట్లైన, ఆ శిక్షను రక్షగా భావించండి. ఆరోగ్యవంతుడైన బిడ్డకు తల్లి అన్ని పదార్థములను పెట్టితినిపించుతుంది. రోగిగా ఉన్న బిడ్డకు చేదుగా ఉన్న మందును రోగము పోగొట్టుకొనుటకుగాను యిస్తుంది. అనగా తల్లికి ఎవరికేమి పెట్టవలెనో, అదే పెట్టుట తెలియును. తల్లికి బిడ్డలందరూ సమానమే. వారిని సమానముగానే ప్రేమించుతుంది. నా తత్వముకూడా అదే. దానిని మీరు అర్థము చేసుకొనండి.

పకృతి మాయలచేత బంధింపబడుటచే
నేనె బ్రహ్మంబను నెరుక పోయె

**పంచేంద్రియంబుల వంచింపబడుటచే**
**జీవుడే దేవుడను తెలివిపోయె**
**మమతాద్యహంకార మాయల్ బడుటచే**
**ఏకత్వభావంబు లేకపోయె**
**దేహాభిమానంపు మోహాన బడుటచే**
**ఆత్మదర్శనముపై నాశపోయె**
**బ్రహ్మలో నీవు నీలోన బ్రహ్మయుండ**
**నీకు బ్రహ్మకు భేదము లేకపోయె**
**నేనె బ్రహ్మమనుటను నిప్పుడెరుగు**
**సాయి ప్రేమబోధ గ్రోల హాయిమీర.**

నేను ఎప్పటికప్పుడు ఎదురుగానున్న వ్యక్తులను చూసి, ఆ సందర్భాన్ని, వారి ఆశయాలను పురస్కరించుకొని మాట్లాడుతూ ఉంటాను. నా మాటలు అద్వైతంతో కూడి ఉంటాయి. నేను గురువు, మీరు శిష్యులనికానీ, నేను భగవంతుడు మీరు, భక్తులనిగానీ నేను చెప్పను. ఎందుకంటే నాకుమీకు యే భేదము రాకూడదు. నేనే నువ్వు, నువ్వే నేను. మీకు నాకు భేదమే లేదు. ఎందుకంటే మరొకటి లేదిక్కడ. 'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ' ఉన్నది ఒక్కటే. ఎన్నివిధాల చెప్పినా అక్కడికే వచ్చి చేరాలి. అదే నీ నిజతత్వము, అదే నా నిజస్వరూపము. నన్ను గురువని మీరు భావించిన 'దాసత్వము' వలన మీరు దూరమైపోతారు. భక్తితో దైవమని పూజించిననూ భేదభావము బలపడును. ఆత్మ పరమాత్మ రెండింటికి అవినాభావ సంబంధమేగానీ భేదముండదు. నీపై నీకు తృప్తి యేర్పడినచాలు, నాకు నీపై తృప్తి యేర్పడినట్లే. ఎందుకనగా యిద్దరూ ఒకరే. ఆత్మ పరమాత్మ వేరువేరనే అజ్ఞానమును, దేహము ఆత్మ ఒక్కటనే అజ్ఞానమును దూరముచేయు ప్రయత్నమునకు మీరు పూనుకొనవలెను. ప్రాపంచికమైన దాని విషయంలో పరిశీలన చేసినప్పుడు దానికి ఒక కర్త, కర్మ, క్రియ అంటూ మూడు ఉంటాయి. నాకు మాత్రం యిక్కడ కర్త, కర్మ, క్రియ మూడూ ఒక్కటే.

## సంపూర్ణ శరణాగతి

చెంత చేర్చెననుచు సంతసించెదరన్న
వెంటనే ఎడబాసి చింతగూర్చు
ఏడిపించుట సాయి వేడుక యందురా
కడుపుబ్బ నవ్వించు నడుమ నడుమ
పొగడుచున్నాడని పొంగిపోయెదరేమొ
తప్పకప్పుడె ఎగతాళి చేయు
అభయమిచ్చెనుగాన హాయినుండెదరన్న
పడు బాధలకు అంతుబట్టకుండు
వెనుకకేగనీడు చననీడు ముందుకు
మనసు మరులుగొల్పి మథనపెట్టు
ఇట్టి చిన్ని సాయి చిన్మయమూర్తిని
ఎట్టులెరుగగలరు యిలను మీరు!

భగవంతుడు చేయవలసిన పని ఇదని, అదని నిర్ణయించటానికి ఎవ్వరికీ అధికారము లేదు. 'భగవంతుడైతే యీ పని చేస్తాడా? ఈవిధంగా చేస్తాడా?' అని అనేకమంది అనుకుంటారు. సర్వమూ తానైనవాడు చేయరాని పని ఏమిటి! చేయవలసిన పని ఏమిటి! తాను ఏ పనైనా చేయవచ్చు. ఏ ప్రదేశమైనా వెళ్లవచ్చు. భగవంతుడు సర్వత్రా సర్వులయందు ఉండటంచేత అతను ఏమైనా చేయవచ్చు. భగవంతుడు యిది చేస్తాడా, అది చేస్తాడా, యిట్లా ఉంటాడా అని విమర్శించే అధికారము ఎవ్వరికీ లేదు. భగవంతుడు ఏమైనా చేయవచ్చు. కన్నీరు తుడువవచ్చు, కన్నీరు తెప్పించనూ వచ్చు, యోగిని భోగి చేయవచ్చు, భోగిని యోగి చేయవచ్చు. పిచ్చిని పోగొట్టవచ్చు, పిచ్చిని పట్టించనూ వచ్చు. ఏవిధమైన సంకల్పముచేత ఏవ్యక్తిని ఎక్కడ ఎట్లా రక్షించాలనేది దైవానికి తెలుసు. దైవం యిదే చేయాలని నిర్ణయించే అధికారం ఎవ్వరికీ లేదు. ఎందుకనగా, భగవంతునికి స్వార్థమే లేదు. స్వార్థములేని భగవంతుడు ఏమిచేసినా పవిత్రమే. ఒకరిని తిట్టినా పవిత్రమే, కొట్టినా పవిత్రమే, ఆదరించినా పవిత్రమే, ఆనందింపచేసినా పవిత్రమే. 'స్వామి దేవుడంటారే! ఇది దేవుడు చేయవలసిన పనేనా!' అని కొందరు అనేకరకములైన అపోహలకు గురౌతుంటారు. దేవుడు ఫలానా పని చేయాలని, ఫలానా పని చేయకూడదని నిర్ణయించటానికి నీవెవరు? భగవంతుడు ఏపనైనా చేయవచ్చు. ఎవరినైనా రక్షించవచ్చు. ఎవరినైనా శిక్షించవచ్చు. ఎవరినైనా పోషించవచ్చు.

**యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత**
**అభ్యుత్థాన మధర్మస్య తదత్మానం సృజామ్యహం.**

సత్యాన్ని, ధర్మాన్ని కాపాడాలి. అసత్యాన్ని, అధర్మాన్ని నాశనంచేయాలి. ఇదే భగవంతుడు చేసే పని.నేను సంపూర్ణంగా శరణాగతుడనైనా నన్నెందుకింత బాధ పెడుతున్నాడు, ఎందుకింత అవస్థలపాలు చేస్తున్నాడని కొందరు భావిస్తుంటారు. నిజంగా శరణాగతుడైనవానికి యీ ప్రశ్నలు రానేరావు. శరణాగతుడైన తరువాత 'నన్ను' బాధిస్తున్నాడనే భావం వస్తే యింక శరణాగతి ఎక్కడుంది? శరణాగతి చేయని వాడే యిలాంటి బాధలకు గురయ్యేది. శరణాగతుడైన వానికి అన్నీ భగవంతుని ప్రసాదములే. మీరు మీ కోరికలను , ఇష్టాయిష్టములను , వ్యామోహములను దైవానికి అప్పగిస్తే అతడే సరైన త్రోవలో నడిపించి సుఖశాంతులు ప్రసాదిస్తాడు. క్షణికమైన సుఖములవెంట, రకరకాల కోరికల వెంట పరుగెత్తకూడదు. అన్నీ దైవానికే వదలిపెట్టి ఏమి జరిగినా దైవసంకల్పముగానే భావించాలి.

అంబరీష మహారాజు వేదవిహితములైన సకల కర్మములను ఆచరించేవాడు. అతడు ధర్మాత్ముడు. సృష్టి, స్థితులకు అధిపతియైన విష్ణురూపమును భక్తితో ఆరాధించువాడు. ప్రతి మాసపక్షమందూ ఏకాదశి దినమున ఉపవాసము చేసి ద్వాదశతిథి ప్రవేశించిన పిదప విష్ణుపూజచేసి ఆహారము విష్ణువునకు నైవేద్యము పెట్టి ఆ ప్రసాదమును భుజించువాడు. ఒక పర్యాయము మహాకోపి, ఆవేశపరుదు

అయిన దూర్వాస మహర్షి ద్వాదశఘడియలు ప్రవేశించకపూర్వమే అంబరీషుని రాజభవనమునకు వచ్చెను. అంబరీషుడు అతనిని సగౌరవముగా ఆహ్వానించి, గంగానదికి వెళ్ళి కాలకృత్యములు గావించుకొని ఉపవాసదీక్ష ముగించుటకు సకాలములో రమ్మని ప్రార్థించెను. ద్వాదశఘడియలు ప్రవేశించిననూ దూర్వాసుని జాడ కానరాలేదు. అంబరీషుడు సందిగ్ధములో పడి రాజగురువును సంప్రదించెను. రాజగురువు అంబరీషునితో కొద్ది చుక్కలు పవిత్ర జలమును తీసుకొని దానితో ఉపవాసదీక్ష ముగించవచ్చునని చెప్పెను. దూర్వాసుడు తిరిగివచ్చి, అతిథి మర్యాద పాటించక, తానురాకపూర్వమే ఉపవాసదీక్షను ముగించిన అంబరీషునిపై ఉగ్రుడై శపించెను. అంతలో విష్ణువుయొక్క చక్రము ప్రత్యక్షమై దూర్వాసుని భయభ్రాంతుని చేసి ముల్లోకములు వెంటాడెను.

శాపగ్రస్తుడైన అంబరీషుడు, తన రక్షణకై విష్ణువును ప్రార్థించలేదు. శాపముకూడా దైవసంకల్పమనే భావముతో అనుభవించెను. చివరకు దూర్వాసుడు తనను రక్షించమని విష్ణువు పాదములపై పడెను. అప్పుడు విష్ణువు దూర్వాసునితో అంబరీషుడే రక్షించగలడని అతని వద్దకే వెళ్ళమనెను. ఆత్మనివేదనమనే శరణాగత తత్త్వము వ్యక్తిని సంపూర్ణముగా భగవత్పాదములకంకితమగునట్లు చేయును.

రామాయణములో కూడా యిటువంటి దృష్టాంతరమున్నది. రామలక్ష్మణులు సీతాన్వేషణలో అడవులన్నీ గాలిస్తున్నారు. వారు అలసి దప్పికగొన్నారు. ఒక స్వచ్ఛమైన నీటికొలను కనబడింది. వారి ధనుస్సులు గట్టున పెట్టుకున్నారు. చేతనున్న బాణములను మాత్రము నీటితో తడిసిన నేలను గ్రుచ్చిరి. దాహము తీర్చుకున్న తర్వాత నేలను గ్రుచ్చిన బాణములను పైకి లాగుకొనిరి. అంత, తన బాణము చివర ఒక రక్తపు మరక రాముని కంటబడెను. రక్తము ఎక్కడనుండి వచ్చెనాయని రాముడు విస్తుపోతున్నంతలో లక్ష్మణుడు రాముని బాణము నేలను గ్రుచ్చగా గాయపడిన ఒక కప్పను చూచెను. శ్రీరాముడు కప్పతో 'అయ్యో పాపం! బాణం గ్రుచ్చుకున్నప్పుడు నీవెందుకు అరవలేదు?' అని అడిగెను. 'నాకేదైనా కష్టం కలిగితే రామా అంటూ మొర పెట్టుకుంటాను. ఆ రాముడే నన్ను బాధ పెడితే యింకెవరితో మొర పెట్టుకోగలను? అందువలన యిదీ అతని ప్రసాదముగానే భావించి ఊరుకుంటిని' అని సమాధానము చెప్పెను.

భీష్ముడు కూడా, తన ప్రాణము తీయుటకు చక్రాయుధము ధరించి తనవైపు పరుగెడుతూ వస్తున్న కృష్ణుని చూచి భక్తితో స్తుతించెను. ఎవరిని తాను దైవముగా ఆరాధించెనో అట్టివాని చేతుల్లో ప్రాణముపోవు స్థితి వచ్చిననూ అచంచలమైన తన శరణాగతి భావమును అతడు విడనాడలేదు. ' నీవు చంపినా, రక్షించినా సరే, నా ప్రభుభక్తిని నేను విడువను' అన్నాడు భీష్ముడు.

రామకృష్ణునికి కూడా అదేవిధమైన సంపూర్ణ శరణాగతి భావము ఉండేది. అతడు క్యాన్సరు వ్యాధితో బాధపడుతున్నప్పుడు శిష్యులందరూ తన బాధ నివారణకై కాళీమాతను ప్రార్థించమనిరి. మాతతో మాట్లాడగల సన్నిహిత భక్తుడైనప్పటికీ తమ గురువు యింత చిన్న కోరికను కూడా కోరకపోవుట చూచి వివేకానందుడు నిరాశ చెందెను. "ఈవిధముగా నేను బాధపడుట అమ్మ సంకల్పమే అయితే నేను యీ బాధను నివారించమని ఎలా అడగను?" అన్నాడు రామకృష్ణుడు. అతడు తన భావములను నిరంతరమూ 'మన్మనాభవ మద్భక్తో...' అను గీతా శ్లోకమునననుసరించియే మసలుకొనేవాడు. అతని శిష్యులు మాత్రం మొండిగా పట్టుపట్టారు. వారి పోరు పడలేక రామకృష్ణుడు కేన్సరుతో వాచిన గొంతుక ద్వారా యించుక ఆహారము తీసుకోగలిగేటట్లు సహాయము చేయమని మాతను ప్రార్థించాడు. తరువాత రామకృష్ణుడు శిష్యులతో తాను మాతను ప్రార్థించగా మాత తనయొక్క అజ్ఞానమును మందలిస్తూ 'ఇన్ని కోట్ల గొంతుకలతో భుజిస్తున్న నీకు ఒక్క గొంతుకతో ఆహారము తీసుకోలేకపోతే వచ్చిన నష్టము ఏమిటి?' అని అడిగెను.

ప్రశాంతినిలయము

ప్రవహించునేపురి పరిధిగా పాయలై
చిత్రావతీ నది చిత్రగతుల
క్రాలునీ పట్టణ కళ్యాణకరముగా
చుట్టును మేలైన చూత తరువు
కాన్పించు నేపురి కదలి వంశమునందు
పార్వతీశ్వరుడెప్డు బాయకుండు
కొలువుండు నేపురి విలసింతబగు మధ్య
మహిమాన్వితుండైన సాయివిభుడు
మండలావని గణుతించు మెందు మహిమ
చిక్కవడియలు కట్టిన చెఱువు తోడ
బుక్కరాయల చిరకీర్తి భువనమెంచ
పొసగ చాటునే పురము పుట్టపురము
వసుధ చాటునే పురము పుట్టపురము.

షిరిడీ క్షేత్రము గోదావరీ తీరము. గోదావరి, పెన్న రెండూ చేరిపోతాయి. పుట్టపర్తి చిత్రావతీ తీరము. చిత్రావతి కేవలము వంటరిగా వచ్చినది కాదు. చిత్రావతి, కుశావతి రెండూ కూడ యిక్కడ చేరిపోతున్నాయి. రాబోయే ప్రేమసాయి కూడా మైసూరు స్టేటులో పర్తే. తుంగభద్రా తీరము. అక్కడ ఎట్లా ఉంటుందంటే తుంగ ఒకవైపునుంచి ప్రవహించి వస్తుంది. భద్ర యింకొక వైపునుంచి వస్తుంది. దీనిని సంగమము అంటారు. ఇలాంటి ప్రదేశాలు దివ్యక్షేత్రాలుగా మారతాయి.

జగత్తు వేరు, పరబ్రహ్మము వేరు అనేది లేదు. పరబ్రహ్మ స్వరూపము తెలుసుకుంటే ప్రకృతి కనిపించదు. నేను సత్యసాయిబాబాను కాను. అది నాపేరు కాదు. ఏ పేరు పెట్టినా అది నాదే. మీ పుట్టిన దినమే నా పుట్టిన దినము కూడ. సర్వభూతాంతరాత్మ అంటే అదే అర్థము. తనది కాని దేహము లేదు, తనది కాని పేరు లేదు. రామావతారములో సత్యధర్మముల మహాత్మ్యమును నిరూపించాడు. కృష్ణావతారములో ప్రేమ యొక్క తత్త్వము నిరూపించటమైనది. ఇప్పుడు సత్యధర్మప్రేమల ఆధారముపై శాంతిని ప్రసాదించటము, దానికే ప్రశాంతినిలయము పేరు పెట్టినది కూడా.

ఒకరోజున సాకమ్మ అనే భక్తురాలు,'స్వామీ! ఈ పల్లెకు వచ్చిపోవాలంటే మాకు చాలా కష్టంగా ఉంది. ఇక్కడికి కార్లు రావటానికి వీలులేదు. ఎడ్లబండిమీద రావటానికి చాలా కష్టమవుతున్నాది. కాబట్టి, మీరు బెంగుళూరు వచ్చేయండి. అక్కడ మీకు గొప్ప భవనం కట్టిస్తాము' అంది. 'అక్కడ గొప్ప భవనములు నాకక్కరలేదు. ఇక్కడున్న చిన్న రూము చాలు' అని నేను చెప్పాను. నేను చెప్పినా ఆమె వినేదికాదు. అప్పుడు ఈశ్వరమ్మ 'స్వామీ! మొక్క ఎక్కడ పుట్టిందో అక్కడే దానికి పాదుకట్టి, ఎరువు వేసి, నీరుపోసి పెంచుతే గొప్ప వృక్షముగా తయారౌతుంది. దాన్ని కొంతకాలం ఒకచోట ఉంచటం, తరువాత పెరికివేసి ఇంకొకచోట పాతటం...యీరీతిగా చేస్తుంటే అది ఎలా అభివృద్ధి కాగలదు? కనుక మీరు పుట్టిన గ్రామంలోనే ఉండండి' అని కోరింది. అప్పుడు నేను పుట్టపర్తి వదలిపెట్టనని ఆమెకు మాట యిచ్చాను. నేను యిక్కడే ఉంటూ భక్తులవద్దకు వెళ్లివస్తుంటాను. తరువాత యిక్కడ మందిర నిర్మాణం జరగటానికి కారణం యిదే.

సాయినామమె హాయి స్మరియించుడోయంచు
వృక్షముల్ తలలూపి పల్కుచుండు
సాయినామమె హాయి స్మరియించుడోయంచు
పక్షిసంతానముల్ పల్కుచుండు

**సాయినామమె హోయి స్మరియించుడోయంచు**
**కుసుమముల్ వాసనల్ కురియుచుండు**
**సాయినామమె హోయి స్మరియించుడోయంచు**
**తుమ్మెదల్ ఝుమ్మని యరచుచుండు**
**ఆకసమునుండి యవియె శబ్దములు వచ్చు**
**భూమినుండియు యిదియె శబ్దంబు వచ్చు**
**సాయిబాబా యనుచు సర్వ దిక్కులందు**
**పిక్కటిల్లచునుండును పర్తియందు.**

ప్రశాంతినిలయమునకు మూడు ద్వారములున్నవి. విశ్వమంతా విభుని మందిరమైతే కైలాసమే వీధివాకిలి అన్నాడొక సాధువు. మొదటి ద్వారమైన తమోగుణము దాటి అలంకరణలు, రంగురంగుల తోరణాలూ, గానము విలసిల్లే వన వాటికలో ప్రవేశిస్తారు. అది దాటిన తరువాత రజోగుణ ద్వారం వస్తుంది. అది దాటిన తరువాత ప్రార్థనా మందిరం ప్రవేశిస్తారు. నేను ఏది చేసినా, ఏది చెప్పినా దానికి అంతరార్థం ఉంటుంది. సార్థకత లేని పనులు నేను చేయను.

ప్రశాంతినిలయములో జరిగే శివరాత్రిగానీ, నవరాత్రిగానీ, మా ప్రశాంతినిలయం తరఫున దుర్వినియోగము ఏనాడూ జరగదు. దసరా మహోత్సవములలో లక్షలు ఖర్చవుతాయని అనేకులు అనుకోవచ్చుగానీ అందరూ కూడా హృదయపూర్వకంగా దేహరీతిగా ఆచరించే పనులు తప్ప, ఒక నయాపైసా కూడా మాకు ఖర్చు లేదు. వచ్చే ఋత్విక్కులు గానీ, ఉపన్యాసకులుగానీ ప్రశాంతినిలయమునకు కేవలం ప్రేమతో వస్తారు. ఇట్లు ఆచరించటము వలన, ఎవరికీ ఏవిధమైన అనుకూలము జరిపేదానిలో, వాటినంతా సేవాదళమువారు, సేవాసమితివారు, వాలంటీర్లు హృదయపూర్వకంగా తమ దేహములను అర్పితము చేసి పనులు గావించటము తప్ప వారికి నయాపైసా కూడా ఏమాత్రమూ ఖర్చు పెట్టడం లేదు. మా ప్రశాంతినిలయం యింత పరిశుభ్రముగా మీరు అనుభవిస్తున్నారంటే దీనికి ఎవరు కారణము? ఎంతమంది స్వీపర్లను పెట్టాము? ఎంతమంది కూలీలను పెట్టాము? ఏమాత్రమూ లేదు. ఎవరెవరు వారి స్థానములను, ప్రదేశములను వారే పరిశుభ్రపర్చుకుంటున్నారే తప్ప దీనికి నయాపైసా ఏమాత్రమూ ఖర్చు లేదు. ప్రశాంతినిలయములో వినియోగింపబడే సద్వినియోగములు ప్రపంచములో ఎక్కడా లేదనే చెప్పవచ్చు.

ప్రశాంతినిలయము ఐహికంగా, ఆముష్మికంగా, నైతికంగా, భౌతికంగా, ధార్మికంగా, ఆధ్యాత్మికంగా, లౌకికంగా, రాజకీయంగా కూడనూ ఆదర్శవంతమైన దానినే నిరూపిస్తున్నది. కానీ అనర్థమైన దానికి ఏమాత్రమూ చోటివ్వటానికి వీలులేదని గట్టిగా చెప్పటములో యేమాత్రమూ సందేహము లేదు. ప్రశాంతినిలయంలో కొన్ని నియమాలున్నవి. కాలమును సార్థకంగా గడపటానికి నేను సూచించిన నిబంధనలు యిక్కడికి వచ్చిన వారందరూ పాతవారైనా, కొత్తవారైనా వాటిని పాటించాలి. నిశ్శబ్దంగా ఉండాలని మిమ్మల్ని నిర్దేశించుచున్నాను. మితంగా మాట్లాడండి. తప్పనిసరైనప్పుడు మెల్లగా మాట్లాడండి. మీ కష్టాలను గురించి, కోరికలు గురించి, సమస్యల గురించి యితరులకు వెళ్లబోసుకోవద్దు. ఇక్కడికి వచ్చేవారి దగ్గర ఎవరి బాధలమూట వారికుంది. ఉన్న బాధలకు తోడు మీ బాధలు వినాలనే ఆసక్తి ఎవరికీ ఉండదు. మీ బాధలు వినటానికి నేను ఉన్నాను. సమస్యలు, బాధలు మీకు వినయము, భక్తి నేర్పును కనుక వాటికి స్వాగతం పలకండి. వచ్చిన వారందరూ నాతో ఏర్పడిన అనుబంధమును నిలుపుకో లేరు. మధ్యలో జారిపోతారు. ప్రపంచము నలుమూలలనుంచి భక్తులు వచ్చి చిత్రావతి నదీతీరము నిండిపోయే దినాలు రాగలవు. ఈ జన సందోహమునకు ఆకాశమే ఆచ్ఛాదన కాగల కాలం వస్తుంది. కొందరు స్వర్ణయుగం వస్తుందనీ, అందరూ సుఖశాంతులతో అలలార గలరనీ అన్నీ బాగుపడగలవనీ విశ్వసించ లేకుండా ఉన్నారు. ఈ ధర్మస్వరూపం అవతరించటం నిరర్థకం కాదని మీకు అభయమిస్తున్నాను. ఇప్పుడు మానవజాతి ఎదుర్కొంటున్న సంకట పరిస్థితి చక్కబడగలదు.

**పుడమికి సరిమధ్య పుట్టపర్తి యనగను**
**ఆత్మవిద్యలు నందె అవతరించె**
**విశ్వమానవకోటి విజ్ఞాన మందంగ**
**విశ్వవిద్యాలయంబిచట వెలసె**
**శాంతి సౌఖ్యములను సర్వదేశములందు**

వెదజల్లు నిగ్గులు వెలసిరిచట
నియతి తప్పని మహానిష్ఠులు భక్తులు
వేల లక్షలు కోట్లు వెలసిరిచట
సత్యధర్మశాంతిప్రేమలు జగతికి
చాటి చెప్పబూని సాయి విభుడు
సత్యసాయి చూడ సంపూర్ణ ప్రేమయే
యగుచు పుట్టెనిచట మోదమలర!

భగవంతుని దివ్యమైన భావములను, ఆదేశములను అందరికీ చాటాలి. భగవంతుని ఆశయములను ప్రపంచములోని ప్రజలకందించాలి. అందించిన తరువాత తానుకూడా ఆచరణలో నిమగ్నుడు కావాలి. ఈ రెండింటి చేరికచేత తాను దైవముగా మారుతాడు.దైవము ప్రత్యేకంగా లేదు. అన్నింటియందున్న దైవత్వము ఒక్కటే. అతనియొక్క చేతులు, పాదములు, కన్నులు ఎక్కడచూచినా ఉన్నాయి. కనుక భగవంతుని తప్పించి, చూడకుండా యేదో దోషము చేస్తున్నామని భావిస్తారు. అది చాలా పొరపాటు. భగవంతుడు చూడని దృశ్యము లేదు. పరమాత్మ వినని విషయములు ఎక్కడా లేవు. నీవు యేదో రహస్యముగా దాచుకుంటూ ఉంటావు. రహస్యముగా చేస్తున్నానని భావిస్తావు. అది చాలా పొరపాటు. అందరికీ రహస్యము కావచ్చు కానీ దైవానికి రహస్యము కాదు.

అనేక దేశాలనుండి ఇక్కడకు వచ్చిన మీరు చేయవలసినది ఏమిటి? ప్రాకృతమైన కష్టముల కోసము భగవత్ ప్రేమను ఏమాత్రము దూరము చేయకూడదు. ప్రేమను ఎంతవరకునైనా సాధిస్తూ రావాలి. అదే లవ్ ఈజ్ గాడ్. లివ్ ఇన్ లవ్. ఈ తత్వాన్ని మనం పెట్టుకుంటే పర్వతాల వలె వచ్చిన కష్టాలు మంచువలె మాయమౌతాయి. ఎవరైనా సరే, ఏ దేశము వారైనా సరే, ఏ గ్రామము వారైనా సరే, పూర్వం మీలో ఉన్న దుర్భావములను, దుశ్చింతలను ఈ ప్రశాంతినిలయంలో వదలి పెట్టండి. ఇక్కడి ప్రశాంతిని మీ హృదయంలో నింపుకొని పొండి. అశాంతితో యిక్కడికి వచ్చి మళ్ళీ అశాంతితోనే తిరిగి పోకూడదు. అప్పుడే మీరు యిక్కడకు వచ్చినందుకు సరైన ఫలితము. లేకపోతే యింత ఖర్చు పెట్టి, యిన్ని శ్రమలకోర్చి యిక్కడకు వచ్చి ప్రయోజనము ఏమిటి? నీ దుర్గుణము యిక్కడ యివ్వకపోతే సద్గుణములు తీసుకుపోటానికి ఏ అధికారం ఉంది? నేను నీ మంచిని అడగటం లేదు. నీ చెడ్డను నాకిచ్చేసేయి. నేను నీకు మంచిని యిస్తాను. ఒక నూరు రూపాయల నోటు చాలా పాడైపోయింది. ఆయిల్ అయింది. అలాంటి నూరు రూపాయల నోటు ఎవ్వరూ తీసుకోరు. అదే నూరు రూపాయల నోటు రిజర్వుబ్యాంకుకి యిస్తే దానిని తీసుకొని మంచినోటు అందిస్తాడు. నీ దగ్గర పనికిమాలిన గుణాలంతా ఉన్నాయి. దుర్గుణములు, దురాలోచనలు. వాటిని ఎవ్వరూ అంగీకరించరు. కన్న తల్లిదండ్రులైనా అంగీకరించరు. కానీ అట్టి దుర్గుణములను నేను అంగీకరిస్తాను. నాకు యివ్వండి. నానుండి పవిత్రమైనవి తీసుకుపొండి. మీరు బాగుపడండి. సమాజమును బాగుపరచండి. మీరు ఆనందించండి. మీ ఆనందమును పదిమందికి పంచండి. కానీ యీనాడు లోకంలో అది ఎక్కడా చిక్కటం లేదు. ప్రపంచమంతా వీధివీధిలోనూ వెతికి చూడండి. పీస్ (ప్రశాంతి) అనేది ఎక్కడా లేదు. అంతా పీసెస్, పీసెస్. పీస్ (ప్రశాంతి) అనేది యిక్కడ మాత్రమే ఉంటున్నాది. ఎందుకనగా అనేకమంది ఉత్తమమైన భక్తులు ఉత్తమమైన భావాలతో జీవించిన ప్రదేశమిది. ఆ ఉత్తమమైన భావాలను మీ హృదయాలలో నింపుకోండి. ఎవరేమనుకొన్నా మీరు లెక్కచేయనక్కర లేదు. మీ మంచిని మీరు పోషించుకోండి. ఆత్మవిశ్వాసాన్ని అభివృద్ధి పర్చుకోండి. అదే నేను కోరేది. నేను దేనిని ఎవరినీ కోరటం లేదు. పుట్టపర్తి పోయి పది నెలలు ఉంటున్నాడు ఎట్లా మార్పు చెందాడు అని నీపైన చాలా గౌరవం పెంచుకుంటారు. ఈ మార్పును మీరు చూపించాలి. సాధకులందరికీ ప్రశాంతినిలయం ఒక వండర్ఫుల్ వర్క్‌షాపు. ఎట్టి ఫలితమును ఆశించేది కాదు. అంతా ఫ్రీ. ఎడ్యుకేషన్ ఫ్రీ, హెల్త్ ఫ్రీ, వాటర్ ఫ్రీ, హృదయము ఫ్రీ. అందరికీ అధికారముంటున్నాది. కష్టాలు వస్తుంటాయి, పోతుంటాయి. వాటిని గూర్చి చింత చేయకండి. దైవచింతన చేస్తుంటే పర్వతాల వలె వచ్చిన ప్రమాదాలు కూడా మంచువలె మాయమౌతాయి.

కాటుక కొండల వంటి కర్మము లెడబాపే మందు
సాటిలేని జగమునందు సాయిరామ నామమందు

చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతాలవిత్రంబులు స

న్మిత్రంబులు మునిజనవన
చైత్రంబులు సాయిదేవు చారిత్రంబుల్.

ఈ అవతారములో జరిగిన విచిత్రములు మీకు చెబుతున్నాను. ఇంతవరకూ యెవ్వరికీ చెప్పలేదు. ఈ ప్రశాంతిమందిరం కట్టిన తరువాత నేను పై అంతస్థులో కుడి ప్రక్కన ఉన్న రూములో భోజనము చేసేవాడిని. ఆ సమయంలో గృహంఅమ్మాయి అక్కడకు వచ్చి,'స్వామీ! మీరు సరిగా తిండి తినక బక్కపడిపోతున్నారు. బాగా తినండి'అని బలవంతం చేసేది. 'నేను ఎవరితో యుద్ధంచేయాలి? లావుగా తయరుకావాలా? వద్దు. నాకిష్టంలేదు' అనేవాడిని. ఒకనాడొకరు నన్ను వాళ్లింటికి రావలసిందిగా ఆహ్వానించారు. ఎందుకోసం? నాకు విషం పెట్టి చంపాలని. దినదినానికి అభివృద్ధి అవుతున్న నా పేరు ప్రఖ్యాతులను చూచి వారికి అసూయ కలిగింది. అక్కడనుండి నేను తిరిగి వచ్చేటప్పటికి నా దేహం నీలంగా మారిపోయి నోటినుండి నురగలు రావటం ప్రారంభమైంది. ఈశ్వరమ్మతో 'నీవు చేయి త్రిప్పు' అని చెప్పాను. ఆమె చేయి త్రిప్పితే విభూతి వచ్చింది. 'స్వామి చేయి త్రిప్పుతే విభూతి వస్తుందిగానీ, నేను త్రిప్పుతే విభూతి ఎలా వచ్చింది?' అని ఆమె ఆశ్చర్యపోయింది. ఆ కొద్దిసేపు నేనే ఆమెకు ఆ శక్తి యిచ్చాను. ఆమె ఆ విభూతి నీళ్లలో కలిపి నాకు త్రాపింది. తక్షణమే విషప్రభావం హరించుకుపోయింది.

పూర్వము పాతమందిరములో ఉన్నప్పుడు ప్రతిదినము చిత్రావతికి వెళ్లేవారము. అక్కడికి గ్రామములోని పిల్లలందరూ వచ్చేవారు. ఒకరు పెన్సిలు కావాలనేవారు, ఒకరు పెన్ను కావాలనేవారు. వాళ్లు చిన్నపిల్లలు కాబట్టి అలాంటి కోరికలు కోరేవారు. ఒక యిసుక కుప్పచేసి అందులో మీకు కావలసినవి వెతుక్కోండి అని చెప్పేవాడిని. వారికేదికావాలంటే అది లభించేది. చిత్రావతి నుండి పాతమందిరానికి తిరిగి వస్తున్నాము. స్వామి వచ్చేలోపల మందిరానికి వెళ్లి హారతి యివ్వచానికి యేర్పాట్లు చేయాలని యిద్దరు ఆడవారు ముందు పరుగెత్తారు. అప్పుడు నేను వాళ్లను ఆపవలసిందిగా సుబ్బమ్మకి సైగ చేసాను. 'నీవు ముందు వెళ్లు' అని చెప్పాను. అప్పుడామె వాళ్లను ఆపి, 'మీరు యిక్కడే ఉండండి, నేను వెడతాను' అంది. 'ఈ సుబ్బమ్మ వితంతువు కదా ఆమె హారతి ఎలా యిస్తుంది?' అని వాళ్లు అనుకున్నారు. సుబ్బమ్మ వెళ్లేసరికి ద్వారము దగ్గర ఒక సర్పము ఉంది. సుబ్బమ్మ అన్నీ జాగ్రత్తగా చూసుకునేది. ఆ సర్పాన్ని చూసి,సాయినాగేశ్వరా! సాయినాగేశ్వరా! అని గట్టిగా పిలచింది. ఈలోపల అందరూ పరుగెత్తుకొని వెళ్లారు. ప్రతి జీవిలోనూ భగవంతుడున్నాడని స్వామి చెబుతారుకదా! కాబట్టి ఈ పామును కొట్టకూడదు, చంపకూడదు అని భావించి ధైర్యంచేసి ఆ పామును చేతితో పట్టుకుంది. ఈలోపల నేను వెళ్లాను. 'ఏమి సుబ్బమ్మా! పాముతో ఆడుకుంటున్నావా?'అని తమాషా చేశాను. అప్పుడామె 'స్వామీ!మీరు నన్ను ముందుగా పంపింది వాళ్లను కాపాడటం కోసమే కదా!' అన్నది. ఒకనాడు నేను,'సుబ్బమ్మా! నీ భర్తను చూడాలని ఆశగా ఉందా?' అని అడిగాను. నేను అప్పుడప్పుడు ఆమెతో యీరీతిగా జోక్ చేసేవాడిని. అప్పటికి ఆమె భర్త మరణించాడు. 'నాకు అలాంటి ఆశలేమీ లేవు స్వామీ.పోయిన మనిషితో నాకేమి పనుంది? ఆయనకు ప్రాప్తం లేక పోయినారు. నాకు ప్రాప్తముంది కాబట్టి, నేను మిమ్మల్ని సేవిస్తున్నాను' అంది. 'నీకు ఒకతూరి చూడాలని ఉంటే చూడు. ఆ ఋణముకూడా తీరిపోతుంది.' అని పలికి, 'కొంచెం అట్లా బయటకు పో' అన్నాను. బయట ఒక మునగ చెట్టు ఉండేది. ఆమె భర్త నారాయణరావు ఆ చెట్టు కింద కూర్చొని సిగరెట్టు కాలుస్తున్నాడు. ఆ దృశ్యాన్ని సుబ్బమ్మ ప్రత్యక్షంగా చూసింది. చూసి సంతోషించటమే కాకుండా 'చచ్చిన తర్వాత కూడా నీ దురభ్యాసములు వదలి పెట్టలేదే! నీ ముఖం చూడను' అని చెప్పి లోపలికి వచ్చేసింది. ఆయనకు కమలమ్మ అని రెండవ భార్య ఉండేది. 'కమలమ్మా ఒకతూరి నీవు కూడా పోయి చూడు' అని చెప్పాను. 'స్వామీ! మేము మీదగ్గరున్నాము. మాకేమీ అక్కర లేదు.' అన్నది. 'ఒక్కతూరి పోయి చూడు' అని మరల చెప్పాను. ఆమె వెళ్లి చూసేటప్పటికి ఆయన వేడివేడి కాఫీ తాగుతున్నాడు. ఆయన బ్రతికి ఉండినప్పుడు ఏమి చేసేవాడో అవే చర్యలు చేస్తూ వారికి కనిపించాడు. ఈరీతిగా సుబ్బమ్మ అనేక లీలలు చూసింది. ఆమె చాలా పుణ్యాత్మురాలు. మహా అదౄష్టవంతురాలు. ఆమెకు స్వామి పట్ల దృఢమైన విశ్వాసముండేది.

నరసమ్మ మీకందరికీ తెలుసు.(1971 లో స్వామి తెల్పినది) ఆమె నిర్మలమైన భక్తురాలు. ఆమె 1941 నుండి పుట్టపర్తిలోనే ఉంటున్నాది. ఇంతకాలము ఒక్కమాటైనా తన యిల్లే, తనవారే అని ఒకనాడు కూడను మద్రాసు తొక్కలేదు. ఆమెకు 80పైన అయింది వయస్సు. ఇక్కడికి వచ్చానే, తిరిగి వెనుక కాలుపెట్టను అని యిక్కడే ఉంది. నిరంతరము, తాను మంచి సహన భావముతోనే అందరినీ మాట్లాడించేది. నేను అరిచేవాడిని అప్పుడప్పుడు 'నరసమ్మా! ఎవరెవరో వస్తారు. ఎందుకు అనవసరంగా నీ రూములో చేర్చుకుంటావు? సత్కర్మలలో, సదాచారములలో ఉండకూడదా?' అని. ఆమె హృదయం మంచిది. ఆనందము అక్కడ స్థిరనివాసముండినది.

నేను గోవా నుండి జాబు వ్రాసాను. 'నరసమ్మా! స్వామి నీ వెంట జంట ఉండి కంటిరెప్ప వలె కాపాడుతాడు. స్వామి లేరే అని యేమాత్రము చింత పెట్టుకోవద్దు. దేహము కృశించుచున్నది కనుక నీవు సర్వసంసిద్ధురాలై ఉండు. దేహచింతన యేమాత్రము వద్దు. నిరంతరము దైవచింతన చేయుచూ రా.' దేహము పండిన తరువాత కుళ్లక తప్పదు. కుళ్లిపోయినదాన్ని పారవేయక తప్పదు. అట్లనె ఆమె దేహముకూడా కుళ్లిపోయినది. నల్లబడిపోయినది. దానిని పారవేసినాము. కానీ ఆమె చేసిన సాధన, సేవ, సార్థకముగా నిలిచినవి.

ఏమిరా, ఆమె యింతకాలము కోరినా కూడా స్వామి అంత్యకాలమున ఆమె దగ్గరకు రాలేదేయని మీరు అనుకుంటారేమో! మీ ముందర యిప్పుడు నిల్చున్నానే అట్లుకాదు ఆమె ఫలితము. అంత్యసమయమున వెంటనే ఉంటాను అని నేను యేరీతిన ఆమెకు మాట యిచ్చానో, ఆ మాట ప్రకారము నేను తప్పక చేశాను. అప్పుడు వచ్చాను. ఆనంద ప్రసాదమిచ్చాను. నోటిలో వేసుకోమని విభూతి యిచ్చాను.

అదికూడా అక్కడివాళ్లు కొంతమంది చూచారు. వట్టిచేతులతో యేమి అట్లా నోటిలో వేసుకుంటున్నావని అడిగితే స్వామి యిప్పుడే వచ్చి ప్రసాదము యిచ్చి పోయినారు అన్నాదట. కట్టకడపటివరకు తెలివితోనే ఉండి ఆ ప్రసాదము వేసుకొన్నది. సరిగా మధాహ్నం 11గంటల 7నిముషములకు పోయినది.

అదేసమయానికి వైట్‌ఫీల్డులో పెద్దబొట్టు (అక్కడకు వచ్చి నాలుగు దినములైనది) దగ్గర నేను 'ఇప్పుడే నరసమ్మ వెళ్లిపోయనది' అని చెప్పినాను. ఆమె భావము, ఆ భావానికి తగిన చిత్తశుద్ధి, ఆ చిత్త శుద్ధికి తగిన సిద్ధి అన్నీ లభించినవి. ఆ సిద్ధిని అర్థము చేసుకొనేది, దానికి పోలికలు ఊహించేది ఎవరి తరము కాదు.

## 13

### సిద్ధసంకల్పము

**జాతి భేదములేక జనులకాశ్రయమిచ్చి**
**సర్వసమత్వంబు చాటు తరులు**
**తనువుకై మనకింత తమకంబు వలదంచు**
**చలి ఎండ వానల సైచు గిరులు**
**రేపుమాపు కొరకు వాపోవ వలదంచు**
**విహగముల్ సంతుష్టి విద్య గరపు**
**జగము నిత్యముకాదు సంసారమది భ్రాంతి**
**యని ప్రాణముల్ వీడి చనెడివారు**
**నేను, నాదను భావమనిత్యమనుచు**
**ప్రకృతి జనని తెల్పుచుండు భాష్పవృష్టి**
**ప్రాణి సుజ్ఞాన మార్జింప ప్రకృతి ఒకటె**
**పాఠశాల సద్గురుడు శ్రీసాయి కాదె**

వ్యక్తిపరిణామం, సామాజిక పరిణామం, ఆధ్యాత్మిక పరిణామం...ఈ మూడింటిని చేకూర్చి దివ్యత్వమును ప్రకటింపజేసే నిమిత్తమే సాయి అవతరించాడు. నేడు వ్యక్తి పరిణామం అత్యవసరం. ఎందుకంటే, నేటి వ్యక్తి దుర్గుణములతోను, దుష్ప్రవర్తనతోను కాలం

గడుపుతున్నాడు. ప్రాణులను హింసించి మాంస భక్షణ సల్పుతున్నాడు. మద్యపానముతో తన మనస్సును మాలిన్యపర్చుకుంటున్నాడు. జూదంలో ప్రవేశించి కాలమును వ్యర్థం గావించుకుంటున్నాడు. దొంగతనానికి, పరదూషణకు పాల్పడుతున్నాడు. అపవిత్రమైన పుస్తకాలను పఠిస్తున్నాడు. దుర్మార్గములో ప్రవేశించి తాను చెడిపోవటమేకాక సమాజమును కూడా చెడగొడుతున్నాడు. అందుచేత వ్యక్తియొక్క దురభ్యాసములను దూరం గావించి, పశుత్వాన్ని నిర్మూలించి, మానవత్వాన్ని పోషించి, దివ్యత్వమును తెలిపే నిమిత్తమై దైవం అవతరిస్తుంటాడు.

వ్యక్తిని, సమాజమును పరిశుద్ధము గావించి లోకాన్ని పవిత్రం గావించుటకు ఆధ్యాత్మికం అత్యవసరం. ఆధ్యాత్మికమంటే ఏమిటి? మానవునియందున్న పశుత్వమును నిర్మూలించి, మానవత్వమును పోషించి, దివ్యత్వమును చేకూర్చునదే ఆధ్యాత్మికము. పూజలు, భజనలు, వ్రతములు, జపములు ఇవన్నీ కొన్ని విధములైన సత్కర్మలే తప్ప ఆధ్యాత్మికమునకు సంబంధించినవి కావు. మానవునియందున్న పశుత్వాన్ని నిర్మూలించి, మానవత్వాన్ని పోషించి దివ్యత్వంతో చేర్చటమే ఆధ్యాత్మికం యొక్క అంతరార్థము.

సాయి అనే పదములో ఎస్ ..ఆధ్యాత్మిక పరిణామమును, ఎ...సామాజిక పరిణామమును, ఐ..వ్యక్తి పరిణామమును సూచిస్తున్నాయి. వ్యక్తి పరిణామము, సామాజిక పరిణామము, ఆధ్యాత్మిక పరిణామము మూడూ ఈనాడు అత్యవసరమని సాయి అనే పదము లోకానికి చాటుతున్నది. ఈ మూడింటి పరివర్తన చేకూర్చటమే సాయి ఆశయం. అంతేకాదు ఎస్ అనగా (సర్వీస్) సేవ, ఎ అనగా (ఎడొరేషన్) ఉపాసన, ఐ అనగా (యిల్యూమినేషన్) జ్ఞానము. కనుక కర్మ, ఉపాసన, జ్ఞానముల ఏకత్వమే సాయితత్త్వము.

ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ "నేను చూసాను, నేను చేసాను" అని ఈ విధంగా 'నేను' అనే పదాన్ని ఉపయోగిస్తున్నారు. మొట్టమొదట తనలోనున్న 'నేను' ను అర్థం చేసుకుంటే అన్ని జీవులలోనున్న 'నేను' అనే దివ్యత్వం అర్థమవుతుంది. మానవుడు తన తత్త్వాన్ని తాను గుర్తించినప్పుడే పరివర్తన ప్రారంభమవుతుంది. ధూమపానము, మద్యపానము, మాంసభక్షణము, జూదము వంటి దురభ్యాసములు వ్యక్తినేగాక అతని చుట్టూ ఉన్న పరివారమును కూడా చెడగొడతాయి. ఈ దురభ్యాసములను దూరం గావించుకోవాలి. ఈ దురభ్యాసములచేత వ్యక్తిత్వము అడుగున పడిపోతున్నది. వ్యక్తిత్వాన్ని వికసింపజేసుకోవాలంటే నీతిని ఆధారంచేసుకోవాలి. నీతి గల మానవునియందే వ్యక్తిత్వము వికసిస్తుంది.

ఇంక సామాజిక పరివర్తన ఏమిటి? నిరంతరం పరులను దూషించటం, నిందించటం, అపహాస్యం చేయటం, తాము మంచి పనులు చేయకపోయినా చేసే వారిని చూసి అసూయపడటం..ఇలాంటి దుర్గుణాల వల్లనే ఈనాడు సమాజంలో శాంతి కరువైపోతున్నది. ప్రపంచంలో అందరికీ మంచివాడైనవాడు ఎక్కడా కనిపించడు. తలలు వేరుగా ఉన్నప్పుడు తలంపులు వేరుగా ఉంటాయి.

**కూరిమి గల దినములలో**
**నేరము లెన్నడు సలుపనేరవు**
**ఆ కూరిమి విరసంబైన నేరములే తోచుచుండు**

కలసి మెలసి చెలిమిగానున్నప్పుడు ఏమి చేసినా మంచిగానే ఉంటాయి. కానీ చీలిపోయినప్పుడు ఇష్టమే ద్వేషంగా మారిపోతుంది. ఇది ఈనాటి పరిస్థితి. ఇది మంచిది కాదు. సమాజమునందు పరోపకార సంబంధమైన గుణములను పెంచుకోవాలి. దీనికి త్యాగము అవసరం. 'నా బాధ యెట్టిదో యెదుటి వారి బాధ అట్టిదే' అనే సమత్వాన్ని గుర్తించాలి.

ఇంక ఆధ్యాత్మిక పరివర్తన. దయ, కరుణ, ప్రేమ, సహనం, సానుభూతి వంటి పవిత్రమైన భావములు ఆధ్యాత్మికములో ఆవిర్భవిస్తాయి. ఇలాంటి పవిత్ర భావములచేత ఆడి పాడి ఆనందించి పరులకు అందించిన దేశమే భారతదేశము. భవ్యభావాలు కలిగిన భారతీయ దివ్యతత్త్వము తెలిసియు తెలియనట్లు ఉన్నారు ఈనాడు. బయటి వాతావరణ ప్రభావముచేత సత్యాన్నికూడా అసత్యంగా మార్చుకుంటున్నారు.

**పాపభీతి లేని పామరత్వము బట్టి**
**దైవప్రీతి లేని దారి పట్టి**
**మానవత్వ మణగె మానవులందున**
**ఇంతకంటె దౌర్భాగ్య మేమి కలదు!**

ఈనాడు దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి మూడింటిని కోల్పోతున్నారు భారతీయులు. దైవప్రీతి మన వారసత్వము. దానిని పొందినప్పుడు

పాపభీతి సహజంగానే మనలో ఆవిర్భవిస్తుంది. ఈనాడు ఎక్కడ చూసినా అనేక భయంకర కృత్యములు చెలరేగుతున్నాయి. దీనికి కారణం పాపభీతి లేకపోవటమే. ఇలాంటి పరిస్థితిలో సంఘనీతి ఎట్లా కలుగుతుంది? ఈనాటి అశాంతికి, అల్లకల్లోలములకు కారణమెవరు? మనలోనున్న భావములే యితరులయందు ప్రతిబింబించటంచేత వారు యిలాంటివారని, అలాంటివారని చెప్పుకుంటున్నాము.ఎదుటివాడు చెడ్డవాడంటే నీ చెడ్డనే అతనిలో ప్రతిబింబిస్తున్నది. కనక, మనలో మనము ఐకమత్యమును అభివృద్ధి చేసుకున్నప్పుడు ఎట్టి బాధలూ ఉండవు. ఐకమత్యమే మన బలము. దీనికి ఆచరణయే సరైన మార్గము.

మొట్టమొదట వ్యక్తి పరిణామము అత్యవసరం. వ్యక్తి అనగా కేవలం మానవాకారమని మీరు భావిస్తున్నారు. కాదు, కాదు. అవ్యక్తమై, తనయందే నిగూఢంగా ఉన్న దివ్యత్వాన్ని ఆచరణలో ప్రకటించి ప్రబోధించినవాడే వ్యక్తి. మానవునియందు అవ్యక్తమైయున్న దివ్యత్వాన్నే కాన్షియన్స్ అన్నారు. కానీ, ఈనాటి మానవుడు దేహమునకు సంబంధించిన దుర్గుణములను మాత్రమే వ్యక్తం గావించుచున్నాడుగానీ, అంతర్భూతమైన, పవిత్రమైన ఆత్మతత్వాన్ని వ్యక్తం చేయటం లేదు.

సత్య ధర్మ శాంతి ప్రేమ అహింసలను మానవుని పంచ ప్రాణములైన ప్రాణ అపాన వ్యాన ఉదాన సమానములతో పోల్చవచ్చును. మానవుడు సత్యమును కోల్పోతే పంచ ప్రాణములలో ఒక ప్రాణం పోయినట్టే. కానీ, నేటి మానవుడు లౌకికమైన సుఖసంతోషముల నిమిత్తమై సత్యధర్మములను కోల్పోతున్నాడు. సత్యధర్మములను కోల్పోవటం చేత మానవునిలో శాంతి, ప్రేమలు శూన్యమైపోతున్నాయి. అందువల్లనే హింసకు పూనుకుంటున్నాడు. బుద్ధుడు "అహింసా పరమో ధర్మః" అన్నాడు. అహింసను అలవర్చుకున్నప్పుడే ప్రేమ ఆవిర్భవిస్తుంది. ప్రేమ ఆవిర్భవించినప్పుడే శాంతి ఏర్పడుతుంది. శాంతి ఏర్పడినప్పుడే ధర్మమార్గములో ప్రవేశిస్తాడు. ధర్మమార్గములో ప్రవేశించినప్పుడే సత్యం ఆవిర్భవిస్తుంది. ఈ పంచ ప్రాణములను కాపాడుకోవలసిన బాధ్యత మానవుని పైనే ఉన్నది.

"సర్వం ఖల్విదం బ్రహ్మ", "ఈశ్వర స్సర్వ భూతానాం" మున్నగు దివ్య సూత్రముల రహస్యమును గుర్తించాలంటే సద్గుణములను పోషించుకోవాలి. వేదములోని ప్రతి మంత్రము గొప్ప అంతరార్థము కలిగినది. మానవునిలో సమ్యక్‌దృష్టి, సమ్యక్‌శ్రవణం, సమ్యక్‌వాక్కు, సమ్యక్‌కర్మలనే సద్గుణములే లేకుండిన ఈ మంత్ర రహస్యములను ఏమాత్రమూ తెలుసుకోలేడు. మొట్టమొదటిది సమ్యక్ దృష్టి. అంతరాత్మకు ఏది సరైన దృష్టి అని తోచునో అదియే సమ్యక్ దృష్టి. చూచిన ప్రతి దృశ్యమూ హృదయమందు ప్రింటైపోతున్నది. కనుక, మానవునికి సమ్యక్ దృష్టి లేకుండిన మానవత్వమే మసి అవుతుంది. రెండవది సమ్యక్ శ్రవణం. నవవిధ భక్తి మార్గములందు శ్రవణం మొట్టమొదటిది.

**శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం**
**వందనం అర్చనం దాస్యం సఖ్యమాత్మనివేదనం**

ఆత్మనివేదనమునకు శ్రవణమే తొలి మెట్టు. కనుక, మంచినే వినాలి. చెడ్డ విషయాలను వినకూడదు. భజనలను, సత్‌గ్రంథ పఠనమును, పరోపకార సంబంధమైన విషయాలను శ్రవణం చేయాలి. మూడవది సమ్యక్ వాక్కు. మీ వాక్కు మృదుమధురమైనదిగా, అతి సున్నితమైనదిగా ఉండాలి. ఇతరుల మనస్సును బాధించే పదములను ఉపయోగపెట్టకూడదు. మీ భావం ఎట్టిదో ఫలితం అట్టిది. కనుక, సమ్యక్ భావమును అభివృద్ధి పర్చుకోవాలి. సమ్యక్ భావం ఏర్పడిన తరువాతనే సమ్యక్ కర్మలనాచరించటానికి సాధ్యమవుతుంది. ఈవిధంగా, భగవంతుడు ప్రసాదించిన పంచేంద్రియాలను సక్రమమైన మార్గంలో ప్రవేశపెట్టడమే సరియైన సాధన. సమ్యక్ దృష్టి, సమ్యక్ శ్రవణం, సమ్యక్ వాక్కు, సమ్యక్ భావం, సమ్యక్ కర్మ ఇవే మానవునికి పంచ భూతములవంటివి, పంచ ప్రాణములవంటివి, పంచకోశములవంటివి.

ఈ కలియుగమున మహామహా విద్యావంతులమని తలభారపు పట్టములను అందుకొందురుగానీ వారు నిజమైన విద్యావంతులు కారు. ప్రకృతి విద్యలు విద్యలెట్లగును? అయితే కలి ప్రతాపము, అన్నగత ప్రాణులగుటచే కూటికీ, గుడ్డకూ పరితపించుట నేటి పరిపాటైన పొరపాటు.

ఒకేపరి పరావిద్యలు రుచింపవు. కనుక, ప్రకృతి విద్యలను చూపి పరావిద్యలలో ప్రవేశింపజేయవలెను. విద్యార్థులలో యీ పరావిద్య బలపడిన లోకమున ఆధ్యాత్మికము ఎంతగనో అభివృద్ధియగుటకు అవకాశముండును. ఆధ్యాత్మిక ప్రచారము అహంకార దాహములో మునిగిన వీరివలన న్యాయన్యాయములను గుర్తించక, పాపభీతి, దైవప్రీతి లేక మనసు పోయినటుల మెలగుచూ

హృదయమును మాలిన్యము చేసుకొనుచున్న వారివలన చేయ వీలుకాదు. కనుక, ప్రజలలోనే సనాతన ప్రభలు వికసించునట్లు చేయుటకు ప్రయత్నించవలెను. సాత్వికముతో సంబంధము ఏర్పరచుకొని నెమ్మదిగా దైవత్వమును నిర్మించుకొనుటకు తగిన మార్గము నేటి బాలబాలకులకు విద్యారంగమే ప్రధాన కేంద్రము. అదియే సాయి సంకల్పము. భక్తుల శ్రద్ధాభక్తులు సక్రమమైన రీతిలో ఉండిన నా సంకల్పము సరాసరి హృదయమందు పొంగి పొరలి వచ్చును.

యువకులు భావిభారతోద్ధారకులు కనుక వారిని ఉద్ధరించి, అభివృద్ధి పరచి వారికి మానసిక సంస్కారము చేకూర్చి తద్వారా భరతదేశముయొక్క సౌభాగ్యమును దేశదేశములలోనూ అందించాలనేదే సాయియొక్క ఉద్దేశ్యము. నా సంపదలన్నియూ విద్యార్థులే. నా ఆశలన్నియూ విద్యార్థులపైనే ఆధారపడి ఉంటున్నాయి. వారిని చక్కదిద్ది, లోకానికి ఆదర్శప్రాయులుగా నిరూపించాలనేదే సాయియొక్క సంకల్పము. సాయి అనే పదములోని అంతరార్థాన్ని మీరు గమనించాలి. ఎస్ అనగా సర్వీసు (సేవ) ఎ అనగా భక్తి (ఎడొరేషన్) ఐ అనగా జ్ఞానం( ఇల్యూమినేషన్) ఈ మూడే కర్మ భక్తి జ్ఞానములు. సాయి బోధించేవి ఈ మూడే. సాయి అనే పదములో ఏ అక్షరము లేకపోయినప్పటికి అది 'సాయి' కానేరదు. కర్మోపాసనజ్ఞానముల సమ్మిళిత స్వరూపమే సాయి. సాయిసంస్థలలో మొట్టమొదట ఈ మూడింటిని అభివృద్ధి పర్చుకోవాలి. నా విషయము మీరు తెలుసుకోటములో కాలహరణము చేయకండి. కాలమును వ్యర్థము చేయకండి. కారణమేమనగా, నా యొక్క విషయము తెలుసుకోటము ఎవరికీ సాధ్యము కాదు. కనుక, తెలుసుకోటానికి సాధ్యముకాని విషయము తెలుసుకునే ప్రయత్నమునకు పూనుకొనిన కాలహరణమే కాకుండా, కాయమును కూడ వ్యర్థము చేసుకున్నవారౌతారు. మిమ్ములను మీరు ఏనాడు తెలుసుకొనగలరో, ఆనాడే నన్ను తెలుసుకోటానికి సాధ్యమవుతుంది.

నాకు ఈ లోకములో కావలిసినది ఏమాత్రమూ లేదు. నేను ఏనాడూ కూడ ఏ కార్యమునుగానీ, ఏ వస్తువునుగానీ ఆశించిన క్షణము లేదు. నేను కేవలము యిచ్చుకోవటానికి వచ్చినట్టివాడను కానీ పుచ్చుకోటానికి వచ్చినట్టివాడను కాను. నాకు మీరు యివ్వవలసినది ఒక్కటే. మీ నిర్మలమైన ప్రేమ యిచ్చినప్పుడు, అదే నాకు తగినటువంటి ఆనందము.

ఈనాడు లోకములో యువకులు అనుసరించే పెడమార్గములను పురస్కరించుకొని, సత్యసాయి సెంట్రల్ ట్రస్టువారు అనేక ప్రాంతములందు కాలేజీలు స్థాపించి, తద్వారా అనేకరకములైన సంస్కారములను వారికి కలిగింపజేసి, భారతీయ సంస్కృతిని నిలబెట్టి, సర్వమత సమ్మతమైన సత్యాన్ని ప్రబోధించే నిమిత్తమై వారుగా సంకల్పించుకున్నారు. అందువల్ల కళాశాలలు స్థాపించే నిమిత్తమై దానికి, ప్రపంచములో ధనము లేక ఏ చిన్న కార్యము కూడా జరగటానికి వీలుండదు కనుక, వారు ఒక్కొక్క వ్యక్తి జీవితమునకొక్క పర్యాయము ఏభై రూపాయలు యిచ్చినప్పుడు, దానినంతా ఒక ఫండుగా చేసి విద్యాసంస్థలను, ఆరోగ్య సంబంధమైన సంస్థలను అభివృద్ధి చేయవలెననే ఉన్నత భావాలచేత, పవిత్రహృదయాలచేత నిర్ణయించుకున్నారు. ఈవిధమైన నిర్ణయాన్ని కమిటీవారు తెచ్చి నా దగ్గర అప్పగించారు.

దానికి నేను యీవిధమైన జవాబు యిచ్చాను, 'నాయనా! ఒకరికొకరు కేవలము ధనము వస్తుందికదా అనే ఉద్దేశ్యముతో, ప్రపంచానికిగానీ, ప్రభుత్వానికిగానీ, వ్యక్తులకుగానీ ఎట్టి సందేహములకు కూడా అవకాశములేని మార్గమును అవలంబించటము మంచిది' అని నేను వారికి ప్రబోధించాను.

ఈ లోకంలో సాయికి కావలసినదేదీ లేదు. అయితే లోకసంబంధమైన కొన్ని బాధ్యతలు వహించటం చేత, సంస్థను అభివృద్ధి పరచటంచేత, పల్లెల సేవను చేపట్టటంచేత ప్రజల మార్గములను, ప్రభుత్వ నిబంధనలను కొంతవరకు అనుసరించక తప్పదు. జగత్తులో ధనం అవసరమే. ఎవరికి? నాకోసం కాదు. నేను ఏనాడూ ఆశించను. అయితే కొన్ని సంస్థలు స్థాపించి వాటి బాధ్యతలు వహించేవారు కొందరున్నారు. ధనమే లేకపోతే యీ కార్యక్రమం ఏమాత్రం చేపట్టటానికి వీలుకాదు. గ్రామాలలో విద్యా, వైద్య సౌకర్యాలు కాక, రోడ్లు, మంచినీటి సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఏనాడూ కూడా నాకు ధనం కావాలి అన్నమాట నానోట రాలేదు. చేస్తున్న సత్కార్యాలు చూసి వ్యక్తులు ముందుకు వచ్చి ఉదారంగా త్యాగం చేస్తున్నారు. ఒక్క వరిగింజ నాటితే వంద గింజలౌతాయి. సంకల్పించినంతనే సిద్ధించటం సాయితత్త్వం.

కాలేజీ నిర్మాణ సంకల్పం కలిగిన తక్షణమే రాజమాత కాలేజీ కట్టించింది. భిక్షమడగలేదు. ఆశయాల అభివృద్ధి యీరూపం దాల్చింది. చిన్నతనంనుండే పిల్లలను చక్కగా అభివృద్ధిపర్చటానికి స్కూలు పెట్టాలని సంకల్పించటంతోనే ఇటలీ ప్రధాని సోదరుడు క్రాక్సీ వచ్చి, యీ స్కూలు నేను కట్టిస్తానన్నాడు. హయ్యర్ సెకండరీ స్కూలు కూడా ఉంటే చిన్నప్పటినుండే పిల్లలను చక్కని క్రమశిక్షణతో

పెంచవచ్చుకదా అని సంకల్పించుకున్నాము. తక్షణమే అమెరికానుంచి బోజాని అనే ఆయన వచ్చి హయ్యర్ సెకండరీ స్కూలు కట్టించాడు. బెంగుళూరులో కాలేజీ, హాస్టలు కూడా సంకల్పించుకున్న తక్షణమే కోవన్ సతీమణి వచ్చి వాటిని పూర్తిచేస్తానని బాధ్యత వహించింది. సిద్ధి జరిగేరీతిగా ఉంటేనే సాయికి సంకల్పం కలుగుతుంది. అలాంటి సంకల్పబలం ఉన్నందునే యిలాంటి కార్యములు చేయటానికి వీలవుతుంది. దీనిని మీరు గుర్తించాలి. అడగకున్నా ధనం వచ్చి పడుతుంది. అదే సాయి ప్రేమతత్త్వం. ఎంతమంది ధనవంతులు లేరు? అందరికీ త్యాగబుద్ధి పుడుతుందా! ధనమున్నప్పుడు సద్వినియోగపర్చుకునే విధానం గుర్తించాలి. పవిత్రమైన ప్రేమ తప్ప యీ ధనం నాకు అక్కరలేదు. మీరందరూ ఐకమత్యంగా ఉండి దివ్యత్వాన్ని ప్రకటించి, ప్రచార ప్రబోధలు సల్పి భారతదేశ ప్రాచీన సాంప్రదాయ, సంస్కృతులను నిలబెట్టాలి. జనసేవే జనార్దనసేవ అనే విశాల భావాన్ని పెంచుకోవాలి.

సాయి కోరేది ఒక్కటే. సోదర మానవులను ప్రేమించి, సమాజ సేవలు చేసి మానవత్వానికి సార్థకతను సంపాయించుకోవాలి. స్వార్థాన్ని త్యాగం చేయండి. పరార్థంలో ప్రవేశించండి. పవిత్రతను పెంచుకోండి. పామరులను ఆదుకోండి. మన సత్యసాయి సంస్థలు ప్రతి పట్టణములో, ప్రతి గ్రామంలో ప్రవేశించి వీధివీధిలో వాతావరణాన్ని పరిశుద్ధం గావించి ప్రజల్లో సోదరత్వాన్ని పెంచటానికి ప్రయత్నించాలి.

మీరు దానధర్మము చేయాలని ఆశ కలిగియున్నప్పుడు విద్యావిషయములందుగానీ, ఆరోగ్య విషయములందుగానీ, దీనులయందుగానీ, యిట్టి పవిత్రకార్యములలో మనస్సును అభివృద్ధి చేసుకొని పాల్గొనటంలో ఎట్టి అభ్యంతరము లేదు. ఇక్కడ కాదు ఎక్కడైనా సరే, బీదలకు సహాయము చేయుటకు, విద్యార్థులకు సహాయము చేయుటకు, రోగులకు తగిన సహాయము చేయుటకు మన సంస్థల వారు సిద్ధముగనే ఉండాలి. అట్టి కార్యమునే మీరు నా యొక్క కార్యముగా భావించుకోవాలి.

సత్యసాయికి ధనముతో పనిలేదు, స్వామికి మీ గుణముతోనే సంబంధము. భజన మండలి, సత్సంగము, స్టడీ సర్కిల్ మొదలగు సాధనా మార్గములకు ధనమెందుకు? బాలురు సిద్ధముగా ఉన్నారు. ఇంక బాలవికాస్ తరగతులకు డబ్బెందుకు? సత్యసాయీ సేవాసమితి , మహిళా విభాగము, సేవాదళము, భజన మండలి, బాలవికాస్. ఇవి ఒక చేతిలోని ఐదు వేళ్లు వంటివి. ఏది పెద్ద, ఏది చిన్న, ఏది ముఖ్యము, ఏది అముఖ్యము అనే ప్రశ్నే లేదు. అందరూ చక్కగా ఏకమై అన్యోన్యతా భావముతో సమరసముగా పని చేయాలి. అందరూ ఏకోన్ముఖముగా అన్ని కార్యక్రమములలోనూ పాల్గొనాలి. జీవులకు ఆదర్శముగా నిల్చుటకు ప్రాణమును కూడా విసర్జించుటకు సంసిద్ధముగా ఉండాలి. అప్పుడే అమృతత్వము ప్రాప్తించును. సత్యసాయీ సంస్థలు వేలాది గ్రామములలో స్థాపింపబడి పల్లెల వారి సేవ చేయుచున్నవి. పల్లెలో వారికి పరిశుభ్రత, గ్రామ నైర్మల్యము, విద్యాభ్యాసము యొక్క ఆవశ్యకత గురించి బోధించాలి. తిరునాళ మొదలైనవి జరుగునప్పుడు వారికి సహాయముగా సేవాదళ్ సభ్యులు నిలచి సహాయములనందించాలి. వరదలు, తుఫానులు మొదలైన వాటివలన బాధపడునప్పుడు ఎవ్వరినీ అడుగనక్కరలేదు. తక్షణమే వెళ్ళి దుమికి అన్ని విధాలా సహాయము చేయాలి. అందరూ భగవంతుని బిడ్డలే. మీరందరూ సోదరసోదరీ మణులే.

నిజమైన మానవత్వాన్ని, వ్యక్తిత్వాన్ని సాధించాలనుకున్నప్పుడు సేవలో ప్రవేశించవలసినదే. స్వార్థాన్ని త్యాగం చేయవలసినదే. దేశసేవను ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవలసిందే. ఈ లక్ష్యంతో గమ్యం చేరేవరకు ప్రయాణం సాగవలసిందే. దీనికి వయసు పరిమితని, రిటైర్మెంటని లేదు. కడపటి శ్వాసను కూడా సేవలోనే వదలాలి. సేవయే మన జీవితానికి గమ్యము. ఇట్టి ప్రభువు, యిట్టి సేవకులు ఉండటంచేత ఎంతటి కార్యాన్నైనా సాధించవచ్చు. సేవకులు లేకపోతే ప్రభువుకి విలువ లేదు. ప్రభువు లేకపోతే సేవకులు సక్రమ మార్గాన్ని అనుసరించరు. అహల్యవంటి రాయి, రామపాదం వంటి పాదం రెండూ చేరినప్పుడే శాపవిమోచనం. సత్యసాయివంటి ప్రభువు, సాయిభక్తులవంటి సేవకులు ఉన్నప్పుడు ఎన్ని కష్టాలైనా నివారణ కాగలవు. మన యిరువురికి సన్నిహితసంబంధ బాంధవ్యము ఏర్పడింది. సాయిని వదలి మీరుకానీ, మిమ్మల్ని వదలి సాయికానీ ఉండటం వీలుకాదు. దీనిని దృఢం చేసుకొని మీరు సేవలో ప్రవేశించండి.

మన భజన మండలియందు పాల్గొనుటకు అన్ని మతస్థులవారూ వస్తున్నారు. సత్యసాయి మతము సర్వమత సమ్మతము. కాబట్టి, ముస్లిమువారుగానీ, క్రైస్తవులుగానీ, పార్శీలుగానీ, బౌద్ధులుగానీ వేరెవరైనాగానీ వారివారి భాషలలో వారివారి భావములను అర్పించుటకు మీరు ఆనందముగా అవకాశమునందించాలి. సర్వమతములూ భగవత్సమ్మతము అనే సత్యతత్వాన్ని మీరందరూ అనుసరించినప్పుడే జగత్కళ్యాణమును సాధించుటకు సేవ సలుపు వారమౌతాము.

## 14

### దశసూత్ర ప్రణాళిక

**కాయంబుతో జేయు కార్యంబులెల్లను**
**మాటలాడుచునుండు మాటలెల్ల**
**తన మనస్సునుగల తలపులన్నింటికిని**
**పదియింద్రియంబుల పనులనెల్ల**
**బుద్ధితో కలిగెడు పూనికలెల్లను**
**చిత్తంబునందలి చింతలెల్ల**
**అనుదినంబును సల్పు ఆచారములనెల్ల**
**నియమంబుతో జేయు నిష్ఠలెల్ల**
**వైదికంబుల లౌకిక వర్తనములు**
**ఏమిచేసిన నవియన్ని ఈశ్వరునకు**
**తాను చేసెడి సేవగా తలచియున్న**
**సార్థకంబౌను శ్రీసాయి సంస్థలెల్ల.**

సత్యసాయి సేవాసమితి, సత్యసాయి భజన మండలి, సత్యసాయి సేవాదళము, సత్యసాయి స్టడీసర్కిల్, సత్యసాయి మహిళావిభాగము, సత్యసాయి ఎడ్యుకేషన్ యివన్నీ అంగాలు. అన్నింటికీ ప్రధానము సత్యసాయి. ఈ లక్ష్యాన్ని ముందు పెట్టుకొని మనమేమి చేసినా అది ఒకే లక్ష్యమైన సత్యాన్ని చేరుతుంది.

ఇంతవరకు ప్రపంచ సమ్మేళనములని, అనేక విధముల మతసమ్మేళనములని, ఆధ్యాత్మికతత్వమును చర్చించే సభలని ఎన్నో జరిగియుండవచ్చునేగానీ, అవన్నీ ఆయా దివ్యదేహములంతమొందిన తరువాతనే జరిగియున్నవి. అయితే ఈ దేహము, ఈ దేహమునకు సంబంధించిన యీనామము, లోకములో ఉన్నప్పుడే ఈ ప్రపంచ సమ్మేళనములు జరుగుచున్నవి అని మీరు గమనించవలెను. దీనికి మూలకారణము స్వామి తత్వమే. నేను కేవలం అందరితోపాటూ తిరుగుతూ, మాట్లాడుతూ, అందరితోపాటూ తింటూ ఉండటం వల్ల సామాన్య మానవత్వమేయని మీరు తలంచితే అది పొరపాటు. ఏయుగములోను అంతే. మానవత్వముతో కప్పబడటం వలన జనులు తెలుసుకో లేకపోయారు. నాఆటలు, నామాటలు, నాపాటలతో నేను కూడా మిమ్ములను భ్రమింపచేయుచున్నాను. అయితే ఎంత భ్రమించినా స్వామి దైవత్వమనే భావమును మాత్రము మీ హృదయపీఠముపైన ఎంతమాత్రము కదలక మెదలక ప్రతిష్ఠించిన మీకు నాయొక్క స్వరూపము కూడనూ దర్శింపగలుగుదురు. కానీ గడియారపు పెండ్యులము వలె ఒక నిముషము అటు ఒక నిముషము యిటు ఆడుతున్న వరకు మీకు నా యదార్థము బోధపడదు. మరొక విషయం. ముందు అవతారముల శక్తిసామర్థ్యములు ప్రపంచమును లొంగింప చేసుకున్నదానికి చక్రవర్తిగా ఉండటము వల్లనో, యింకేదైనా అధికారము ఉండటమువల్లనో కొంత కారణముగా ఉండవచ్చును. అయితే యీ సమయములోపల, ఈ కలియుగములోపల, ఈ సత్యసాయి సంబంధమైన స్వరూపములోపల ఏ దీనివల్ల యిన్ని దేశముల లోకులు వంగుతున్నారంటే అన్నింటికీ పరతత్వమైన ఆ దైవత్వమే మూలకారణమని మీకు చక్కగా బోధపడును. సనాతన ధర్మమును, వేదవిహితమైన ధర్మమును త్వరలోపల ప్రపంచమంతా వ్యాపింపచేయటమే సాయి సంకల్పము. కానీ స్వామియొక్క శక్తులను లోకములో విజృంభణచేసి ప్రపంచమును ఆకర్షించేది కాదు. సత్యాన్ని నిలబెట్టి, అసత్యాన్ని నిర్మూలనము చేసి ఆ ప్రకాశములో మీ అందరినీ ఆనందింపచేసే శక్తిస్వరూపమే ఈ సాయిస్వరూపము. ధర్మ ప్రచారమునకు స్థాపింపబడిన సాయీ సంస్థలు ఆధ్యాత్మిక అనుభూతిని ముఖ్యముగా పెంచుకోవలెను. అనుభూతి లేక ప్రచారము వ్యర్థము, అర్థశూన్యము. సత్యసాయీ సంస్థలలో ధనమునకు ఏమాత్రమూ చోటివ్వకూడదు. ధర్మమునకే అచ్చట స్థానము. ఆడంబరమునకు స్థానము అసలే ఉండకూడదు. నాకు మీ ప్రేమయే చాలు. మీరేది తినెదరో దానినే నేనూ ఆనందముగా ఆరగిస్తాను. ఎక్కువ యేదీ చేసి పెట్టనక్కరలేదు. పందిరి

ప్రమాణముగానీ, లైట్ల సంఖ్యగానీ నేను చూడను. హృదయ పరిశుద్ధిని మాత్రమే పరికించెదను. అదే అన్నింటికన్నా మంచి ప్రకాశవంతమైన లైటు. సాయిసంస్థల ఉద్దేశ్యము స్వామి పేరు ప్రతిష్ఠలను పెంచవలెనని కాదు. ఆధ్యాత్మిక సాధన అభివృద్ధికావలయుననేదే నా ఉద్దేశ్యము.

సాయి నెలకొల్పే సంస్థలన్నీ శాశ్వతమైనవి. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి మేము పల్లెలకు నీరందిస్తున్నాము. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి విద్యను, వైద్యమును ఉచితంగా అందిస్తున్నాము. రోగపీడితులైన పల్లెప్రజలను తీసుకువచ్చి వారికి తగిన వైద్యం చేయించాలి. ఎవరినైనా తీసుకురండి మాకు ఎట్టి అభ్యంతరము లేదు. ఈ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోటానికి అందరికీ సమాన హక్కుంది. ఏ కులంవారైనా, ఏ మతంవారైనా, ఏ దేశంవారైనా వచ్చి యీ ఆసుపత్రిలో చికిత్స పొందవచ్చు. మాకు ఎలాంటి భేదమూ లేదు. అందరికీ ఉచితంగా ట్రీట్‌మెంటు యిస్తాం. ధనంకోసం యేమాత్రం వెనుకంజవేయం. రోగనివారణ గావించి ప్రాణులను కాపాడటమే మా ప్రధాన లక్ష్యం. అందరూ సుఖంగా ఉండాలి. నాయొక్క వాంఛ అదియే. బీదలను సంతోషపెట్టినప్పుడే నాకు సంతోషం కలుగుతుంది. నా జీవితమంతా బీదలకోసమే ధారపోస్తున్నాను. వారి నిమిత్తమై నేను ఏమైనా చేస్తాను. నా ప్రాణాన్నైనా అర్పితం చేస్తాను. మనం చేసే పని మంచిదైనప్పుడు, మన భావాలు మంచివైనప్పుడు డబ్బుకోసం వెఱువనక్కరలేదు. దానంతటదే నడుచుకుంటూ వస్తుంది.

మీరందరూ ఒక్క సాయికుటుంబమని కాదు, దివ్యమైన భగవత్కుటుంబం. భగవంతుడు అన్ని దేశాలవారికి, అన్ని తెగలవారికి, అన్ని కులాలవారికి, అన్ని కాలాల్లోనూ ఒక్కడే. ఒక్కపేరు, ఒక్కరూపం సంకుచితమైనది. అన్నిరూపాలు, అన్ని నామాలూ ఒక్కటేనన్న విశాల భావాన్ని మనం పెంచుకోవాలి. ముఖ్యంగా మీకు పది సూత్రాలు నేను చెప్పదలచుకున్నాను.

మొట్టమొదటిది జననీ జన్మభూమిశ్చ. జన్మభూమి కన్న తల్లి వంటిది. ప్రతి మానవుడు దేశాభిమానం కల్గి ఉండాలి. ఏయే దేశాలవారు ఆయా దేశాల పట్ల అభిమానం కల్గిఉండటంలో దోషం లేదు. తన దేశాన్ని అభిమానించినంత మాత్రమున పరదేశాన్ని విమర్శించాలని లేదు. ఒక దేశాన్ని విశ్వసించినంతమాత్రమునమరొక దేశాన్ని ద్వేషించటం తగదు. కలలో, ఊహల్లోకూడా దేశద్రోహానికి ఏమాత్రం అవకాశాన్ని అందించరాదు. ప్రతి వ్యక్తికి దేశాభిమానం ముఖ్యమైనది.

ఏమతాన్ని ద్వేషించక సర్వమతాలనూ గౌరవించాలి. దేశాభిమానంతోపాటు అన్ని మతాలను గౌరవించటం రెండవది.

ఇంక మూడవది. ప్రతి మానవుని సోదరునిగా భావించి ప్రేమించాలి. మనందరి జాతి ఒక్కటే. అది మానవజాతి. మానవజాతిలో పుట్టినవారము కనుక మానవులందరూ ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించి సర్వమానవులను ప్రేమించాలి.

ప్రతి గృహమును, గృహ పరిసరములను పరిశుద్ధంగా ఉంచుకోటం నాల్గవది. తన గృహాన్నే కాక పరిసర ప్రాంతాలను కూడా పరిశుద్ధ పరచుకోటంచేత ఆరోగ్య, ఆనందములు చేకూరుతాయి.

భారతదేశంలో దానం పేర దేశానికి ద్రోహం జరుగుతున్నాది. దానమనగా దేశమంతటా భిక్షగాళ్లను తయారుచేయటంకాదు. భిక్షగాళ్లకు ఒక ఉపాధి కల్పించవచ్చునేగానీ దానం అలవాటు చేయకూడదు. వీరికి ఉపాధి కల్పించి, ఏదైనా ప్రదేశంలో ఏర్పాట్లు గావించి, కాలకాలానికి ఆహారము, వస్త్రము యిస్తూ అనుకూలమైన వాతావరణము కల్పించ వచ్చునేగానీ బజారులో అడ్డము వచ్చినవారికంతా డబ్బులిచ్చి భారతదేశమంతా భిక్షగాళ్లే అని చెడ్డపేరు తేరాదు. మనం భిక్ష మివ్వటం చేతనే పట్టణాలలో, పల్లెలలో సోమరత్వాన్ని పెంచుకొని భిక్షగాళ్లుగా తయారౌతున్నారు. ఇది ఐదవది.

ఇంక ఆరవది. లంచమిచ్చి పని చేయించుకోటం గానీ, లంచం పుచ్చుకొని పని చేయటంగానీ సత్యసాయి సంస్థలలో ఏమాత్రం జరగకూడదు. లంచం పుచ్చుకోటం, లంచం యిచ్చుకోటంవల్లకానీ సత్యసాయి సంస్థలకు తీరని ద్రోహం జరుగుతుంది. కనక సంస్థలకు సంబంధించిన వ్యక్తులందరూ ఈ లక్ష్యాన్ని దృష్టియందుంచుకొని జాగ్రత్తగా మెలగాలి.

ఏడవది. మానవులీనాడు అనేకవిధములైన సమస్యల నెదుర్కొంటున్నారు. ఈ సమస్యలను పరిష్కారం గావించుకొనే నిమిత్తమై మనం కొన్ని సూత్రాలను ఆదర్శంగా పెట్టుకోవాలి. పరస్పరం ద్వేషాలు, అసూయలు పెరుగుతూ ఉంటాయి. వీటిని అరికట్టుకోటానికి విశాల భావాన్ని పెంచుకోవలసి వస్తుంది. విశాలభావం కలగాలంటే జాతిమత భేదాలకు అవకాశమివ్వకూడదు. జాతిమతాలను పాటించరాదు. మీ పద్ధతులు మీ గృహాలలో ఆచరించుకోవచ్చుగానీ సమాజంలో వీటిని పాటించటంచేత ప్రమాదాలు సంభవిస్తాయి. ఒకరిని వంచించటం, మరొకరిని అభివృద్ధి గావించటం జరుగుతూ ఉంటుంది. అట్లుకాక సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరినీ

సోదరభావంతో ప్రేమించాలి. జాతిమత భేదభావాలు ఏమాత్రం పెంచుకోరాదు.

ఎనిమిదవది. తమ పనులు తాము చేసుకోలేనివారు సమాజసేవలు ఏరీతిగా చేయగలరు? సత్యసాయిసంస్థలకు చెందిన ప్రతి సభ్యుడు కూడా తనపని తానే చేసుకోవాలిగానీ యింకొకరితో చేయించుకోరాదు. కొందరు శ్రీమంతులై ఉండవచ్చు. వారు సేవక పరివారాన్ని పెట్టుకోవచ్చును, కొన్ని పనులకు వారిని ఉపయోగించ వచ్చును. కానీ తమ స్వంత పనులను కూడా ఆ పనివారితోనే చేయించుకోటం కేవలం సోమరత్వం. ఇట్టి సోమరత్వానికి మరిగిన వ్యక్తి సమాజసేవ చేయలేడు. సమాజసేవ చేయనివాడు సాయిసంస్థలో ఉండటానికి అర్హుడుకాదు. సమాజసేవ చేసే నిమిత్తమె మొట్టమొదట తమ సేవ తాము చేసుకోవాలి.

ఇక తొమ్మిదవది. పాపభీతి, దైవప్రీతి ప్రతి ఒక్కరికీ ఉండాలి. నిరంతరం భగవంతుని ప్రేమించాలి. పాపాన్ని ద్వేషించాలి. పాపాలు చేస్తున్నంతకాలం దైవం చిక్కడు.

పదవది. ఇది సర్వసామాన్యమైన విషయం. ప్రభుత్వ చట్టనిబంధనలను మనం ఏమాత్రం అతిక్రమించరాదు. ప్రభుత్వ శాసనాలను, చట్టాలను తూ.చ. తప్పకుండా అనుసరించాలి. సత్యసాయిసంస్థ సభ్యులు యీ నియమనిబంధనలను చక్కగా పాటించి ప్రభుత్వానికి కూడా ఆదర్శము నిరూపించాలి. చట్టవిరుద్ధమైన కర్మలు మన సంస్థల సభ్యులు ఎంతమాత్రం చేయరాదు.

ఈ పది సూత్రాలు మీ హృదయంలో ప్రతిష్ఠించుకొని సంస్థకు సరైన ఆదర్శము నెలకొల్పాలి. మన ఆచరణ, మన పనులు సరైనవని ప్రజలకు, ప్రభుత్వానికి సంపూర్ణ విశ్వాసం కలిగించాలి. ఇది మన కర్తవ్యం, మానవ ధర్మం, సమాజనీతి. సంస్థ నిబంధనలను చక్కగా పాటించినప్పుడు సంస్థను మనం పెంచుకోనక్కరలేదు. అదే పెరిగిపోతుంది. ఈ క్రమశిక్షణను పాటించుకుంటూ పోతే సంస్థ అభివృద్ధి మనం కోరనక్కరలేదు. ఎవరియందు ఎట్టి దోషములున్నా మనమా దోషములనెంచక వారిని ప్రేమించి వారితో సహకరించి ప్రేమను అభివృద్ధి పరచుకోవాలి.

## 15

### నా జీవితమే నా సందేశము

**పూవులెన్నొ తెచ్చి పూజలు చేసిన**
**మెచ్చబోడు తాను పుచ్చుకొనడు**
**హృదయకమలమివ్వ సదయుడై గ్రహియించు**
**సత్యసాయి ప్రేమశాంతిదాయి.**

స్వామియే మీరు, మీరే స్వామి. స్వామి ప్రత్యేకంగా లేడు. ఎవరు హృదయపూర్వకంగా ప్రేమిస్తారో వారి సొత్తునే నేను. నాకు కావలసింది ప్రేమ ఒక్కటే. మీరు పుట్టినప్పటినుండి నీ యింట, వెంట, జంట ఉన్నది ప్రేమ ఒక్కటే. ఏ బంధువులుగానీ, మిత్రులుగానీ మీ వెంట రాలేదు. మీ వెంట వచ్చింది ప్రేమ ఒక్కటే. ఆ ప్రేమయే దైవం. కనుక, ప్రేమచేత జీవితాన్ని గడపండి. ప్రేమలో మీ జీవితాన్ని లీనం చేయండి. ఇదే మీరు స్వామికి యివ్వవలసిన కానుకగా భావించండి. మంచిగానీ, చెడ్డగానీ మీ సర్వస్వము అర్పించండి.

**కాంక్షతోడ నెందు కర్మంబు లొనరింప**
**దక్కబోదు ఫలము ధరణియందు**

## కాంక్ష వదలి భక్తి కర్మలు ఒనరింప
## ఫలితమొసగుచుండు పర్తివిభుడు.

ఈ దేహం పుట్టినప్పటినుండి సేవలోనే నిమగ్నమైంది. మీరు కూడా సేవకే మీ జీవితాన్ని అంకితంచేయాలి. ఇదియే నా సందేశం. నేను యేది చెప్పినా ముందు నేను చేసి మీకు చూపిస్తున్నాను. నేను సర్వులను ప్రేమించి మిమ్మల్ని కూడా ప్రేమించమని చెబుతున్నాను. ఈనాడు జగత్తులో ఆనందం లేకుండా పోవటానికి కారణం మానవునిలో ప్రేమ లోపించటమే. దేహం ఒక డ్రస్సు వంటిది. మీరు యీ రోజు ఒక కలరు డ్రస్సు, రేపు మరొక కలరు డ్రస్సు వేసుకోవచ్చు కదా. దేహము కూడా మీరు ధరించిన డ్రస్సు వంటిదే. ఏదో ఒకనాడు యీ డ్రస్సు మారిపోతుంది. మీరు దానికి యేమాత్రము వెఱువకూడదు. పుట్టటానికి కారణం ఏమిటి? చావటానికి కూడా అదే కారణం. ఈ దేహం కదలిపోయే మేఘం వలె వస్తుంది, పోతుంది. అయితే యిది ఉన్నంతలో పదిమందికి సేవ చేయాలి. జీవుడే దేవుడు కనుక, జీవుణ్ణి సేవిస్తే దేవుణ్ణి సేవించినట్లే.

వేదము 'యద్దృశ్యం తన్నశ్యం' అన్నది. ఏది కనిపిస్తున్నాదో అదంతా శూన్యమైపోతుంది. దృశ్యకల్పితమైనవన్నీ నేడు ఉండవచ్చును, రేపు పోవచ్చును. కానీ దైవానికి రాకపోకలు లేవు. అతడు ఎప్పటికీ ఉంటాడు. అలాంటి నిత్యసత్యమైన దైవాన్ని విస్మరించి, అశాశ్వతమైన జగత్తును విశ్వసించి కాలాన్ని వ్యర్థం గావించుకోకండి. కా అనగా శుభము, సుఖము. ల అనగా అందించుట. కనుక శుభమును, సుఖమును అందించునదే కాలము. కాలమునకు ఎట్టి స్వరూపము లేదు. కానీ అన్ని గుణములు కాలములోనే యిమిడి ఉన్నాయి. జ అనగా పుట్టుట. గత్ అనగా పోవుట. కనుక యీ ప్రపంచమంతా క్షణక్షణమునకు మార్పుచెందునదే. మార్పుచెందే యీ జగత్తునందు మార్పుచెందని దివ్యత్వము అంతర్భూతమై, అవ్యక్తమై నిలచియున్నది. ఇట్టి కాలస్వరూపుడైన పరమాత్మను మనము ప్రతీక్షణం అనుభవిస్తూనే ఉన్నాము. కాలాన్ని వ్యర్థం చేస్తే జీవితాన్ని వ్యర్థంచేసినట్లే. 'నా జీవితమే నా సందేశం' అని చెబుతూ ఉంటాను. ఎందుకంటే, నేను ఒక్క క్షణమైనా వ్యర్థం చేయను. స్వామి భోజనం చేస్తూనే వెళ్లి పడుకుంటారని కొంతమంది అనుకుంటారు. కానీ నిద్ర అంటే ఏమిటో నాకు తెలియదు. నేను నిద్రపోను. భక్తులనుండి తీసుకున్న జాబులను చూస్తాను. భక్తులయొక్క పనులుచేస్తూ కాలాన్ని సద్వినియోగ పరుస్తాను. అయితే నాకు కావలసింది యేదీ లేదు. నాకోసం నేను చేసుకొనేది యేదీ లేదు. నా కాలి గోటినుండి తల వరకు ఎక్కడా స్వార్థం అనేది కనబడదు. నేనెప్పుడూ యేదో ఒక పనిలో నిమగ్నమై ఉంటాను. నేను పండుకున్నా పనిచేస్తుంటాను. ఇతరులకోసం నేను పండుకోవలసి వస్తుంది. కనుక, వారి విశ్రాంతికోసం నేను విశ్రాంతి తీసుకోవలసి వస్తుంది. అయితే నాకు విశ్రాంతి ఏమిటి? భక్తుల యొక్క పనులు చేయటమే విశ్రాంతి.

వాంఛలు, వ్యామోహం మితిమీరిపోయేకొలదీ, బంధన అధికమౌతుంది. ఈ బంధన చేతనే మీరనేక కష్టములకు గురౌతున్నారు. బంధనకు మూలం కోరికలే. కనుక కోరికలను తగ్గించుకోండి. నిశ్చింతగా ఉండగలరు. కోరికలు తరిగే కొలదీ మీలో శాంతి పెరుగుతూ వస్తుంది. ఈ జీవితమనే ప్రయాణములో కోరికలే లగేజివంటివి. లెస్ లగేజ్ మోర్ కంఫర్ట్, మేక్ ట్రావెల్ ఎ ప్లెజర్. కానీ మానవునిలో కోరికలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. రెండునిముషాల్లో తన ప్రాణం పోతుందని తెలిసినా తానేదో ఒక కోరిక కోరుతాడు. ఈ కోరిక వల్ల వచ్చే ఫలితమేముంది? ఏమీ లేదు. నిజంగా కోరికలు లేకపోతే ఎంత ఆనందం పొందవచ్చు! మీరు నమ్మండి, నమ్మకపొండి నాకు ఏ కోరికలు లేవు. కనుక నాకు ఎట్టి విచారములు లేవు. మీరు నన్ను అనుసరించండి. అలా చేసినప్పుడు మీకెంతో గొప్ప ప్రాప్తి కలుగుతుంది. మీరుకూడా ఆనందమయమైన, బంధరహితమైన జీవితాన్ని గడుపుతారు. కోరికలు బంధిస్తాయేగానీ, బంధవిముక్తులను చేయజాలవు.

నాకు అదికావాలి, యిదికావాలి అనే ఆశ ఏనాడు కూడను లేదు, రాబోదు. మీ ఆనందమే నా ఆహారము. అట్టి ఆహారము నేను భుజించుటకై అనేకవిధములైన ప్లానులు వేస్తుంటాను. నాకు ఆనందం కావాలనుకున్నప్పుడు మీకు ఆనందాన్ని అందించి నేను ఆనందాన్ని తీసుకుంటాను. ఇది దైవముయొక్క గుణము మాత్రమేగానీ వేరొకటి కానేరదు. కనుకనే అన్నాను 'నా జీవితమే నా సందేశము' అని.

పిల్లలతో పిల్లవానిగా, పురుషులతో పురుషునిగా, స్త్రీలతో స్త్రీగా, బాలురతో బాలుడుగా ప్రవర్తించి, వారితో కలసిమెలసి, వారి సుఖదుఃఖములలో పాల్గొని, కష్టనష్టములతో బాధపడేవారిని ఓదార్చి అందరికీ ఆహ్లాదమునూ, ఆనందమునూ, ఆదేశమునూ అందించేదే నా అవతార కార్యము. 'నా జీవితమే నా సందేశము'.

ఒక్కొక్క సమయములోపల నేను మరొకరి బాధను తీసుకుంటాను. నేను నా ఆనందంకోసం ఈబాధలు తీసుకుంటున్నానుగానీయిందులోఎవరి వత్తిడి లేదు. కానీ అన్నింటియందు మానసిక కంట్రోలు అత్యవసరమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.'నేనీ దేహమును కాదు, నేను ఆత్మను' అని గుర్తించాలి. అప్పుడు దేహానికి సంబంధించిన బాధలు, కష్టాలు మీపై ప్రభావం చూపలేవు. దేహానికి యెన్ని బాధలో వస్తుంటాయి. వాటిని మనం లెక్కచేయకూడదు. ఈ దేహము కష్టములనుండి పుట్టింది, కష్టములనుండి పెరిగింది. కనుక, కష్టములను అనుభవించక తప్పదు. ఇది దేహముయొక్క సహజ ధర్మము. ఆనందము ఆత్మయొక్క సహజ ధర్మము. మనం ఆత్మ ధర్మమును అనుసరించాలేగానీ, దేహధర్మమును అనుసరించకూడదు. దేహాత్మభావాన్ని త్యజించాలి. ఈ దేహము ఎలాంటిది?

**మలినపుకొంప రోగముల ముగ్గెడు సేవక గంప**
**చలనము పొందు దుంప భవసాగర మీదగలేని కంప అం**
**బులపొది లెమ్ము చూడ మనమెప్పుదలంప దేహమింక ని**
**శ్చలమని నమ్మబోకు మనసా! హరిచింతన ఆచరించవే!**

అనిత్యమైన దేహచింతన చేయటమెందుకు? నిత్యసత్యమైన దైవచింతన చేయండి. కష్టాలు వస్తాయి, పోతాయి. ఇది ప్రవృత్తి లక్షణము. కష్టసుఖాల పట్ల సమత్వం వహించటమే నివృత్తి లక్షణం. ఇది నేను కేవలం చెప్పటమం మాత్రమే కాదు, చేసి చూపిస్తున్నాను కూడా. మీకు తెలుసు. దేహసంబంధమైన బాధలను నేనేమాత్రము లెక్కచేయను. ఎంత కష్టమైనా నేను నడుస్తూనే ఉంటాను. అందరినీ చూస్తూనే ఉంటాను, మాట్లాడుతూనే ఉంటాను. దేహమే నేననుకుంటే బాధలు మనల్ని క్రుంగతీస్తాయి. ఈ దేహము నీది. నీవు దేహము కాదు. ఒక చిన్న ఉదాహరణ. 'ఇది నా కర్చీఫ్' అని అన్నప్పుడు కర్చీఫ్ నీకంటె వేరుగా ఉన్నది కదా! కనుక, కర్చీఫ్‌ను యేమి చేసినప్పటికీ నీకు బాధలేదు. అట్లే 'ఇది నా దేహము' అని అన్నప్పుడు నీవు వేరు, దేహము వేరు. కాబట్టి, దేహానికి కలిగే బాధలు దేహానివేగానీ నీవి కావు.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు జూడ యా**
**దేహియే దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!**

ఆత్మయే నీ నిజ స్వరూపము. కనుక, దేహానికి కలిగే బాధలకు నీవు చింతించ కూడదు. ఎవరో నిన్ను తిట్టారని బాధపడతావు. తిడితే నీకు వచ్చిన నష్టమేమిటి? గట్టిగా తిడితే గాలిలో కలిసిపోతాయి. లోలోపల తిట్టుకుంటే వాని మనస్సులోనే నిలచిపోతాయి. ఏవీ నీకు తగలవు. ఏవీ నీ దగ్గరకు రావు. అలాంటప్పుడు ఎందుకు జగడం వేసుకోవాలి? దూషణకు క్రుంగకూడదు, భూషణకు పొంగకూడదు. సత్యమైన భావముతో నిత్యమైన ఆత్మతత్వముపై నీ మనస్సును నిల్పినప్పుడే నీవు నిజమైన మానవునిగా రూపొందుతావు. ఇది నా జీవితంద్వారా నేను మీ కిచ్చే సందేశము.

అందరినీ ప్రేమిస్తాను. దుష్టులను కూడా ప్రేమిస్తాను. నన్ను దూషించిన వారిని మరింత ప్రేమిస్తాను. పరిహసించిన వారిని మరింత దరికి చేరుస్తాను. దానివల్ల నాకెంతో ఆనందం కలుగుతుంది. ఎప్పుడూ త్యాగమేగానీ నాకు భోగమనేది లేదు. త్యాగమే నా భోగం. కనుకనే 'నా జీవితమే నా సందేశము'.

నేను అందరినీ ప్రేమిస్తాను. ప్రేమలో యెంతో పవిత్రత ఉంది. ప్రేమయే క్రమక్రమేణా జ్ఞానస్వరూపాన్ని పొందుతుంది. పవిత్రమైన ప్రేమచేతనే నేను యింతకాలము ఇంతమంది ప్రజలకు దివ్యత్వాన్ని బోధించుటకు వీలైంది. మీకందరికీ నేనేమైనా ఇన్విటేషన్లు పంపించానా? లేదే! నా ప్రేమయే మిమ్మల్ని యిక్కడికి రప్పించింది. మీరు ఆ సత్యాన్ని గుర్తించండి. మీరందరూ యిక్కడికి ఎందుకోసం వచ్చారు? ఇక్కడున్న ఆనందము మీ ఇంట్లో లేదు, మీ గ్రామంలో లేదు, మీ రాష్ట్రంలో లేదు, మీ దేశంలో లేదు. అక్కడ లేని ఆనందాన్ని ఇక్కడ పొందాలనే మీరు వస్తున్నారు. అట్టి ఆనందమును యిచ్చే దివ్యత్వాన్ని మీ హృదయంలో భద్రంగా ప్రతిష్ఠ చేసుకోవాలి. ఒక్కొక్కరి భావములు ఒక్కొక్క రకంగా ఉంటాయి. ఒకరు మంచిగా భావించ వచ్చు, ఒకరు చెడ్డగా భావించ వచ్చు. మంచి చెడ్డలు మీ మనస్సు యొక్క ప్రభావమేగానీ, సాయికి వాటితో సంబంధము లేదు. నాది ప్రేమతత్వము ఒక్కటే. నేను ప్రేమను చూస్తాను తప్ప ప్రవర్తనను, భావాలను ఏమాత్రమూ విచారించను. మీ దృష్టి యెలాంటిదో మీకు అలాంటి భావాలే కలుగుతుంటాయి. నా తత్వం

ఎప్పుడూ ప్రేమయే. అంతా పవిత్రం. హృదయం పవిత్రం, మాటలు పవిత్రం, చేతలు పవిత్రం, సర్వం పవిత్రం. దీనిని పురస్కరించుకొనియే నేను 'నా జీవితమే నా సందేశం' అన్నాను. నన్ను అనుసరించండి.

అన్ని ఆకారాలకు లోకంలో శతృత్వమున్నదిగానీ సాయికి మాత్రం శతృవులు ఎక్కడా కనిపించరు. కొందరు అపోహలను అభివృద్ధి పర్చుకొని, బాహ్య చర్యలను మాత్రమే చూస్తూ, హృదయతత్త్వాన్ని విస్మరించటంచేత సాయికి కూడా శతృవులున్నట్లు భావిస్తుంటారు. వారి దృష్టిలో శతృవులున్నట్లు కన్పించవచ్చుగానీ నా దృష్టిలో శతృవులెవ్వరూ లేరు. నా కందరూ ప్రియులే. నాకున్న సంపద, ఐశ్వర్యము లోకంలో మరెవ్వరికీ లేదు. నాకున్నంత సంపద ప్రపంచబ్యాంకులో కూడా లేదు. నాకున్నంత ఐశ్వర్యము ఏ మహారాజులకు, చక్రవర్తులకు కూడా లేదు. ఏమిటా సంపద? ఏమిటా ఐశ్వర్యం?

**సాయికున్నట్టి ఐశ్వర్య సంపదలకు**
**సాటి ఐశ్వర్యమున్న దెచ్చోటనైన**
**సాయి ఐశ్వర్య మేమన్న స్వార్థరహిత**
**నిత్యనిర్మల ప్రేమయే నిజము నిజము.**

నిస్వార్థమైన, నిర్మలమైన ప్రేమ. నిస్వార్థ నిర్మల ప్రేమతో జీవితం గడపటంచేతనే నా శరీరం కూడా ఎంతో తేజోమయంగా ఉన్నది. ఈ దేహంలో ఎట్టి బలహీనతలు కూడా లేవు. పవిత్రమైన గుణమే దీనికి కారణం. సాయినుండి ఎవరైనా దూరమైనప్పుడు సాయిబాబానుండి కొంతమంది దూరమైనారు, ఇంక సాయిబాబా బలం తగ్గిపోవచ్చును అని భావిస్తుంటారు. వారు నాపై యిష్టం లేక దూరం కావటంలేదు. వారి యిష్టములు నెరవేరకపోవటం వలన దూరమైపోతున్నారు. నా చేంతనున్నంతవరకు వారి యిష్టములు జరగవేమోనని, లౌకికమైన జీవితం గడపాలన్న ఆశవున్నవారు నన్ను వదిలించుకొని జగత్తులో ప్రవేశిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నించినప్పుడు వారి గౌరవాన్ని కాపాడుకోటానికి సాయిబాబాపై ఏవో కొన్ని అపోహలు కల్పిస్తుంటారు. నన్ను దూషించటంవలన వారికి ఆనందం కలిగితే అదికూడా నాకు సంతోషమే. వారికి ఆ విధంగా గౌరవం లభించటం కూడా నా ఉపకారమే. నదులవలన సముద్రమున్నదా, సముద్రమువలన నదులు ప్రవహిస్తున్నాయా అని విచారిస్తే సముద్రం వల్లనే నదులు ప్రవహిస్తున్నాయని మనకు తెలుస్తుంది. నన్ను ఆశ్రయించటంచేత వారి గౌరవ ప్రతిష్టలు పెరుగుతున్నాయేగానీ వారివల్ల నా గౌరవప్రతిష్ఠలు పెరగటంలేదు.

కొందరు వ్యక్తులు సాయి తమకు దక్కకపోయేసరికి అదోవిరక్తిగా మారటంతో వారు విరుద్ధ భావాలు పెంచుకుంటూ పోతారు. అంతేకానీ సాయిలో ఏ కించిత్తైనా దోషం చూపటానికి ఎవ్వరికీ అధికారం లేదు. కారణమేమనగా నాది నిస్వార్థ భావము. పరోపకార దృష్టిగల హృదయం. అందరి యోగక్షేమాన్ని కోరే స్వభావం. లోకానందమే నా ఆనందముగా భావించే హృదయము. ఇట్టి హృదయం కనుకనే దినదిన ప్రవర్థమానమై ఆనందంతో జీవితం గడుపుతున్నాను.నాలో ఏ క్షణమైనా విచారమనేది కన్పించదు.

నా పుట్టిన పండుగ అని మీరు భావిస్తున్నారు. నాకు పుట్టిన పండుగన్నదే లేదు. మీ ఆనందము నిమిత్తమై, మీ ఆశల నిమిత్తమై నేను ఏవో కొన్ని కార్యక్రమములు జరుపుతూ పోతుంటాను కానీ నాకు రెండూ లేవు. పుట్టుక ఉంటే కదా చావు, చావు ఉంటే కదా పుట్టుక. నాకు రెండూ లేవు. పుట్టిన దినమునకు ఒక కానుక నాకు యివ్వటానికి ప్రయత్నించండి. ఈ కానుక నేను అడగక తప్పదు. ఏ కానుక అది? మీ స్వార్థాన్ని తగ్గించుకోండి. దురాశను తగ్గించుకోండి. త్యాగాన్ని అభివృద్ధిపరచుకోండి. విశాలమైన మానవుడిగా రూపొందండి. ఈ విషయములందు మీరు సాధనలు సల్పితే మీరు సరైన ఆనందాన్ని అనుభవించటానికి అవకాశముంటుంది.

పవిత్ర సంస్కారము వలన మానవ జన్మము మీకు లభించినది. దివ్యావతారము యొక్క దర్శన స్పర్శన సంభాషణలను పొందే భాగ్యము లభించినది. సాక్షాత్ దైవత్వము యొక్క సన్నిధి చిక్కినది. చిక్కిన సాయిని వక్కసేయక చక్కచేసుకోండి. మీమీ కర్మములన్నింటినీ దైవానుగ్రహముతో తీర్చిదిద్దుకోండి. మీ దృష్టి, మీ భావము, మీ చర్యలు, మీ వాక్కులు వీటిని జీవితమంతా పవిత్రము గావించండి. జీవితమునకు పరిశుద్ధమైన ఆనందమే సోపానము! దానికి మీరు కొంత ప్రయత్నము సల్పిన చాలు. ఆవేదన పడితే చాలు. స్వామియొక్క అనుగ్రహము తోడుగా వుండును. నా దగ్గరకు మీరు ఒక్క అడుగు పెట్టితే చాలు, నేను నూరడుగులు మీ దగ్గరకు పరిగెత్తి వస్తాను. మీరు వెనుకంజ వేస్తుంటే, నేను వచ్చి ప్రయోజనమేమి? శాంతి భద్రతలతో మీరందరూ జీవితము గడుపుటకు నేను తప్పక అనుగ్రహిస్తాను.ప్రపంచమంతా స్వామి చేతిలోనే ఉన్నది. (1978లో) ఊటీ నుంచి వస్తుండగా, ఒక విద్యార్థి నాఫొటో(పోలరాయిడ్

కెమేరాతో) తీయుటకు ప్రయత్నించాడు. అప్పుడు నేను, 'నేనెవరు అని, నా నిజ స్వరూపమేది అని నువ్వు తీసే ఫొటో ద్వారా చూపిస్తాను' అన్నాను. ఆయన క్లిక్ చేసాడు. కెమేరా నుంచి వచ్చిన ఫొటో దత్తాత్రేయునిది. త్రిమూర్తి



స్వామి యొక్క ప్రేమ ఎంత పవిత్రము, ఎంత మధురము, ఎంత విశాలము అనేది సున్నిత హృదయములకు అవగాహనమగును. దానిని అందించుటకు నేనెప్పుడూ సంసిద్ధుడను. అందుకొనుటకు కావలసిన అర్హత సంపాదించుటకు ప్రయత్నించేది మీ పని. ఈనాటినుండి దానికి పూనుకోండి.

## 16

### అభయప్రదానము

**ఇది ఘటంబిది పటంబిది గృహమ్మిది కుడ్య**
**మిది అరణ్యము శైలమిది యటంచు**
**ఇదిభూమి ఇదిజలంబాతడు వైశ్వానరుం**
**డిదిగాలి ఆకసంబిది యటంచు**
**ఇతడు దివాకరుండితడు నిశాకరుం**
**డివి తారలు గ్రహంబులివి యటంచు**
**ఇవి అచేతనములౌ ఇవి చేతనములంచు**
**ఆతడీతడేయీతదాతడేయంచు**
**అరయ నాకంటె భిన్నంబులై జడంబు**
**లైన బాహ్యపదార్థ సహితములెల్ల**
**సాధనలు లేక ఎఱిగెడి సాక్షినగుచు**

**నేను చిద్రూపుడంచును నెరుగరయ్య!**

విజ్ఞాన విశిష్టుడైన మానవునికి పరమ లక్ష్యము మోక్షము. అట్టిలక్ష్యసిద్ధికి సాధనము జ్ఞానము. అందుకనే 'జ్ఞానాదేవతు కైవల్యం' అని ఉపనిషత్తులు చాటుచున్నవి. తరించదలచిన వారలకు సంజీవిని వంటిది సాయినామము. అట్టినామమును నాలుకపై నాట్యమాడించువారికి, అభిమాన మమకారములు అతి శత్రువులు. అసలు మానవుడు జ్ఞానస్వరూపుడు. అనాదికాలమునుండి జీవుడు మాయాకల్పితమై అసత్య, అనిత్యమైన ఈ జగత్తును సత్యంగా, నిత్యంగా భావిస్తున్నాడు. వస్తుతః మానవుడు, పరమాత్మతో అభిన్నుడే. అయిననూ అజ్ఞానముచే తెలిసికొనలేక తాను పరమాత్మకంటె వేరని భ్రాంతిచెంది కర్తగానూ, భోక్తగానూ భ్రమించి జనన మరణ రూపమైన సంసారములో పుట్టుచూ, గిట్టుచూ అంతులేని దుఃఖమును అనుభవించుచూ, గట్టేదొరకక పరితపించుచున్నాడు. అట్టి దుః ఖమునుండి దూరముచేసే ఆనందరసమును అందించునట్టిదే ఆధ్యాత్మిక మార్గము.

సత్యాన్వేషణమే సాయీ భక్తులకు నిత్యకృత్యము కావాలి. ప్రేమయే వారికి స్వభావమై వెలగాలి. భక్తులకు బాహ్యాడంబరము కంటె భావశుద్ధి ప్రధానమైనదిగా భావించాలి. విశ్వమునే విశ్వరూపునిగా విశ్వసించి ప్రతి పదార్ధమును యదార్ధముగా చూడాలి. అదే యదార్ధము. కాలమును పవిత్రముచేయు కర్మలను ఆచరించవలెను. అదే కాలస్వరూపుని పూజ.

మాటలతో, పాటలతో సాయిభక్తులని పిలువబడరు. ఆటలు సరియైనవిగా ఉండినప్పుడే సాయిభక్తుడు. అదే సాయికి హాయి. భావశుద్ధి బాబాకు అతిప్రీతి. ప్రవర్తనే ప్రధానమైన పవిత్రము. మంచి చేసి చెప్పవలెను. కానీ చెప్పియో లేక బోధించియో చేయకున్న సాయినామమునకు ద్రోహము చేసినవారగుదురు.

ఆడంబరము మొట్టమొదట అణచ వలెను. వెన్నెలవంటి చూపు, వెన్నవంటి హృదయము, తేనెవంటి మాట సాయీ భక్తులకు సహజమై వెలగాలి. స్వార్ధరహితమైన సమత్వప్రేమ సాయి స్వరూపము, అన్యోన్యమైన సమంజస ప్రేమ సాయి దృష్టి. ఈ రెండింటినీ పాటించినవారే సాయిభక్తులు. అట్లుకాక పరులను దూషించుచూ, తన గొప్పనే ప్రకటించుకొనుచూ ధన, వస్తు, వాహనములకై ప్రాకులాడువారు భగవద్రోహులగుటయే గాక ఆధ్యాత్మిక మార్గమునకే అంతరాయము కలిగించినవారగుదురు.

పరమాత్ముడు ప్రేమకు వశుడుగానీ పదార్ధములకు వశుడుకాడని చక్కగా తెలిసికొనవలెను. అట్టి పవిత్ర కర్మలతో సత్యమునూ, ప్రేమనూ అనుభవించినప్పుడే లోకమును ప్రశాంతముగానూ పవిత్రముగానూ, రామరాజ్యముగానూ దర్శించవచ్చును.

భక్తికి తగిన ప్రవర్తనలను మారీనవుడు ప్రధాన నేత్రములుగా ధరించవలెను. నేత్రములు ప్రేమమయములైనప్పుడే లోకమంతా బ్రహ్మమయమగును. వ్రతములు, ఊరేగింపులు, అర్చన, అభిషేకములకంటే సత్కర్మలతో, సదాచారములతో, సద్వాక్యములతో సాయిని సేవింపుడు. అదే సాయికి ప్రీతి అయిన పదార్ధము. ఇదే యదార్ధము.

**శ్రీపుట్టపర్తి నిలయుడు**
**కాపాడును నిన్నునెపుడు కరుణాకరుడై**
**చేబట్టి నిన్ను బ్రోచును**
**ఏపట్టున విడువకుండ ఏలును నిన్నున్.**
**అడవిలోనున్న ఆకాశముననున్న**
**పట్టణముననున్న పల్లెనున్న**
**గుట్టమీదనున్న నట్టేట బడియున్న**
**మదిని సాయి నిన్ను మరువవెపుడు.**

ఇదే ఆనందబిందువుల ఆరగింపు, ఇదే సాయి బిక్ష. శ్రీసాయిరక్ష.

సోఽహం

విషయవాంఛలు నిన్ను వెంటాడు తరినీవు
నోరెత్తి సాయీశ శరణమనుము
కష్టపరంపరల్ కాల్దువ్వినప్పుడు
కరమెత్తి సాయీశ కావుమనుము
సంసార తాపముల్ సంఘటిల్లినప్పుడు
మనసార సాయీశ మరువననుము
మది దురహంకార మొదవినయపుడు
తలవంచి సాయీశ దాసుడనుము
సత్యభాషివై సాయీశు సాక్షి గనుము
మోక్షమాశించి సాయీశు మ్రోలమనుము
విశ్వమోహన గానము వీనులలర
ఆలపించిన శ్యాముడే యితడు సుమ్మి.

సాయి రక్షింపుము సాయి రక్షింపుము
సాయి రక్షింపుము సాయిదేవ!
సాయి నీ దాసుడ సాయి నీ దాసుడ
సాయి నీ దాసుడ సాయిరామా!
సాయి వందనములు సాయి వందనములు
సాయి వందనములు సత్యసాయి!
సాయి నీవే గతి సాయి నీవే గతి
సాయి నీవే గతి సాయినాథ!
సత్యముగ నాకు నీవే గతి సాయినాథ!
శ్రీసత్యసాయినాథ! అనాథనాథ!
శ్రీనాథ! సచ్చిదానందమూర్తి
శ్రీసాయి పుట్టపర్తి సచ్చక్రవర్తి!